సమావేశము - VIII
వాల్యూము - 2
నెం. 2

వెల : రూ. 28-00
6 నవంబరు, 2017
సోమవారం,
(శక సం. 1939,
కార్తీక - 2-3)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

<u>విషయ సూచిక</u>


| | | |
|---|---|---|
| **I.** ప్రశ్నోత్తరాలు | ... | 1 |
| **II.** సభా కార్యక్రమం : | ... | 18 |
| 1. వాయిదా ప్రతిపాదన | | |
| 2. ప్రత్యేక ప్రస్తావనలు | | |
| 3. పిటిషన్ | | |
| **III.** లఘు చర్చ : | ... | 20 |
| "రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి" గురించి | | |

# తెలంగాణ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ ఎస్. దుర్గాప్రసాద్ |
| | | శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి |
| | | శ్రీమతి వి.ఎస్. ప్రసన్నకుమారి |
| | | శ్రీ బి. కమలాకర్ |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (ఎనిమిదవ సమావేశము – ఏడవ రోజు)

## సోమవారం, నవంబరు 06, 2017

(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైంది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

**మిస్టర్ ఛైర్మన్:–** సభకు నమస్కారం. ఇప్పుడు ప్రశ్నోత్తరాల సమయం.

### I. ప్రశ్నోత్తరాలు

### రైతులకు ఆర్థిక సహాయం

ప్రశ్న నెం.2362(61)

డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎం.ఎల్.సి.:– గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) రాష్ట్రంలోని రైతులకు 2018 సంవత్సరం నుండి ప్రతి పంట కాలానికి రూ.4000/–ల చొప్పున చెల్లించాలని నిర్ణయించిన విషయం వాస్తవమేనా;

(ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

(ఇ) ఈ అంశం క్రింద లబ్ధిపొందే వారి సంఖ్య ఎంత;

(ఈ) కౌలు రైతులకు కూడా సదరు ఆర్థిక సహాయాన్ని వర్తింపచేయడమవుతుందా?

గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి (శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి):– (అ) అవునండీ.

(ఆ) 2018 ఖరీఫ్ సీజన్ నుండి ఇన్‌పుట్ కొనుగోలు కోసం రైతులకు ఎకరం ఒక్కింటికి / పంట ఒక్కింటికి రూ.4000/–ల మొత్తాన్ని అందజేయాలని ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది.

(ఇ) సుమారు 44 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతారు.

(ఈ) లేదండీ.

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి (పట్టభద్రుల నియోజక వర్గం – వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ):** – అధ్యక్షా, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఎకరానికి ఎనిమిది వేలు పంటకు నాలుగువేల చొప్పున పెట్టుబడి ఇస్తామని గౌరవ మంత్రిగారు తెలియజేయడం జరిగింది. రైతు అంతర్జాతీయంగా, జాతీయంగా, రాష్ట్రవ్యాప్తంగా అనేక విధాలుగా నష్టపోతున్నాడు. రైతు అనేక కష్టనష్టాలకు ఓర్చి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మానవాళికి మొత్తంగా కూడా తినడానికి తిండి ఏర్పాటు చేస్తూ తను మాత్రం చాలా కష్టాలు పడుతున్న సందర్భంలో రైతుకి ఈ విధంగా మేలు చేయడం చాలా సంతోషకరమైన విషయం.

ముఖ్యంగా ఎంతో కష్టపడి తెలంగాణ సాధించుకున్న సందర్భంలో ఈ ప్రకటన వాస్తవమే అయినప్పటికీ, అనేక అనుమానాలు రైతుల్లో ఉంటే, కొంతమంది నిత్య విమర్శకులు కావాలని దానిని కూడా వక్రీకరించి ఈ నిధులు కేవలం ఎరువులకే ఇస్తుందా? విత్తనాలకు కూడా ఇస్తుందా? అనే అనుమానాలను క్రియేట్ చేస్తున్నారు. కాబట్టి, ప్రభుత్వం ఇచ్చే డబ్బుల్ని దేనికైనా ఉపయోగించే అవకాశం ఉన్నదా? లేదా అనే విషయాన్ని ప్రభుత్వం తెలియజేయాలి.

ప్రభుత్వం మొదటి పంటకు నాలుగు వేలు, రెండవ పంటకు నాలుగు వేలు అంటుంది. కానీ, కొన్ని పంటలు మొదటి పంట నుండి రెండవ పంట సమయం వరకు కూడా కంటిన్యూ అవుతుంటాయి. ఉదాహరణకు పండ్ల తోటలున్నాయనుకుంటే, వాటి నుండి వచ్చే పంట సంవత్సరం వరకు వస్తుంది. అటువంటి పండ్ల తోటలకు కూడా ఇస్తున్నారా? లేదా తెలియజేయాలి. ఒకవేళ ఇస్తే మొదటిసారే ఇస్తరా? రెండవసారి కూడా ఇస్తరా. లేదా రెండుసార్లు ఇవ్వడం

జరుగుతుందా అనేది తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, భూకమతాల్లో 85.9శాతం చిన్న, సన్న కమతాలున్నాయి. అందులో దాదాపు ఒక ఆదిలాబాదు తీసుకుంటే 1.4హెక్టార్ల సగటు కమతాలుంటే, నిజామాబాద్‌లో 0.92 హెక్టార్లున్నది. కాబట్టి, దీనికి ఏదైనా లిమిట్ ఉన్నదా? అంటే, రెండు, మూడు, ఐదు ఎకరాల వరకే అనే లిమిట్ ఏమైనా ఉన్నదా? లేకపోతే చట్ట ప్రకారం ఎన్ని ఎకరాలైనా ఉండవచ్చు అనేది ఉన్నదా? ఎందుకంటే ఒక్కోసారి సీలింగ్‌కి లోబడే ఒక్కొక్కరికి 80, 90ఎకరాలు ఉంటాయి. ఆవిధంగా చట్టప్రకారం కలిగి ఉన్న అంత మొత్తానికి కూడా ఇస్తరా? ఇవ్వరా. మొత్తంగా దాదాపు 86శాతం చిన్న కమతాలున్ననూ, కొద్ది శాతం పెద్ద కమతాలుంటాయి. కాబట్టి, పెద్ద కమతాలున్న వారికి కూడా ఎకరానికి నాలుగువేల చొప్పున ఇచ్చే ఈ నిధులు ప్రభుత్వం ఇస్తుందా? ఇవ్వదా తెలియజేయాలని కోరుతున్నాను.

అలాగే, అసంఘటితంగా ఉన్నటువంటి రైతులను సంఘటితం చేసేందుకు రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం అంటున్నది. వారి కొరకు ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒకరైతు వేదిక నిర్మిస్తున్నట్లుగా వార్తా పత్రికల్లో వచ్చింది. ఒకవేళ ఆ రైతు వేదికలు నిర్మిస్తే, అవి దేనికి ఉపయోగపడే విధంగా ఉంటాయనేది కూడా తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

వ్యవసాయ విస్తరణ అధికారుల నియామకాలు పూర్తి అయ్యాయని అంటున్నారు. ఇంకా ఏమైనా నియామకాలు చేయాల్సి ఉన్నదా? నిన్న, మొన్నటి పంటలను పరిశీలిస్తే ఈ రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడడం వలన దోమకాటు గానీ, లేదంటే ల్యాండ్ ఫెర్టిలిటీ కూడా దెబ్బతింటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆవు మూత్రం వాడిన చోట మంచి పంటలు వస్తున్నాయని అంటున్నారు. కాబట్టి, ఈ రసాయనిక ఎరువులు తక్కువ చేసి సేంద్రియ ఎరువుల వాడకంలో ఈ వ్యవసాయ విస్తరణ అధికారులు వ్యవసాయదారులకు ఏమైనా సలహాలు ఇస్తున్నారా? అనేది తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ (శాసనసభ నియోజక వర్గం):-** అధ్యక్షా, కౌలు రైతులకు కూడా సదరు ఆర్థిక సహాయాన్ని వర్తింపచేయడమవుతుందా అని అడిగితే లేదండి అని గౌరవ మంత్రి వర్యులు తెలియజేయడం జరిగింది. ఆత్మహత్యలు చేసుకున్న వ్యవసాయదారుల్లో ఎక్కువ మంది కౌలు రైతులే ఉన్నారు. కానీ, చాలామంది యజమాను దారులు వ్యవసాయం చేయక, ఎక్కువమంది కౌలుదారులకే భూమి కౌలుకు ఇస్తుంటారు. అటువంటి సమయంలో రెండు పంటలకు సంవత్సరానికి ప్రభుత్వం అందజేసే ఎనిమిది వేలు యజమానుదారులకే వెళ్తాయి, కష్టం చేసే కౌలుదారుకు ఏమీ రాదు. అప్పుడు ఇద్దరికీ పంచాయతీ పడుతుంది. కాబట్టి, ప్రభుత్వం ఏదైనా మెకానిజం ఏర్పాటు చేసి ఈ కౌలుదారు రైతులు కూడా లబ్ధిపొందేట్లుగా చేయాలని మీద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి (శాసనసభ నియోజకవర్గం):-** అధ్యక్షా, ప్రభుత్వం తీసుకున్న చర్యను స్వాగతిస్తున్నాను. రైతుకు ఏ రూపేణ మేలు జరిగినా సంతోషమే. కానీ, ప్రతి మూడు, నాలుగు ఆత్మహత్యల్లో ఇద్దరు కౌలు రైతులుంటున్నారు. ఎనిమిది లక్షలకు పైగా కౌలు రైతులున్న సందర్భంలో యజమానులు ల్యాండ్ లీజ్ అండర్‌టేకింగ్ ఇచ్చే దగ్గర కౌలు రైతులను ఇబ్బంది పెడుతున్నారు. కాబట్టి, ప్రభుత్వం ఏదైనా మెకానిజం ఎవాల్వ్ చేసి కౌలు దారులు కూడా లబ్ధి పొందేట్లుగా చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అలాగే రైతుల యొక్క బాగోగులు మరియు వారికి మార్కెట్‌లో గిట్టుబాటు ధర విషయంలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించాల్సిన బాధ్యత రైతు సమన్వయ సమితులపైన ఉంది. కాబట్టి, ఈ విషయంలో కూడా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటో స్పష్టంగా తెలియజేయాలని మీద్వారా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి:-** అధ్యక్షా, ఈ పథకాన్ని స్వాగతించినందుకు గౌరవ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది చాలా ఆదర్శమైనటువంటి నిర్ణయం. దేశంలో వ్యవసాయ రంగం. రోజురోజుకు అప్పులపాలు అవుతున్న రంగం, మరే రంగం కూడా అప్పులపాలు కావడం లేదు. ప్రతి సంవత్సరానికి అప్పులు పెరిగిపోయి, ఆత్మగౌరవం దెబ్బతిని నష్టపోతున్న రంగం వ్యవసాయ రంగం.

ప్రత్యేకంగా ఇబ్బంది ఎక్కడ వస్తుందంటే, మృగశిర–కార్తీకం దానినే తెలంగాణలో మిరుగం అంటారు. మిరుగం వచ్చిందంటే, నాలుగు చినుకులు పడుతుంటాయి, రైతు చేతుల్లో విత్తనాలకు, పెట్టుబడికి డబ్బులుండవు. ఆ పరిస్థితుల్లో రైతు ఆగమాగం తిరిగి ఆ ఊర్లో గానీ, ప్రక్క ఊర్లో గానీ ఉన్నటువంటి షావుకారిని గానీ, ప్రైవేటు వ్యక్తులను

గాని ఆశ్రయిస్తారు. వారు రైతుల యొక్క బలహీనతను దృష్టిలో పెట్టుకొని నీకు నాలుగువేలు ఇస్తాను, నాకు వడ్డీతో సహా కట్టాలని కాగితం వ్రాయించుకుంటాడు. ఈ తంతు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతినిత్యం జరిగేటువంటి కార్యక్రమం. ఆ సందర్భంలో నాలుగు రూపాయల వడ్డీకో, ఐదు రూపాయల వడ్డీకో రైతులు అప్పులు తీసుకుంటారు. అది అన్యాయం. అటువంటి పరిస్థితి నుండి రైతును కాపాడాలని ఒక మంచి సహృదయంతో ఎన్ని కోట్లయినా ఫరవాలేదు, రైతుకు అండగా ఉందాం, ముందస్తు పెట్టుబడి క్రింద ఒక ఎకరానికి ఒక పంటకి నాలుగువేలు ఇద్దామని దేశంలో ఏ రాష్ట్రం తీసుకోనటువంటి నిర్ణయాన్ని మొట్టమొదటిసారిగా మన రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి గారు తీసుకోవడం జరిగింది.

ఈ పెట్టుబడిని దేనికి వాడుకోవాలని గౌరవ సభ్యులు ప్రశ్నించడం జరిగింది. ఎకరానికి ఒక పంటకి నాలుగువేలు, రెండు పంటలు వేస్తే ఎనిమిది వేలు ఇవ్వబడుతుందని, వాటితో విత్తనాలు, ఎరువులు, పశువుల పేడ, గొర్రెల పేడ, సేంద్రీయ ఎరువులు కొనుక్కోవచ్చని గౌరవ ముఖ్యమంత్రి గారు తొలిరోజే చెప్పారు. ఈ నాలుగువేల రూపాయలతో కేవలం యూరియా, రసాయనిక ఎరువులు మాత్రమే కొనాలని ఏమీలేదు. తన అవసరాల నిమిత్తం పంట వేసుకోవడానికి ఏదైనా కొనుక్కోవచ్చు.

అలాగే వ్యవసాయ శాఖ ద్వారా జీనుగు(పచ్చిరొట్ట) విత్తనాలు సరఫరా చేస్తున్నాము. రసాయనిక ఎరువులు తగ్గించే క్రమంలో ఈ విత్తనాలు భూమిని సారవంతం చేస్తాయి. అలాగే జీనుగు, జనుము, పిల్లిపెసర వంటి విత్తనాలు కూడా ఉంటాయి. వీటిని సీజన్‌లో అందుబాటులో పెట్టి రైతులకి 50శాతం సబ్సిడీతో అందజేస్తాము. వాటిని కూడా కొనుక్కోవచ్చు. ఆ గ్రామంలో ఉన్నటువంటి ఇతర సేంద్రీయ ఎరువులు కొనుక్కోవచ్చు. ఏవిధంగానైనా రైతు తను పండించే పంట దిగుబడి పెంచుకోవడానికి, భూమిని సారవంతం చేసుకోవడానికి దేనికైనా ఖర్చు చేసుకోవచ్చు.

కొన్ని పంటలు సంవత్సరం పొడువునా పండుతాయి. కాబట్టి, వారడిగిన పండ్లతోట వంటి వాటికి నాలుగువేలు, నాలుగువేల చొప్పున రెండు విడతలు అందజేస్తాము. అలాగే గౌరవ సభ్యులు అందరికీ ఇస్తారా? అని అడిగారు. అధ్యక్షా, మన రాష్ట్రంలో 55లక్షల రైతుల హోల్డింగ్స్ ఉంటాయి. ఇందులో ఐదు ఎకరాల లోపల ఉన్నవారు 85.85శాతం ఉన్నారు. ఐదు నుండి పది ఎకరాలు కలిగినవారు 10.86శాతం, పది ఎకరాల నుండి ఇరవై ఐదు ఎకరాల లోపు ఉన్నవారు 3.01శాతం ఉన్నారు. ఇరవై ఐదు ఎకరాలకు పైగా ఉన్నవారు 0.29శాతం ఉన్నారు. అంటే ఎక్కువ శాతం దాదాపు 96శాతం చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. మిగిలిన 3, 4 శాతం రైతులు ఇరవై ఐదు ఎకరాల పైన ఉన్నవారున్నారు.

ప్రభుత్వం ఇచ్చేది, రైతులకు పెట్టుబడి క్రింద ఇస్తున్నాము. కాబట్టి, చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా కొద్దిపాటి పెద్ద రైతులున్ననూ, ఎక్కువ శాతం చిన్న, సన్నకారు రైతులే కాబట్టి, ఈ పథకం రైతులందరికీ వర్తిస్తుంది. పోయిన ఎండాకాలంలో వ్యవసాయ శాఖ తరపున వ్యవసాయ విస్తరణ అధికారులు సమగ్ర సర్వే చేపట్టగా కోటి చిల్లర ఎకరాలు వచ్చింది. ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని ఏర్పాటు చేయాలని గౌరవ ముఖ్యమంత్రి అన్నారు. ఇదివరకు మా డిపార్టుమెంట్‌లో వ్యవసాయ విస్తరణ అధికారులు 1112 మంది ఉన్నారు. వారికి అదనంగా 1000 మంది వ్యవసాయ విస్తరణ అధికారులను భర్తీ చేయాలని కోరాము. అందులో కొందరు భర్తీ అయ్యారు, కొందరు ఇతర ఉద్యోగాలకు వెళ్లారు. మళ్లీ ఇప్పుడు 851మంది వ్యవసాయ విస్తరణ అధికారుల కొరకు పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా కొత్త నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. ఇలా పాత, కొత్తా అన్ని కలుపుకొని 2,638 వ్యవసాయ విస్తరణ అధికారులు అవుతారు. కాబట్టి, ప్రతి ఒక్క వ్యవసాయ విస్తరణ అధికారికి ఐదు వేల ఎకరాలకు మించకుండా వారికి భూమిని అప్పగిస్తాము.

వారు ఉండేటువంటి క్లస్టర్స్‌లో, ఏఈఓ క్లస్టర్ హెడ్ క్వార్టర్లలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసుకోడానికి, రైతు సమన్వయ సమితులు కూర్చోడానికి, తమరు వెళ్లినా, మేము వెళ్లినా, గౌరవ సభ్యులు వెళ్లినా, ఎవరు వెళ్లినా కూర్చోడానికి సుమారుగా రూ.15లక్షలతో రైతు వేదిక అనేటువంటి భవనాలను నిర్మించబోతున్నాము. వాటికి కావాల్సిన నిధులు కూడా ఈ బడ్జెట్‌లోనే పెట్టుకుంటున్నాము. సంఘటితం అనేది చాలా అవసరమని గౌరవ సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు కూడా సలహా ఇచ్చారు. ఒక్కో సమితిలో 15మంది రైతులు ఉండేవిధంగా 10,773 రెవెన్యూ గ్రామాలకు రైతు సమన్వయ సమితులను ఇచ్చాం. వారందరినీ ఫీల్డ్‌లోకి దించుతున్నాము. వారి విధులు, బాధ్యతలను వారికి చెబుతున్నాము. అతి త్వరలో జిల్లాల వారీగా క్లాసెస్ కూడా పెట్టాలని అనుకుంటున్నాము.

రైతులు పంటలు వేసేటప్పుడు గ్రామ, మండల సమన్వయ సమితులు విత్తనాల సరఫరా విధానంలో గానీ,

ఇతర సలహాలు ఇవ్వడంలో గానీ, పండిన పంటను అమ్మే విధానంలో గానీ సంపూర్ణంగా ఇన్‌వాల్వ్ చేసి, అసంఘటితంగా ఉన్నటువంటి రైతులను సంఘటితంగా మార్చడానికి ప్రయత్నం చేస్తున్నాము.

కౌలు రైతు విషయంలో లీగల్ సమస్య గురించి గౌరవ ఎల్‌ఓపి గారు అడిగారు. అధ్యక్షా, ఈరోజు నా భూమిని ఈ సంవత్సరం ఒక వ్యక్తికి ఇవ్వవచ్చు, నచ్చకపోతే వచ్చే సంవత్సరం ఇంకొకరికి ఇస్తాను, మళ్లీ వచ్చే సంవత్సరం మరొకరికి ఇస్తాను. ఇలా మార్చుకుంటూ వెళ్లవచ్చు. అందులో పర్మనెంట్‌గా ఒక్కరికే ఇచ్చే కార్యక్రమం ఉండదు. కాబట్టి, రేపు ప్రొద్దున ఫలానా మనిషికి నేను కౌలుకు ఇచ్చానని మీకు చెప్పానా అని పట్టాదారు వచ్చి మమ్మల్ని ప్రశ్నిస్తాడు. నా ఖాతాలో వేయాల్సిన డబ్బులు వారి ఖాతాలో ఎలా వేశావని లీగల్ సమస్యలు ఎదురవుతాయి. అందుకోసమే దాని జోలికి వెళ్లడం లేదు. ఒకవేళ వాళ్లు ఇద్దరూ కలిసి ఆ నాలుగు వేలు ఏ రకంగా పంచుకుందామనే దానిమీద ఏదైనా ఒక నిర్ణయానికి వస్తే ఫరవా లేదు. కానీ, అధికారికంగా మాత్రం టెనెంట్ ఫార్మర్స్‌కి ఈ నాలుగువేల రూపాయలు ఇవ్వడం సాధ్యపడదు.

ఈ రసాయనిక ఎరువుల విషయంలో ఈ మధ్య ఒక కొత్త పథకం తీసుకువచ్చాం. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం కలుపుకొని రైతులను సేంద్రీయ ఎరువుల వైపు ప్రోత్సహించడానికి **"పరంపరాగత్ కృషి వికాస్ యోజన"** అనే పథకాన్ని ప్రారంభించడం జరిగింది.

మోతాదు కంటే ఎక్కువ రసాయనిక ఎరువులు వాడి భూమిని పాడు చేసుకునే బదులు, దానివల్ల ఒక్కరోజే కాకుండా మెల్లమెల్లగా భూమిని సారవంతం చేసుకోవచ్చు. ఈ పథకం యొక్క పీరియడ్ మూడు సంవత్సరాలు అని పెట్టుకోవడం జరిగింది. 50 ఎకరాలకి ఒక క్లస్టర్ చొప్పున దాదాపు 16,000 ఎకరాలను ఎంపిక చేయడం జరిగింది. అలా ఒక్కో క్లస్టర్ క్రింద శిక్షణకు, విజిట్స్ వగైరా కార్యక్రమాలకు మూడు సంవత్సరాల కాలంలో రూ.15లక్షలు ఖర్చు పెడతాము.

10.20 ఉ. ఆ కార్యక్రమం కొనసాగుతోంది. నేను రైతులకు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను. మోతాదుకు మించి రసాయనాలు వాడటం వల్ల భూమి నిస్సారమైపోయి, పంట దిగుబడి తగ్గిపోయే అవకాశముంది. దయచేసి దాని జోలికి వెళ్లకుండా సేంద్రీయ ఎరువుల వైపు మొగ్గు చూపి, మొత్తం రసాయనిక ఎరువులు తగ్గించడం వీలు కాకపోయినా కొద్ది కొద్దిగా తగ్గించి పంట దిగుబడి పెంచుకోవడానికి కావలసినటువంటి చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా రైతులకి విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో AP Land Licensed Cultivators Act ను తీసుకురావడం జరిగింది. ఆ యాక్ట్‌ను బట్టి కౌలు రైతులకు ఫిబ్రవరి 15వ తారీఖు వరకు కార్డులు ఇవ్వాలి. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి 2016 వరకు వారికి కార్డులు ఇవ్వలేదు. ప్రస్తుత సంవత్సరం ఈ మధ్యనే 43,491 మంది కౌలు రైతులకు మాత్రమే కార్డులు ఇవ్వడం జరిగింది. ఆ సమాచారం గురించి ఆన్‌లైన్‌లో రికార్డు ఉంటుంది. కౌలుకు తీసుకున్న రైతుగాని, అసలు రైతు గాని ఇద్దరూ ఒకటే కాబట్టి, ఎక్కడో ఒక చోట మానవతా దృక్పథంతో తీసుకోకపోతే, ప్రభుత్వం ఇన్ని కార్యక్రమాలు చేసి కూడా వృథానే అవుతుంది. కాబట్టి ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం వారిని ఆదుకోకపోతే, లీగల్ ప్రాబ్లమ్ వస్తుంది కాబట్టి రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖల ద్వారా మండలాల్లో టాస్క్‌ఫోర్స్ వేసినట్లయితే బాగుంటుంది.

ఆల్‌రెడీ ఆన్‌లైన్‌లో రికార్డు ఉంటుంది కాబట్టి దాని ప్రకారం సర్దుబాటు చేసినట్లయితే ఆ రైతులను ఆదుకున్న వారవుతారు. ఇప్పుడున్న టెక్నికల్ రికార్డు ప్రకారం దాదాపు 8 లక్షల మంది కౌలు రైతులకు మాత్రమే కార్డులు ఇచ్చారు. కానీ, నా దగ్గర ఉన్న సమాచారం ప్రకారం సుమారు 10 నుండి 15 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో ప్రతి ముగ్గురిలో ఇద్దరు వాళ్లే ఉన్నారు. కాబట్టి, ఆ రైతులను ఆదుకోకపోతే ఇబ్బంది కలుగుతుందని, తమరి ద్వారా గౌరవ మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

**మిస్టర్ ఛైర్మన్:–** మొన్న జరిగిన బిఏసి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి ప్రశ్నకు తొమ్మిది నిమిషాల సమయాన్ని కేటాయించుకోవడం జరిగింది. కాబట్టి గౌరవ సభ్యులు, గౌరవ మంత్రివర్యులు అందరూ దయచేసి ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

## హైదరాబాదులోని పాత నగరంలో కొత్త విద్యుత్తు సబ్ స్టేషన్లు

ప్రశ్న నెం.2281(62)

శ్రీ సయ్యద్ అమినుల్ హసన్ జాఫ్రీ, ఎం.ఎల్.సి.:– గౌరవనీయులైన ఇంధన శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) జి.హెచ్.ఎం.సి. ప్రాంతంలోని దక్షిణ జోనులో డిమాండును తీర్చడానికి విద్యుత్తు సరఫరా నెట్‌వర్క్, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు తగినంతగా లేవన్న విషయం వాస్తవమేనా;

(ఆ) దక్షిణ జోనులోని పాత నగర ప్రాంతంలో ప్రస్తుత డిమాండును తీర్చడానికి, విద్యుత్తు సరఫరా నిరంతరాయంగా జరిగేటట్లు చూడడానికి ప్రభుత్వం కొత్త సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తుందని వాగ్దానం చేసిన విషయం కూడా వాస్తవమేనా;

(ఇ) అయితే, ఆ వివరాలేమిటి;

(ఈ) ఎప్పటిలోగా హైదరాబాదు పాత నగరంలో కొత్త సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయడమవుతుంది?

గౌరవనీయులైన ఇంధన శాఖ మంత్రి (శ్రీ జి. జగదీష్ రెడ్డి):- (అ) లేదండీ. జిహెచ్ఎంసి ప్రాంతంలోని దక్షిణ జోనులో ప్రస్తుత డిమాండును తీర్చడానికి ప్రస్తుతమున్న విద్యుత్తు నెట్‌వర్క్ సరిపోతుంది.

(ఆ&ఇ) భవిష్యత్తు అవసరాలను దృష్టిలో వుంచుకొని లోడ్ రిలీఫ్ లేకుండా నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా జరిగేటట్లు చూడడానికి, ఒక 132 కెవి ఇమ్లిబన్ ఇహెచ్‌టి సబ్‌స్టేషను స్థాయిని 220 కెవి ఇహెచ్‌టి సబ్‌స్టేషను స్థాయికి పెంచడమయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, జిహెచ్ఎంసి ప్రాంతంలోని దక్షిణ జోనులో ఒక కొత్త 132 ముసారాంబాగ్ ఇహెచ్‌టి సబ్‌స్టేషను మరియు ఈ క్రింది 13 కొత్త 33/11 కెవి సబ్‌స్టేషన్లను ప్రారంభించడమయింది.

(1) కుల్సుంపుర

(2) లక్ష్మీనగర్

(3) అల్మాస్‌గూడ

(4) ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ, కాటేదాన్

(5) నాదర్‌గుల్

(6) గుడి మల్కాపూర్ (అల్లూరి సీతారామరాజు నగర్)

(7) ధర్మసాయి గుడి, శంషాబాదు

(8) ఐటిఐ మల్లేపల్లి

(9) మలక్‌పేట

(10) జియాగూడ

(11) తీగలగూడ

(12) గ్రీన్ విచ్ అకాడమీ

(13) ఉప్పర్‌పల్లి

అంతేగాక, 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.76.74 కోట్ల మొత్తంతో ఈ క్రింది 2 కొత్త ఇహెచ్‌టి సబ్‌స్టేషన్లను, 7 కొత్త 33/11 కెవి సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయడానికి కార్యక్రమాన్ని రూపొందించడమయింది.

(1) చంచల్‌గూడలోని ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ వద్ద ఇహెచ్‌టి సబ్‌స్టేషను.

(2) పేట్లబుర్జ్ వద్ద ఇహెచ్‌టి సబ్‌స్టేషను

(3) పాత అవుట్‌పోస్ట్ (దేవీ బాగ్)

(4) మాదన్నపేట

(5) అరుంధతి కాలనీ

(6) అజీజ్ బాగ్

(7) ఛత్రినాక

(8) వట్టేపల్లి నాగుల పల్లి

(9) ఐసిఎఆర్, రాజేంద్రనగర్

(ఈ) 1) చంచల్‌గూడ, పేట్ల బూర్జ్, రెండు కొత్త ఇహెచ్‌టి సబ్‌స్టేషన్లు 2018 డిసెంబరులో ప్రారంభించడమవుతాయని ఆశించడమయింది.

(2) దేవీబాగ్, మాదన్నపేట, అరుంధతి కాలనీ వద్ద తలపెట్టిన మూడు 33/11 కెవి సబ్ స్టేషన్లను 2018 ఫిబ్రవరి వరకు దాదాపు పూర్తి చేయడమవుతుంది.

(3) 33/11 కెవి అజీజ్‌బాగ్ సబ్‌స్టేషను పనులను కోర్టు కేసు పరిష్కారమైన తరువాత చేపట్టడమవుతుంది.

(4) ఛత్రినాక, వట్టేపల్లినాగులపల్లి, ఐసిఎఆర్, రాజేంద్రనగర్ వద్ద తలపెట్టిన మూడు 33/11 కెవి సబ్ స్టేషన్లను 2018 మార్చి వరకు దాదాపు పూర్తి చేయడమవుతుంది.

SRI. SYED AMINUL HASAN JAFRI (LOCAL BODIES - HYDERABAD):

جناب سید امین الحسن جعفری (Janab Syed Aminul Hasan Jafri): اس وقت یہاں پر کتنا ڈیمانڈ اور کتنی سپلائی ہے؟ آئندہ چند سالوں میں کتنا Demand بڑھے گا اور Supply کے لئے کیا arrangement ہونگے اور Existing Network کیا ہے، اس میں 220kv کے Substations کتنے ہیں؟ 132kv کے کتنے ہیں؟ 33kv کتنے Existing Substations ہیں؟ دوسرا یہ کہ نئے Substations قائم ہورہے ہیں اس میں چند دو اور تین سال سے ہیں، اس کے قیام کا کام شروع ہی نہیں ہوا ہے، بعض کی تکمیل نہیں ہورہی ہے۔ اس کے تاخیر کی کیا وجوہات ہیں؟ جب منسٹر صاحب Swach Hyderabad کی meeting کررہے تھے اس وقت power پر بھی discussion ہوا تھا۔ اس میں یہ طئے پایا گیا تھا کہ Substation سے ہٹ کر جتنے Transmission & Distribution lines ہیں یہ سب Over Head Lines ہیں۔ ان کو U.G cables کو Conversion کیا جائے یہ تجویز دی گئی تھی اور اس کے بعد MLAs سے بھی proposals طلب کئے گئے تھے۔ میں یہ جاننا چاہتا ہوں کہ اس project کے کام کی کیا صورتحال ہے؟ اور یہ کام کب تک مکمل ہوگا؟

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, మంత్రిగారి ఛాంబరులో అన్ని పార్టీల సభ్యులను పిలిపించి, కౌలు రైతుల సమస్యల గురించి చర్చించి రికార్డు స్ట్రెయిట్ చేయవలసిన అవసరముంది. నార్సింగ్ ప్రాంతంలోని మిలిటరీ ఏరియాలలో ఉన్నటువంటి ఫ్యాక్టరీలలో లోడు ఎక్కువ అయిపోయి ట్రిప్ అవుతోంది. దానికి సంబంధించి మంచిరేవుల ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ప్రభుత్వం దగ్గర ఉన్నట్లయితే ఆ చుట్టుప్రక్కల కొత్తగా సర్వే చేసి, మరోసారి ఈ ఫ్యాక్టరీల లోడు మీద assessment చేయవలసిన అవసరముంది. ఈ మధ్యన కరెంటు బాగా పోతోందని, మిలిటరీ వారు కరెంటు లైన్‌ను నేరుగా వేసుకున్నారు. ఆ ఇష్యూను అధికారులు, ఛైర్మన్‌గారు మరియు ఎండిగారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సంబంధిత శాఖ కూడా సబ్‌స్టేషన్స్ ఏర్పాటు చేయడానికి నిధులు శాంక్షన్ అయ్యాయని చెబుతోంది. కానీ, భూసేకరణకు సంబంధించిన సమస్య మాత్రం రెండు, మూడు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉంది. కాబట్టి, దాని గురించి ప్రభుత్వం ఏమైనా ఆలోచన చేస్తుందా అని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను.

**శ్రీ జి. జగదీష్ రెడ్డి:–** అధ్యక్షా, తెలంగాణ వచ్చిన 2014–15, 2015–16 ప్రారంభంలో పాత బస్తీ ప్రాంతంలోగాని, నగరం బాగా విస్తరించిన ప్రాంతాలలోగాని లోడ్ రిలీఫ్ ఉన్న మాట వాస్తవం, దానివల్ల చాలా సమస్యలు వచ్చిన మాట వాస్తవం అధ్యక్షా. తెలంగాణ రాష్ట్రం వచ్చిన ఈ మూడు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకొని, ఎక్కడా కూడా లోడ్ రిలీఫ్‌కు అవకాశం లేకుండా, పూర్తి స్థాయిలో 24 గంటల విద్యుత్తును అందించడం జరిగింది. ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి ఇంతకుముందే నేను చెప్పడం జరిగింది. గౌరవ సభ్యులకి వాటి వివరాలు కావాలంటే తెలుగుతోపాటు ఇంగ్లీషు మరియు ఉర్దూలో కూడా వ్రాతపూర్వకంగా పంపిస్తాము.

గౌరవ సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డిగారు చెప్పినట్లు, అటువంటి సమస్య వచ్చినట్లు ప్రభుత్వం దృష్టికి రాలేదు. గౌరవ సభ్యులు జాఫ్రీగారు మాట్లాడుతూ, పాతబస్తీలో విద్యుత్తు లోడ్ ఎంత ఉందని అడిగారు. ఆ ప్రాంతంలో 715 మెగావాట్ల విద్యుత్ లోడ్ ఉంది. దానికి సరిపోయే పద్ధతుల్లో ప్రస్తుత అవసరాలకి తగ్గట్లుగా అన్నింటిని పూర్తి చేయడం జరిగింది. ప్రస్తుతానికి లోడ్ రిలీఫ్ ఎక్కడా కూడా లేదు. ఎప్పుడైనా పవర్ కట్ జరిగిందంటే, కేవలం అక్కడ రిపేరులు చేయడం కొరకు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు బిగించడం, కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడం కొరకు, లైన్‌లను మార్చడం కొరకు మాత్రమే లోడ్ రిలీఫ్ తీసుకోవడం, పవర్ కట్ చేయడం జరిగింది తప్ప, పవర్ అందుబాటులో లేక గాని, వేరే ఇతర కారణాల వల్ల ఎప్పుడూ కూడా లోడ్ రిలీఫ్ తీసుకోవడం లేదు. ప్రభుత్వం 24 గంటల నిరంతరాయ విద్యుత్తును అందిస్తోంది.

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని పెరగబోతున్న పరిశ్రమలు, గృహాలు, వాటియొక్క వినియోగాన్ని అంచనా వేసి, దాదాపుగా 13కు పైగా 33/11 కెవి సబ్‌స్టేషన్లు, ఇంకొక 220 కెవి సబ్‌స్టేషన్, రెండు 133/11 కెవి సబ్‌స్టేషన్లకు సంబంధించి అన్నీ కూడా టైం షెడ్యూల్‌తో సహా గౌరవ సభ్యులకి వివరాలు ఇవ్వడం జరిగింది. కావాలంటే వాటి కాపీలు కూడా పంపించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. హైదరాబాద్ నగరంలో ఎక్కడా కూడా విద్యుత్‌కు సంబంధించి ఏ చిన్న సమస్య కూడా రాకుండా గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాల మేరకు విద్యుత్తు వలయాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

రింగురోడ్డు చుట్టూరా 400 కెవి సబ్‌స్టేషన్లు నాలుగు ఏర్పాటు చేసి, మొత్తం రాష్ట్రంలో ఎక్కడెక్కడ తయారయ్యే విద్యుత్తును చక్కగా హైదరాబాద్ నగరానికి చేరుకునే పద్ధతుల్లో లైన్లు మొత్తం పూర్తి చేయడం జరిగింది. ఒక జనరేటింగ్ స్టేషన్‌లో విద్యుత్తు ఆగిపోయినాగాని, అన్ని ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బంది రాకుండా, హైదరాబాద్ చుట్టుప్రక్కల ఒక దానితో ఒకటి లింకు ఉండే పద్ధతుల్లో విద్యుత్తు వలయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. హైదరాబాద్ నగరంలో విద్యుత్తుకు సంబంధించి, ఎక్కడా కూడా ఏ చిన్న సమస్య ఉత్పన్నం కాదని గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను. స్థానికంగా ఏదైనా చిన్న చిన్న యాక్సిడెంట్లు జరిగి, పవర్లో ఏదైన సమస్య వచ్చి, అర్ధగంట లేదా పది నిమిషాలు ఆగితే ఆగాలి తప్ప, లోడ్ రిలీఫ్ అయ్యే పరిస్థితుల్లో ఉండదనే విషయాన్ని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

جناب سید امین الحسن جعفری (Janab Syed Aminul Hasan Jafri): ایک ہی چیز پوچھنا ہے صاحب! Transformers Repair Shed پرانے شہر میں بنڈلہ گوڑہ کے قیام کے لئے کئی سال سے demand ہے اور اس کے لئے زمین بھی Identify کی گئی ہے وہ کام کب شروع ہوگا؟ کیوں کہ جب بھی کوئی Transformers fail ہوجاتا ہے تو اس کو درست کرنے کیلئے Erragadda Repair Shed بھیجا جاتا ہے۔ اس کی وجہ سے 24 hours سے 36 hours, 48 hours کا Distribution ہوتا ہے۔ ایک Repair shed اگر South Zone میں Setup کیا جاتا ہے تو یہ انتہائی سہولت بخش ہوگا۔

**శ్రీ జి. జగదీష్ రెడ్డి:–** అధ్యక్షా, లోడ్ రిలీఫ్‌కు సంబంధించి 715 మెగావాట్ల విద్యుత్తు లోడ్ ఉందనే వివరాలు ఆల్‌రెడీ గౌరవ సభ్యులకి ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఎక్కడైనా సమస్య ఏర్పడితే టోల్ ఫ్రీ నెం.1912155333 కూడా ఇవ్వడం జరిగింది. ఆ నెంబరుకు కాల్ చేసినట్లయితే, ఏ ప్రాంతలో లోడ్ రిలీఫ్ వచ్చింది, పవర్ కట్ అయింది, ఎందుకు జరిగిందనే కారణాన్ని కూడా తెలియజేస్తారు. ఎంత సమయంలో పవర్ ఇస్తారనే విషయాన్ని కూడా తెలియజేస్తారు. ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు షెడ్ మాదన్నపేటలో ఇప్పటికే నిర్మాణంలో ఉన్నది. దానికి సంబంధించి పెద్దగా సమస్యేమీ ఉండదు. తప్పకుండా ఎక్కడైన రిపేరులు వచ్చినప్పుడు 24 గంటల లోపే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లుగాని, వాటికి సంబంధించిన రీప్లేస్‌మెంట్‌గాని వెంటనే చేయడం జరుగుతుంది. నగరంలో అంత సమయం కూడా తీసుకోవడం లేదు. కొన్ని గంటలలోపే వాటిని మార్చి, కొత్తవి బిగించే కార్యక్రమాలు కూడా ప్రభుత్వం చేస్తుందని ఈ సందర్భంగా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:–** అధ్యక్షా, తమరి ద్వారా విద్యుత్తు శాఖ మంత్రిగారికి మరియు మునిసిపల్ మినిస్టర్ గారికి మనవి చేసేదేమంటే, హైదరాబాద్ నగరాన్ని సుందరీకరణ చేయాలని అంతకుముందు చెప్పడం జరిగింది. కానీ, నగరంలో విద్యుత్తు స్తంభాలు బాగా పాత పడి పోయాయి. రోడ్లు వెడల్పు చేసినా గాని స్తంభాలు అలాగే ఉన్నాయి. కాబట్టి, రోడ్లు వెడల్పు చేసేటప్పుడు, భూగర్భంలో కేబుల్స్ వేసినట్లయితే బాగుంటుంది. విద్యుత్ శాఖ ఈ సంవత్సరం నగరంలో ఎన్ని కిలోమీటర్ల వరకు అండర్ గ్రౌండ్‌లో కేబుల్స్ వేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నది? ఇవ్వాళ ఐటి సిటీ, స్మార్ట్ సిటీ వంటి చాలా హబ్‌లు వస్తున్నాయి కాబట్టి దాని గురించి ఎన్ని 400 కెవి సబ్‌స్టేషన్లు నిర్మించాలని ప్లానింగ్ చేస్తుంది, అవి ఎప్పటి వరకు రాబోతున్నాయనేది తెలపాల్సిందిగా తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ జి. జగదీష్ రెడ్డి:–** అధ్యక్షా, గౌరవ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు చెప్పింది వాస్తవమే. గత ప్రభుత్వాలు చేసిన పనుల వల్ల హైటెన్షన్ లైన్లు వేసిన తరువాత ఆ లైన్ల క్రింద ఇండ్ల నిర్మాణం చేసుకోవడం వల్ల వచ్చిన సమస్య కావొచ్చు, అలాగే అప్పుడు రోడ్లు చిన్నగా ఉండి, వాటిని వెడల్పు చేయడం వల్ల వచ్చిన సమస్య కావొచ్చు. హైదరాబాద్‌లో ఆ సమస్య ఉన్న మాట వాస్తవం. అయితే అండర్ గ్రౌండ్ కేబుల్స్‌కి సంబంధించి కూడా హెచ్‌ఆర్‌డిసి ద్వారా మునిసిపల్ కార్పోరేషన్ వాళ్లు 300 కిలోమీటర్ల వరకు వేయాలని ప్లానింగ్ చేస్తున్నారు. మా శాఖకు సంబంధించి కూడా గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం వెంటనే తీసుకొని మళ్లీ తెలియజేస్తానని తమరి ద్వారా చెబుతున్నాను.

## గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో శిక్షణ పొందని ఉపాధ్యాయులు

ప్రశ్న నెం.2223(63)

శ్రీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎం.ఎల్.సి.,:– గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (విద్యా శాఖ)గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

(అ) రాష్ట్రంలో నిర్వహిస్తున్న గుర్తింపు పొందిన పాఠశాలల సంఖ్య ఎంత? అందులో పనిచేస్తున్న శిక్షణ పొందిన, శిక్షణ పొందని ఉపాధ్యాయుల సంఖ్య ఎంత;

(ఆ) కేంద్ర ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం, ఎప్పటిలోగా శిక్షణ పొందని ఉపాధ్యాయులు వారి శిక్షణను పూర్తి చేయాలి;

(ఇ) ఇంటర్మీడియట్‌లో 50 మార్కులు పొందిన శిక్షణ పొందని ఉపాధ్యాయులు శిక్షణను పూర్తి చేసేలా చూడడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (విద్యా శాఖ) (శ్రీ కడియం శ్రీహరి):– (అ) (i) 2016–17 యుడిఐఎస్‌ఇ ప్రకారం గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంఖ్య : 11262.

(ii) 2016–17 యుడిఐఎస్‌ఇ ప్రకారం పనిచేస్తున్న శిక్షణ పొందిన ఉపాధ్యాయుల సంఖ్య : 92675.

(iii) 2016–17 యుడిఐఎస్‌ఇ ప్రకారం పనిచేస్తున్న శిక్షణ పొందని ఉపాధ్యాయుల సంఖ్య : 3905.

(ఆ) కేంద్ర ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం, శిక్షణ పొందని ఉపాధ్యాయులు 31.03.2019 తేదీ నాటికి శిక్షణను పూర్తి చేయాలి.

(ఇ) ఎంహెచ్‌ఆర్‌డి ఆదేశాల ప్రకారం, డి.ఇఐ.ఇడి కార్యక్రమంలో ప్రవేశం పొందడానికి కనీస అర్హత అంటే ఇంటర్మీడియట్‌లో 50 శాతం లేని ఉపాధ్యాయులు, జాతీయ సార్వత్రిక పాఠశాల సంస్థలో చేరి కనీస అర్హత సాధించేందుకు ఇంటర్మీడియట్ పరీక్షకు తిరిగి హాజరవ్వాలి. ఈ డి.ఇఐ.ఇడి, కార్యక్రమాన్ని పూర్తి చేసే లోపే ఇంటర్మీడియట్‌లో 50 శాతం

మార్కులను వారు పొందడానికి లోబడి, జాతీయ సార్వత్రిక పాఠశాల సంస్థలో డి.ఇఐ.ఇడి కార్యక్రమంలో తాత్కాలిక ప్రవేశాన్ని పొందడానికి వారిని అనుమతించాలి. దీని ద్వారా సదరు ఉపాధ్యాయులు ఏకకాలంలో కోర్సులు రెండింటిని చేయడానికి వీలు కల్పించడమవుతుంది.

**పాతూరి సుధాకర్ రెడ్డి (ఉపాధ్యాయ నియోజక వర్గం - మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్):-** అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు అనే తేడా లేకుండా, ప్రతి ఉపాధ్యాయుడు విద్యా బోధనలో శిక్షణ పొందడం తప్పనిసరి. మన రాష్ట్రంలో మూడు రకాలైన పాఠశాలలు ఉంటాయి. 1. ప్రభుత్వ పాఠశాలలు, 2. ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలలు, 3. ప్రైవేటు పాఠశాలలు. గౌరవ మంత్రిగారి సమాధానంలో కేవలం అన్‌ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల యొక్క సమాధానం ఇవ్వడం జరిగింది. నా దగ్గర ఉన్న సమాచారం ప్రకారం ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల్లో సమారు 25 మంది శిక్షణ పొందని ఉపాధ్యాయులు ఉన్నారు. ఇవ్వాళ నమోదై పని చేస్తున్న వారిలో 25 మంది శిక్షణ పొందని ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

ఇప్పుడు ఉన్నటువంటి నిబంధనల ప్రకారంగా Grant in Aid ఎప్పుడైతే అడ్మిట్ అయ్యిందో, వారు రిటైర్ అయిన వెంటనే ఆ పోస్టును సీజ్ చేస్తారు. సీజ్ చేసిన తర్వాత అన్‌ఎయిడెడ్ పోస్టులన్నింటినీ నియామకం చేస్తారు. దాంట్లో కూడా చాలా మంది శిక్షణ పొందని ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రభుత్వం మాత్రం కేవలం 25 మందే శిక్షణ పొందని ఉపాధ్యాయులు ఉన్నారని చెబుతోంది. కానీ లెక్క ప్రకారం ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాల్లోనే ఎక్కువ మంది ఉన్నారు. రెండవది - సుమారు 25,750 ప్రభుత్వ పాఠశాలల్లో 1,03,122 మంది టీచర్లు పని చేస్తున్నారు. అంటే, ఒక్కరు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందని ఉపాధ్యాయులు లేరు. అదే 3,177 ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల్లో 720 మంది టీచర్లు మాత్రమే పని చేస్తున్నారు. దాంట్లోనే 25 మంది శిక్షణ పొందని ఉపాధ్యాయులు ఉన్నారు. 11,262 ప్రైవేటు పాఠశాలల్లో 92,675 మంది టీచర్లు పని చేస్తున్నారు.

ప్రభుత్వం చెప్పిన లెక్క ప్రకారంగా 3,905 మంది శిక్షణ పొందని ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 23 లక్షల మంది పిల్లలు ఉంటే, 1,09,022 మంది టీచర్లు పని చేస్తున్నారు. కానీ, 31 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్న అన్ ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల్లో కేవలం 92,675 మంది టీచర్లు మాత్రమే పని చేస్తున్నారంటే కొద్దిగా అనుమానం వస్తుంది. అందులో ఇంకా కొంతమంది టీచర్లు ఉండవచ్చు. కాబట్టి వారిని కూడా పరిగణనలోకి తీసుకొని, శిక్షణ సౌకర్యం కల్పించమని తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ పూల రవీందర్ (ఉపాధ్యాయ నియోజకవర్గం - వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ):-** అధ్యక్షా, ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో అర్హులైన టీచర్ల సంఖ్య, వాస్తవానికి చాలా దూరంగా ఉంది. కాబట్టి దానిమీద నిర్దిష్టమైనటువంటి చర్యలు మన ప్రభుత్వ పక్షాన తీసుకోవాలని తమరి ద్వారా కోరుతున్నాను. దీనికి సంబంధించి ప్రైవేటు పాఠశాలల యొక్క బస్సులు ఎన్ని కిలోమీటర్ల మేరకు, ఏ పరిధిలో తిరిగి ఫీడింగ్ చేసుకోవాలనే దానికి ఉత్తర్వులు ఉన్నాయా? ప్రైవేటు పాఠశాలల బస్సులు మాత్రం 25 నుండి 40 కిలోమీటర్ల దూరం వరకు తిరుగుతూ పిల్లల్ని తీసుకొని వస్తున్నాయి. దాంతో ఇంగ్లీషు మీడియం, ప్రీ ప్రైమరీ పాఠశాలల ప్రైవేటు బస్సులు తిరగడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుతోంది. కాబట్టి దయచేసి వేరియేషన్ అనేది లేకుండా, నిర్దిష్ట దూరం కంటే ఎక్కువ కిలోమీటర్ల నుండి పిల్లలను తీసుకెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

10.40 ఉ.

**శ్రీ కొంపల్లి యాదవ రెడ్డి (శాసనసభ నియోజక వర్గం):-** అధ్యక్షా, మన రాష్ట్రంలో ఉపాధ్యాయ - విద్యార్థుల యొక్క రేషియోను పాటించాలనే నిబంధన ఉందా? ఉంటే ఆ నిబంధనలను ప్రైవేటు బడులు మరియు కళాశాలల వారు పాటిస్తున్నారా? దానిని పాటించని వారి పై ఎటువంటి చర్యలను తీసుకుంటున్నారు?

**శ్రీ కడియం శ్రీహరి:-** అధ్యక్షా, మానవ వనరుల అభివృద్ధి శాఖ, న్యూఢిల్లి వారి నిబంధనల మేరకు దేశ వ్యాప్తంగా ఉన్న గవర్నమెంటు, లోకల్ బాడీస్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయు లందరూ కూడా తప్పని సరిగా ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారై ఉండాలి. అప్పుడు మాత్రమే వారు బోధించుటకు అర్హులు. ఇప్పటికీ కూడా శిక్షణ పొందని వారికి 31.3.2019 తేదీలోగా శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు. అందులో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రభుత్వ పరంగా నడిచే పంచాయితీ రాజ్ లోకల్ బాడీస్‌లో పనిచేస్తున్న వారు, అర్బన్ లోకల్ బాడీస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయు లందరూ కూడా

శిక్షణ పొందిన ఉపాధ్యాయులే ఉన్నారు. శిక్షణ పొందని ఉపాధ్యాయులు ఎవరూ లేరు. మన ఎయిడెడ్ పాఠశాలల్లో, అన్ ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే కొంత మంది శిక్షణ పొందని ఉపాధ్యాయులు ఉన్నారు. వారి వివరాలన్నీ సేకరిస్తున్నాము. ఇప్పటికీ ఆ సమాచారం ఇంకా వస్తూనే ఉంది. ఆ సమాచారాన్ని పూర్తిగా సేకరించి అన్ని ప్రైవేటు పాఠశాలల నుండి ఎయిడెడ్ ఇన్స్టిట్యూషన్స్ నుండి పూర్తి సమాచారం సేకరించి శిక్షణ పొందని ఉపాధ్యాయులకు శిక్షణ అందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

సభ్యులు శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిగారు అన్ ఎయిడెడ్ ఇన్స్టిట్యూషన్స్ ఎక్కువగా ఉన్నాయి, టీచర్స్ తక్కువగా ఉన్నారని అడిగారు. ఆ విషయం వాస్తవం. 2004వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఎయిడెడ్ ఇన్స్టిట్యూషన్స్‌లో ఖాళీ అవుతున్న ఉద్యోగాలు భర్తీ చేయకుండా బ్యాన్ విధించడం జరిగింది. ఆ బ్యాన్ కారణంగా పాఠశాలల్లో, కళాశాలల్లో ఉద్యోగాలను భర్తీ చేయలేకపోతున్నాము. దానిని రివైవ్ చేయాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నది. ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతులు పొంది వాటిపైన ఒక నిర్ణయం తీసుకోవడం జరుగుతోందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అదే విధంగా సభ్యులు శ్రీ పూల రవీందర్ గారు అడిగిన ప్రశ్న పల్లెటూర్ల నుండి బస్ సౌకర్యాలను కల్పించి పిల్లలను పట్టణాలలోని ప్రైవేటు ఇంగ్లీష్ మీడియం పాఠశాలలకు పంపిస్తున్నారు. అదే విధంగా మన ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంగ్లీష్‌మీడియం విద్యను ప్రవేశపెట్టి, బస్సులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని అడిగారు. దానికి సమాధానంగా 2016 - 2017, 2017 - 2018 అనేక జిల్లాలలో పిల్లల హాజరు శాతం పెంచడానికి ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌ను ప్రారంభించడం జరిగింది. అవసరమున్న చోట ట్రాన్స్‌పోర్టును కూడా ఏర్పాటు చేస్తామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అదే విధంగా గౌరవ సభ్యులు శ్రీ కొంపల్లి యాదవ రెడ్డిగారు అడిగిన ప్రశ్నకు సమాధానంగా, వాస్తవంగా Right to Education Act ప్రకారం స్టూడెంట్, టీచర్ రేషియోను అనుసరించవలసిన అవసరం ఉన్నది. తప్పకుండా దానిని ప్రైవేటు పాఠశాలల్లో, గవర్నమెంట్ పాఠశాలల్లో మరియు వృత్తి కళాశాలల్లో కూడా అనుసరించవలసిన అవసరం ఉన్నది. దాని ప్రకారమే సమాచారాన్ని సేకరించి వాళ్లు Affiliation renewal కొరకు వచ్చినప్పుడు ఆ Affiliationలో దానిని కూడా ఒక క్రైటీరియాగా పెట్టుకొని దానిని పూర్తి చేస్తేనే వారికి Affiliation ఇవ్వడం జరుగుతుందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## హైదరాబాదులోని అంబర్‌పేట్ మరియు బాలానగర్ వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణం

ప్రశ్న నెం.2260 (64)

శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన సమాచార, సాంకేతిక & మునిసిపల్ పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) హైదరాబాదులోని అంబర్‌పేట్, బాలానగర్ వద్ద జాతీయ రహదారులపై ఫ్లై ఓవర్లను నిర్మించాలని ప్రతిపాదించడమయిందా;

(ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

(ఇ) ఈ విషయంలో జి.హెచ్.ఎం.సి./ హెచ్.ఎం.డి.ఏ.లు సేకరించాలనుకున్న భూమి మొత్తం విస్తీర్ణం ఎంత;

(ఈ) ఆర్థిక వనరులను ఏ విధంగా సమీకరించి, భూ సేకరణ నిమిత్తం వ్యయాన్ని ఏ విధంగా భర్తీ చేయడమవుతుంది?

గౌరవ సమాచార, సాంకేతిక, మునిసిపల్ పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ కె. తారక రామారావు):- (అ) అవునండీ.

(ఆ) **అంబర్‌పేట్‌లో ప్రతిపాదిత ఫ్లై ఓవర్ :-** అంబర్‌పేట్‌లో ఫ్లై ఓవర్‌ను నిర్మించడానికి జి.హెచ్.ఎం.సి, రోడ్లు & భవనాల శాఖ ప్రాజెక్టును చేపట్టాయి.

| | | |
|---|---|---|
| పొడవు | : | 1.60 కి.మీ. |
| ప్రస్తుత వెడల్పు | : | 18 మీ. లేదా 60' |
| ప్రతిపాదించిన రోడ్డు వెడల్పు | : | 30 మీ. నుండి 32.5 మీ. వరకు (100' నుండి114'-0' వరకు) |
| నష్టపోయే ఆస్తుల మొత్తం సంఖ్య | : | 281 |

ప్రాజెక్టు మొత్తం వ్యయం
భూ సేకరణ మరియు
ఫ్లై ఓవర్ల నిర్మాణం : రూ.436.71 కోట్లు

**బాలానగర్‌లో ప్రతిపాదిత ఫ్లై ఓవర్:**

బాలానగర్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణానికి జి.హెచ్.ఎం.సి, హెచ్.ఎం.డి.ఏ ప్రాజెక్టును చేపట్టాయి.

| | |
|---|---|
| పొడవు | : 2.20 కి.మీ. |
| ప్రస్తుత వెడల్పు | : 24 నుండి 30 మీ. లేదా 80' నుండి 100' వరకు |
| ప్రతిపాదించిన రోడ్డు వెడల్పు | : 60.0 మీ. (200' – 0') |
| నష్టపోయే ఆస్తుల మొత్త సంఖ్య | : 365 |
| ప్రాజెక్టు మొత్తం వ్యయం (భూ సేకరణ & ఫ్లై ఓవర్ నిర్మాణం) | : రూ. 387.0 కోట్లు |

**(ఇ) అంబర్‌పేట్‌లో ఫ్లై ఓవర్:**

సేకరించదగు భూమి విస్తీర్ణం : 22411.42 చ. గజాలు.

**<u>బాలానగర్‌లో ఫ్లై ఓవర్:</u>**

సేకరించదగు భూమి విస్తీర్ణం : 64936.22 చ. గజాలు.

**(ఈ) అంబర్‌పేట్ ఫ్లై ఓవర్:**

భూ సేకరణ మొత్తం వ్యయం రూ.317 కోట్లు. అందులో, కేంద్ర ప్రభుత్వ ఎంఓఆర్‌టిహెచ్, రూ.67 కోట్లను మంజూరు చేసింది. మిగిలిన రూ. 250 కోట్లు మొత్తాన్ని జి.హెచ్.ఎం.సి. / రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి.

**<u>బాలానగర్ ఫ్లై ఓవర్:</u>** రూ. 265 కోట్ల భూ సేకరణ మొత్తం వ్యయాన్ని హెచ్. ఎం.డి.ఏ. భరిస్తుంది.

**శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు (స్థానిక సంస్థలు – హైదరాబాద్)ః–** అధ్యక్షా, before I ask supplementary, I would like to congratulate the Hon'ble Minister. వారు నిన్న World Food Processing Summitలో దాదాపు 15 MOU లు చేసుకోవడం వల్ల సుమారు రూ.7,250 కోట్ల నిధులు మన రాష్ట్రానికి వస్తున్నాయి. ముఖ్యంగా జహీరాబాదుకు జర్మన్ అగ్రి అలైన్స్ రావడం వలన పది వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. అన్ని రాష్ట్రాల కంటే కూడా మన తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కువగా MOUలు జరిగాయి. వారిని మరియు వారి టీమును అభినందిస్తున్నాను.

మన నగరంలో అనేక ఫ్లై ఓవర్లను కట్టడం జరుగుతోంది. అంబర్ పేట ఫ్లై ఓవర్ నిర్మాణంలో మాత్రం చాలా జాప్యం జరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు చాలా వేగంగా జరిగినందుకు సంతోషిస్తున్నాను. ఆ ప్రాజెక్టు విలువ రూ.119 కోట్లు. అయితే భూ సేకరణ చేయడానికి దాదాపు రూ.370 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ భూ సేకరణ భారం జీహెచ్ఎంసీ మీద పడుతుంది. భూ సేకరణ కోసం పెట్టే ఖర్చు జీహెచ్ఎంసీ మీద కాకుండా ఆర్ & బీ లేదా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫండింగ్ ద్వారా ఈ ఖర్చును భరించేటట్లు చూడాలని కోరుతున్నాను. వారు ప్రిపేర్ చేసేటప్పుడే Land acquisition cost కూడా total Project లో కలిపి తీసుకొస్తే లాభం ఉంటుందని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

అదే విధంగా అంబర్ పేట ఫ్లై ఓవర్, అయ్యప్ప సొసైటీ, బయో డైవర్సిటీ వంటి పలు రకాల ఫ్లై ఓవర్లు వస్తున్నాయి. అవి ఎంత వరకు పూర్తి అయినాయి, వాటి మీద ఎంత డబ్బు ఖర్చు పెట్టడం జరిగింది? వాటి వల్ల మన ప్రజలు ఏ విధంగా లాభపడుతున్నారని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ ఎన్. రామచంద్రరావు (పట్టభద్రుల నియోజకవర్గం – మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్)ః–** అధ్యక్షా, అంబర్ పేట, బాలనగర్ ఫ్లై ఓవర్స్ వంటివే కాకుండా సిటీలో ట్రాఫిక్‌ను సులభతరం చేయడానికి చాలా ఫ్లై ఓవర్లను కట్టవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా మల్కాజ్‌గిరి ఇతర ప్రాంతాలలో రోడ్డు అండర్ బ్రిడ్జీలు నిర్మాణంలో ఉన్నాయి. తుకారాం గేటులో బ్రిడ్జీ నిర్మాణం కోసం ప్రతిపాదన ఉంది. కానీ అది ఇంకా ప్రారంభం కాలేదు. అదే విధంగా నాగోల్ దగ్గర కూడా అండర్ గ్రౌండ్ బ్రిడ్జీలను ప్రారంభించబోతున్నారు. ఇవేకాకుండా ఎలివేటెడ్ రోడ్స్ నిర్మాణాల ఆలోచనలో ఉన్నారా? అని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

جناب محمد علی شبیر (Janab Md.Ali Shabbir): چیر مین صاحب! بہت بہت شکر آپ کہ ذریعہ منسٹر صاحب سے پوچھنا چاہتا ہوں، پربھاکر راؤ صاحب کے سوال پر ابھی Land Acquisition کے مرحلے میں ہی ہے۔ اس کے اندر Municipal اور GHMC funds mobilisation کر کے Land Acquisition میں جمع کرنا ہے۔ دس سال میں بھی پورا نہیں ہوگا، کیوں کہ نہ Municipal Corporation کے پاس پیسہ ہے، نہ HMDA کے پاس پیسہ ہے، اسی لئے یہ دونوں پل اگر complete ہوتے ہیں تو اسٹیٹ گورنمنٹ direct fund دے کر Land Acquisition کے پیسوں کو اگر دینگے، تو یہ complete ہوسکتا ہے۔ آج ہم سب یہ دیکھ رہے ہیں کے آپ بھی وہی روڈ سے گزر رہے ہیں اور ہم بھی وہی روڈ سے گزر رہے ہیں۔ حیدرآباد میں تمام کی تمام سڑکیں تباہ ہو چکے ہیں۔ کوئی ایسی سڑک نہیں ہے، جہاں گڑھا نہ پڑا ہو۔ پہلے ہم لوگ آدھے گھنٹے میں اسمبلی آتے تھے، لیکن آج ایک گھنٹہ لگ رہا ہے گھر سے اسمبلی کو آنے کیلئے۔ اس میں کچھ موسم کی خرابی بھی ہے، لیکن سڑکوں کی Quality نہیں بن رہی؟ کیوں کہ ہم جب بات کرتے ہیں کہ حیدرآباد انٹرنیشنل سٹی بنانا ہے۔ اور سٹی کو انٹرنیشنل لیول پر لے جانا ہے۔ پھر سڑکوں کے لئے اس سال Municipal Corporation کتنا پیسہ صرف کر رہی ہے؟ اس کے لئے گورنمنٹ کیا مدد کر رہی ہے؟ آپ نے کہا تھا کہ February 2016 میں 100 days action plan کے تحت Road development, Flyovers and Road Widening اس کے ساتھ ساتھ Electricity removing poles and under ground cables اس کا Action Plan کہاں تک آیا؟ دوسرا سوال یہ ہے- اس حکومت نے 2017-18 کے بجٹ میں ایک ہزار کروڑ روپے Greater Hyderabad Municipal Corporation کے لئے آپ نے ادا کیا تھا، لیکن ہمیں پتہ ہے کہ ابھی تک کتنی رقم کو release کیا گیا ہے۔ کچھ بھی release نہیں ہوا۔ اس کے بارے میں منسٹر صاحب بتائیں۔ کیوں کہ Direct Municipal Corporation اپنے Level میں نہیں کر سکتا ہے، جب تک گورنمنٹ کا support نہ ہو۔ الٹا گورنمنٹ رقم دینے کے بجائے Municipal Corporation سے رقم نکال کر آر ٹی سی والوں کو دینے کی وجہ سے بھی short fall ہو رہا ہے، ایک جگہ آپ نے بھی تسلیم کیا تھا کہ ہم نے دو سال تک دیا ہے۔ اب اس سال کوشش کر رہے ہیں گورنمنٹ سے بھی گزارش کر رہے ہیں کی یہ رقم آر ٹی سی کو دئے بغیر Road develop کریں۔ یہ ڈیولپمنٹ ہمارے لئے نہیں، کم از کم مودی جی کیلئے کریں جو یہاں آرہے ہیں ان کے لئے اچھے روڈ ہو۔ تا کہ حیدرآباد کا International level پر نام ہو۔

(శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, పాతూరి సుధాకర్ రెడ్డి నుండి అంతరాయం)

**మిస్టర్ ఛైర్మన్:-** ఇద్దరూ (శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి గార్లను ఉద్దేశించి) కూర్చోండి.

**శ్రీ టి. భానుప్రసాద రావు (స్థానికసంస్థలు – కరీంనగర్):-** అధ్యక్షా, టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నగరంలో ఎక్కువ జనసాంద్రత కలిగిన ప్రాంతాలలో అనేక రకాలైన ఫ్లై ఓవర్లు, అండర్ passలు చాలా వేగంగా పనులు జరుగుతున్న విషయం మనందరం గమనిస్తున్నాం. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో మనం బ్రిడ్జీలను కడుతున్నాం కానీ, కొన్ని ప్రాంతాలు వేగంగా haphazardగా వృద్ధి చెందుతున్నాయి. ఇలాంటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడికి కావలసినటువంటి 200 ఫీట్ గల రోడ్లను ముందుగానే ప్లాను చేసుకుంటే బాగుంటుంది. అలా కాకుండా ఇతర నిర్మాణాలు వచ్చిన తరువాత రోడ్లవెడల్పు కోసం వాటిని తీసివేసే పద్ధతిలో కాకుండా ముందే రోడ్ నెట్ వర్క్‌ను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని దాని కొరకు జి.హెచ్.ఎం.సి., హెచ్.ఎం.డి.ఎ.లో infrastructure development కొరకు ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కర్నె ప్రభాకర్ (నామినేటెడ్):-** అధ్యక్షా, దక్షిణ తెలంగాణ నుండి సికింద్రాబాద్ వెళ్లడానికి ఎల్.బి.నగర్ నుండి ఉప్పల్ వైపుగా వెళ్లే మార్గం ఒక్కటే ఉంది. మరొకటి లేదు. మూసి నది దాటిన తరువాత ఎల్.బి.నగర్ వైపు నాగోల్, అల్కాపురి జంక్షన్‌ను క్రాస్ చేస్తూ కామినేని దగ్గర ల్యాండ్ అయ్యే విధంగా ఒక ఫ్లై ఓవర్ నిర్మించాలి. మూసారంబాగ్‌లో ఉన్న కాజ్ వే తప్ప దానికి అనుబంధంగా ఉన్న మూసీని క్రాస్ చేస్తూ ఉప్పల్ పోయేటటువంటి బ్రిడ్జి దానికి ప్యారలల్‌గా మరొకటి బండ్లగూడ దగ్గర వేసినట్లైతే దక్షిణ తెలంగాణ నుండి వచ్చేవారు సరిగ్గా సికింద్రాబాదుకు వెళ్లే అవకాశాలు ఉంటాయి. కాబట్టి ఈ రెండు ఫ్లై ఓవర్ల కోసం ప్రతిపాదనలు పెట్టాలని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కె.తారక రామారావు:-** అధ్యక్షా, ప్రశ్ననేమో బాలా నగర్ ఫ్లై ఓవర్, అంబర్ పేట ఫ్లై ఓవర్. శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు ట్రంప్ గురించి మాట్లాడుతున్నారు. శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ గారు జహీరాబాద్‌లో వచ్చిన పరిశ్రమల గురించి మాట్లాడుతున్నారు. అధ్యక్షా, సంతోషం. తమరు అనుమతి ఇస్తే హైదరాబాదుకు సంబంధించి శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు చాలా అనుమానాలతో చాలా వ్యంగ్యంగా కూడా మాట్లాడారు. రోడ్లను మన కోసం వేయకపోయినా విదేశాల నుండి వచ్చే అతిథుల కోసమన్నా వేయాలన్నారు. చాలా సంతోషం. వారు ఏం చేశారు మేము ఏం చేశాము అనే విషయాలను చెప్పడానికి అనుమతి ఇస్తే వివరిస్తాము. మేము వచ్చి మూడున్నర సంవత్సరాలు అయింది. 50 సంవత్సరాల నుండి ఉండి కూడా కనీసం డ్రైనేజీ వ్యవస్థను కూడా చూసుకోని వారు మాట్లాడితే వారితో చెప్పించుకునే స్థితిలో మేము లేము. ఒక గంట చర్చకు అనుమతి ఇస్తే వారి వాదన, మా వాదన వినండి. ప్రజలు కూడా తీర్పు ఇస్తారు.

**మిస్టర్ ఛైర్మన్:-** ఒక రోజు లఘు చర్చలో దీని గురించి చర్చించుకుందాం. ఇది ప్రశ్నోత్తరాల సమయం కాబట్టి ప్రశ్న ఎంత ఉందో సమాధానం కూడా అంతే ఇవ్వండి.

**శ్రీ కె. తారక రామారావు:-** అధ్యక్షా, శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావుగారు అడిగిన ప్రశ్నకు సమాధానంగా బాలా నగర్, అంబర్ పేటలో జరిగే పనులలో భూ సేకరణ ఖర్చు ఎక్కువగా జరుగుతుందని ఆవేదనను వ్యక్తం చేశారు. అది వాస్తవం. ఎందుకంటే చాలా ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఈనాడు హైదరాబాదులో గాని, ఏ పట్టణ ప్రాంతాలలో గాని ఎటువంటి ప్రాజెక్టును చేపట్టినా, ఆ ప్రాజెక్టు Cost of Construction కోసం ఎంత ఖర్చు అవుతుందో దానికి దాదాపు 5 రెట్లు భూ సేకరణ కోసం ఖర్చు అవుతుంది. ఉదాహరణకు రూ.450 కోట్ల ఒక ప్రాజెక్టును తీసుకుంటే దానిలో దాదాపు రూ.367 కోట్లు భూసేకరణ కొరకు ఖర్చు అవుతుంది. వాటిని ఆర్&బి లేదా కార్పొరేషన్ ద్వారా చేయమనండి అంటే ఆర్&బి, కార్పొరేషన్‌లు రెండూ కూడా ప్రభుత్వ సంస్థలే. ఎవరి మీద భారం వేసినా వారు మళ్లీ ప్రభుత్వ ఖజానా మీద ఆధారపడవలసిందే. అదే విధంగా హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్‌కు దాదాపు రూ.1000 కోట్లు బడ్జెట్‌లో పెట్టారు ఎన్ని నిధులను విడుదల చేశారని శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు అడిగారు. ఖచ్చితంగా డిమాండ్స్ అప్పుడు వీటి గురించి తెలియజేస్తాను. హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు, మూసి నదికి రూ.500 కోట్లు ప్రభుత్వ పరంగా ఇస్తున్నాము. వాటిలో నుండి ఈరోజు కేవలం రూ.500 కోట్లు ప్రభుత్వం ఇస్తే రూ.2000 కోట్లను రోడ్ డెవలప్ కార్పొరేషన్‌కు సంబంధించిన ప్రాజెక్టులను తీసుకోబోతున్నాము. మూసీకి కేటాయించిన రూ.1,665 కోట్లతో మరొక ప్రాజెక్టును చేయబోతున్నాం. ఇవే కాకుండా వారు అన్నారు రూ.1000 కోట్లే కాకుండా ప్రభుత్వ తరపున దాని కన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా ఖర్చు పెడుతున్నాం. వాటిని ఏ విధంగా ఖర్చు పెడతామో వారికి చెప్పవలసి ఉంది.

ఈనాడు హైదరాబాద్ స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో భాగంగా దాదాపు 19 జంక్షన్‌లలో రూ. 1894 కోట్లతో పనులు నడుస్తున్నాయి. దానితోపాటు మరొకనాలుగు పనులను 10 జంక్షన్‌లలో వృద్ధి చేయడానికి రూ.975 కోట్లతో పనులను చేపట్టబోతున్నాము. వాటిలో కొన్ని పురోగతిలో ఉన్నాయి. మరి కొన్నింటికి త్వరలో టెండర్లను పిలవడం జరుగుతోంది. దాదాపు రూ. 3000 కోట్లతో ప్రభుత్వం ప్రస్తుతం స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్లానులో భాగంగా ఈ కార్యక్రమాలను చేస్తోంది. కొంత సమయం పడుతుంది. Rome was not built in a day. కొంత మందికి తొందర ఎక్కువ. 5 దశాబ్దాలు పరిపాలించి వారు చేయని పనులను మేము మూడు, నాలుగు సంవత్సరాలలో పూర్తి చేయాలనే తొందర కొందరికి ఉంది. వారు తొందర పడ్డా మేము తొందర పడకుండా చాలా నిదానంగా, చేయవలసిన పనులను పూర్తి స్థాయిలో, ప్రజలకు సంతృప్తి ఇచ్చే విధంగా చేస్తామని తెలియజేస్తున్నాను. దానితోపాటు గౌరవ సభ్యులు శ్రీ రామచంద్రరావుగారు అడిగిన ప్రశ్నకు సమాధానంగా 100 రోజుల ప్లాను గురించి అడిగారు. దానికి కూడా చర్చ పెట్టమని అడుగుతున్నాను. దాని గురించి కూడా చెబుతాము.

(అంతరాయం)

میں وہی کہہ رہا ہوں صاحب کہ آپ ایل او پی ہیں۔ آپ ہی اگر ایسا running commentary کریں تو، آپ کے ممبروں کو کون restrain کرے گا' running commentary سے ایسا محسوس ہو رہا ہے کہ یہاں کوئی کرکٹ میچ چل رہا ہے۔

11.00 ఉ. తమరు అనుమతిస్తే, అవకాశం కల్పిస్తే ఒక గంట చర్చ పెట్టుకుందాము. వారి వాదన వినండి, మా వాదన వినండి. వారు ప్రతిపక్షనాయకుడి హోదాలో ఉన్నారు. గతంలో మంత్రిగా కూడా పనిచేశారు. నేను మాట్లాడుతుంటే రన్నింగ్ కామెంట్రీ చేయడం కరెక్టు కాదు. ఇదేమన్నా క్రికెట్ మ్యాచా అధ్యక్షా? వారు మాట్లాడినప్పుడు మేము సావధానంగా విన్నాము. ఇది పద్ధతేనా?

గౌరవ సభ్యులు శ్రీ రామచంద్రరావుగారు మాట్లాడుతూ, RUBకి సంబంధించి ఆనంద్‌బాగ్ మరియు మల్కాజ్‌గిరి ప్రాంతాలను గురించి ప్రస్తావించారు. కేవలం ఆ ఒక్క ప్రాంతమే కాకుండా, మిగిలిన ప్రాంతాల గురించి కూడా రైల్వే శాఖతో సమావేశం జరిపి, వారికి మనం డిపాజిట్ చేయవలసిన మొత్తాన్ని జిహెచ్ఎంసి ద్వారా చెల్లించడం జరిగింది. మన సీవరేజ్ బోర్డు మరియు SPDCL ఈ రెండూ కూడా ప్రస్తుతం property shifting పనిలో ఉన్నాయి. కొంత ఆలస్యం అయినప్పటికీ, ఈ కార్యక్రమాన్ని కూడా తప్పకుండా పూర్తి చేస్తామని మనవి చేస్తున్నాను. అలాగే రోడ్ల గురించి కూడా అడిగారు. ప్రశ్నకు సంబంధం లేకపోయినప్పటికీ చెప్పవలసిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. ప్రస్తుతం రూ.77కోట్లు వెంటనే విడుదల చేసి, మొన్న కురిసిన భారీ వర్షాలకు దెబ్బ తిన్న రోడ్ల కొరకు కేటాయిస్తున్నాము. దానితో పాటు మరొక రూ.121కోట్లు Road vulnerable

pointsని గుర్తించి, వాటి రిపేర్లు చేయిస్తున్నాము. అంటే ట్రంప్‌గారో, మరొకరో వస్తున్నారని కాదు అధ్యక్షా. ప్రభుత్వం యొక్క బాధ్యతగా ఈ పనులు చేస్తున్నామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**మిస్టర్ చైర్మన్:–** ప్రశ్న నెంబర్ 2433 సంబంధిత శాఖామాత్యులు శాసనసభలో బిజీగా ఉన్నందువలన, దానిని మంత్రిగారు రాగానే తీసుకోవడం జరుగుతుంది. ఇప్పుడు ప్రశ్న నెంబర్ 2148.

**FEE REGULATORY COMMITTEE OF PRIVATE EDUCATIONAL INSTITUTIONS**

**LCQ .No.2148(66)**

Sri Mohammed Ali Shabbir, Sri T. Santhosh Kumar, M.L.C.s.:– Will the Deputy Chief Minister (Education) be pleased to state;

(a) Whether it is a fact that the Fee Regulatory Committee has been constituted to study the fee structure in the various Corporate and Private Educational Institutions in the State;

(b) Whether it is also a fact that the Private and Corporate Educational Institutions are collecting heavy fee during the present acadamic year also; and

(c) if so, the measures taken in this regard.

Hon'ble Deputy Chief Minister (Education) (SRI. KADIYAM SRIHARI):– (a) A Committee under Prof.T. Tirupathi Rao, Former V.C. of O.U. as Chairman has been constituted by Government vide G.O.Rt.No.37, School Education(Genl) Department, dt.21.03.2017, to examine the proposals regarding regulation of fees in private recognized unaided schools in the State.

(b &c) This Committee has held several meetings with the Managements and Parents' Associations and obtained their views / suggessions on various aspects of this issue. The Committee has sought information online, from the Managements, regarding their fee and expenditure for the past two years, so as to analyze the facts, before giving their final recommendations to the Government which is under process.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:–** అధ్యక్షా, తమరి ద్వారా గౌరవ ఉపముఖ్యమంత్రి గారిని అడిగేది ఏమిటంటే మాజీ వైస్ ఛాన్సలర్ అధ్యక్షతన ఒక కమిటీని వేశామన్నారు. అధ్యక్షా, ఇది చాలా బర్నింగ్ ఇష్యూ. అనేకమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ ప్రైవేటు మరియు కార్పొరేట్ విద్యాసంస్థల మీద ఎలాంటి కంట్రోల్ లేకుండా, వారిని గాలికి వదిలేశారు. ఆ ప్రభుత్వం ఈ ప్రభుత్వం అని చెప్పను. కాని ఈ ప్రభుత్వం వచ్చి మూడున్నర సంవత్సరాలు గడిచింది కాబట్టి, తెలంగాణ బిడ్డలకు సాయం చేయడానికి ఈ కమిటీ రికమండేషన్స్ ఉపయోగించుకోవాలి. ముఖ్యంగా ప్రైమరీ స్థాయిలో ఈ ఫీజుల దోపిడీ ఎక్కువగా ఉంది. కార్పొరేట్ స్కూల్స్, కాలేజీలు టి.వి.లు మరియు పేపర్లలో ర్యాంకుల గురించి విపరీతంగా ప్రచారం చేసుకుంటున్నాయి. దాని వలన తల్లిదండ్రులు ప్రలోభంలో పడుతున్నారు. ఫలానా పాఠశాల లేదా కాలేజీలో తమ పిల్లలను వేసినట్లయితే వారికి మంచి ర్యాంకులు వస్తాయని ఆశపడుతున్నారు. ఈ రోజు కూడా పేపర్‌లో చూశాను. కార్పొరేట్ కాలేజీ హాస్టల్స్ నరకంలా ఉన్నాయని వార్త వచ్చింది.

ఎల్‌కెజి, యుకెజిలో ప్రభుత్వం అంగన్‌వాడీలో ఉచిత విద్యను అందిస్తున్నది. ప్రైవేటు పాఠశాలల్లో రూ.50వేలు డొనేషన్ తీసుకుంటున్నారు. తరువాత 1నుండి 5వ తరగతిలో అడ్మిషన్ కావాలంటే రూ.1.50లక్షల డొనేషన్, 6నుండి 9వ తరగతి కొరకు రూ.2లక్షల వరకు డొనేషన్ మరియు 10వ తరగతిలో ప్రవేశం కావాలంటే రూ.75వేల డొనేషన్ వసూలు చేస్తున్నారు. ఎల్‌కెజి నుండి పదవ తరగతి వరకు విపరీతంగా డబ్బు వసూలు చేస్తున్నారు. బిల్డింగ్ ఫండని, అదని, ఇదనీ రకరకాల పేర్లతో డబ్బు తీసుకుంటున్నారు. వారి మీద ఎటువంటి కంట్రోలు లేదు. ఈ విషయం గురించి ఉభయ సభల్లో గతంలోనూ చర్చ జరిగింది. కాబట్టి ఈ ప్రైవేటు యాజమాన్యాన్ని నియంత్రించవలసిన అవసరం ఉంది. ఇంజనీరింగ్ కాలేజీలు కూడా తమ ఇష్టం వచ్చినట్లు రూ.35వేలు, 55వేలు, లక్ష, రెండు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాయి. కాబట్టి ప్రభుత్వం వారివారి స్టాండర్డ్స్‌ను బట్టి ఏ–కేటగిరి, బి–కేటగిరి, సి–కేటగిరి ఇలా ఫిక్స్ చేస్తూ, ఫీజు విషయంలో కూడా ఒకమొత్తాన్ని నిర్ణయించి, అంతకంటే ఎక్కువ తీసుకుంటే, చర్యలు తీసుకుంటామని చెబుతూ, దాని గురించి బాగా ప్రచారం చేసినట్లయితే, పేరెంట్స్‌కి కూడా అవగాహన ఏర్పడుతుంది. కాలేజీ

యాజమాన్యాలు ఇష్టమొచ్చినట్లుగా డబ్బులు వసూలు చేసే అవకాశం తగ్గిపోతుంది. ఆ విధంగా చేసినట్లయితే మధ్యతరగతి తల్లిదండ్రులకు చాలా రిలీఫ్‌గా ఉంటుంది. వారు ఎక్కడెక్కడో అప్పులు చేసి, పిల్లలను చదివిస్తుంటారు. గౌరవ ఉపముఖ్యమంత్రిగారికి స్కూల్ ఎడ్యుకేషన్‌లో మంచి అనుభవం ఉంది. కమిటీ సమర్పించిన నివేదిక మీద చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** అధ్యక్షా, కార్పొరేట్ విద్యా సంస్థలలో అధిక ఫీజులు వసూలుచేస్తున్న మాట మాత్రం వాస్తవం. దీనిని దాచిపెట్టవలసిన అవసరం ఏమీ లేదు. ఈ అధిక ఫీజులను రెగ్యులేట్ చేయడానికి గతంలో ఉన్న ప్రభుత్వాలు కూడా కొంత ప్రయత్నం చేసినాయి. 1994లో జిఓ నెంబర్.1 అని ఒకటి తీసుకువచ్చారు. ప్రత్యేకించి అధిక ఫీజును రెగ్యులేట్ చేయడానికి జిఓ నెంబర్ 91, 2009లో తీసుకువచ్చారు. దీని ద్వారా District Fee Regulation Committeesను ఏర్పాటు చేయాలి. జిల్లా స్థాయిలో ఏర్పాటైన ఆ కమిటీలు ఆ యొక్క పాఠశాలలు, కాలేజీల స్టాండర్డ్స్‌ను దృష్టిలో పెట్టుకుని ఫీజును నిర్ణయించాలని చెబితే, ప్రైవేటు యాజమాన్యాలు హైకోర్టుకి వెళ్లి, ఆ ఉత్తర్వులను కొట్టివేయించాయి. దానిపైన ప్రభుత్వం సుప్రీం కోర్టుకి వెళ్లగా, అక్కడ కూడా జీ.ఓ.91 నిలబడలేదు. తదుపరి మాకు వస్తున్న సమాచారాన్ని దృష్టిలో పెట్టుకుని అటు పేరెంట్స్ అసోసియేషన్ నుంచిగాని, వివిధ విద్యార్థి సంఘాల నుంచిగాని వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకుని, ఒక హైలెవెల్ కమిటీ వేయాలని, ఆ కమిటీ రికమెండేషన్స్ వచ్చిన తరువాత ప్రభుత్వపరంగా జిల్లా స్థాయిలో ఒక Fee Regulation Committee ఏర్పాటుచేసి, తద్వారా కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మనవి చేస్తున్నాను. గతంలో కూడా హైదరాబాద్ పట్టణంలోనే కాకుండా, జిల్లా కేంద్రాలలో ఉన్న అనేక కార్పొరేట్ స్కూల్స్‌పైన హైకోర్టు ఆదేశాల మేరకు తనిఖీలు, రెయిడ్స్‌ను నిర్వహించడం జరిగింది. 162 స్కూల్స్‌పైన రెయిడ్స్ జరిపి, ఎందుకు వారి గుర్తింపును రద్దు చేయకూడదని నోటీసులు జారీ చేశాము. మరల వారు కోర్టుకి వెళ్లి, స్టే తెచ్చుకున్నారు. దాని వలన ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయింది.

అలాగే నారాయణ, శ్రీ చైతన్య వంటి కార్పొరేట్ జూనియర్ కళాశాలల పైన గత నెల రోజులుగా మేము తనిఖీలు నిర్వహిస్తున్నాము. ఎక్కడైతే హాస్టల్ వసతి ఉందో అలాంటి 150 కార్పొరేట్ జూనియర్ కళాశాలల పైన మేము రెయిడ్స్ చేయడం జరిగింది. ఇంతకుముందు ఎల్ఓపిగారు చెప్పినది మేము ఇచ్చిన సమాచారమే. ఇంటర్మీడియట్ కమీషనర్‌గారు నిన్న ప్రెస్ మీట్‌లో చెప్పిందే ఎల్ఓపిగారు చెప్పారు. ఈ సందర్భంగా ఈ సభద్వారా తల్లిదండ్రులకు మేము చేసే విజ్ఞప్తి ఏమిటంటే కాలేజీల పేరు చూసి, వారు ఇచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దు. లక్షల రూపాయలు డొనేషన్లు కట్టి, ఆ తరువాత నష్టపోయాం అని ఆవేదన చెందుతున్న పరిస్థితులను మేము గమనిస్తున్నాము. అందుకని ఈ సంవత్సరం విద్యాశాఖ నుండి మేము ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నాము. 2018 మార్చి లోపల ప్రైవేటు కళాశాలల గుర్తింపు, అఫిలియేషన్ ప్రక్రియను పూర్తి చేస్తాము. ఒకసారి ఆ ప్రక్రియ పూర్తి చేసిన తరువాత, జిల్లాల వారీగా ఆ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతాము. కాని ఈ విషయం తెలుసుకున్న ప్రైవేటు కళాశాలలు అప్పుడే అడ్మిషన్లు ప్రారంభించినట్లు మా దృష్టికి వచ్చింది. మేము సమాచారం సేకరించడానికి ప్రయత్నించాము. తల్లిదండ్రుల దగ్గర నుండి కూడా మాకు సమాచారం రావడం లేదు. కాబట్టి తల్లిదండ్రులు అందరూ ఆ కళాశాలకు రికగ్నిషన్ ఉందా,లేదా అనేది చూసుకుని పిల్లలను ఆ విద్యాసంస్థలో చేర్పిస్తే బాగుంటుందని తెలియజేస్తున్నాను.

2018–19 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రైవేటు పాఠశాలల రికగ్నిషన్‌గాని, అఫిలియేషన్‌గాని 2018 మార్చినాటికి పూర్తి చేసి, దానిని అందరికి అందుబాటులో ఉంచాలని అనుకుంటున్నాము. తిరుపతిరావుగారి కమిటీ నివేదికను సమర్పించడానికి నవంబర్ 2017 వరకు గడువు అడిగారు. వారు నివేదిక ఇవ్వగానే తదుపరి చర్యలు తీసుకుంటామని మనవి చేస్తున్నాను. వందకు వంద శాతం అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేటు కళాశాలలను నియంత్రించే విధంగా తెలంగాణ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని మనవి చేస్తున్నాను.

جناب محمد علی شبیر(Janab Md.Ali Shabbir): صاحب میں متفق ہوں جو سچ ہے، اس کو ایوان کے سامنے لایا گیا ہے

اس کے لئے میں آپ کو مبارک باد بھی دیتا ہوں، اور یہ امید کرتا ہوں کہ اس پر serious action ہوگا۔

ఈ 2018–19 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియను ప్రైవేటు కళాశాలలు అప్పుడే ప్రారంభించడం జరిగింది. మార్చిలో అడ్మిషన్ కొరకు వచ్చిన వారికి జూన్‌లో ఇస్తామంటున్నారు. కాని అప్పుడే వారు ప్రాసెస్ అంతా పూర్తి

చేసుకుంటున్నారు. కాబట్టి తిరుపతిరావు గారి కమిటీని రిక్వెస్ట్ చేసి, నవంబర్‌లోనే రిపోర్టు తెప్పించుకుని, తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** గౌరవ ఎల్‌ఓపిగారు చెప్పినట్లుగా ఇప్పటికే అన్ని పాఠశాలలకు నోటీసులు ఇచ్చాము. 2018-19కి సంబంధించి అడ్మిషన్లు చేయవద్దు అని స్పష్టంగా చెప్పడం జరిగింది. తల్లిదండ్రులకు కూడా ఈ సభ వేదికగా నేను అప్పీల్ చేస్తున్నాను. వారు రికగ్నిషన్, అఫిలియేషన్ చూసుకోకుండా, పిల్లలను పాఠశాలలు మరియు కళాశాలల్లో చేర్చవద్దని చెప్పి విజ్ఞప్తి చేస్తున్నాను.

**మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా**

ప్రశ్న నెం.2433(65)

శ్రీ వి. భూపాల్ రెడ్డి, ఎం.ఎల్.సి.,:– గౌరవనీయులైన పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) మిషన్ భగీరథ క్రింద గ్రామాలలోని ప్రతి ఇంటికి నల్లా ద్వారా నీటిని సరఫరా చేయాలని నిర్ణయించిన విషయం వాస్తవమేనా;

(ఆ) అయితే, ఈ సంవత్సరం చివరినాటికి దీని క్రింద వర్తింపు చేసే గ్రామాల సంఖ్య ఎంత;

(ఇ) ఔటర్ రింగురోడ్డు పరిధిలోపు గల గ్రామాలకు HMWS&SB ద్వారా త్రాగునీటిని సరఫరా చేయడానికి సంబంధించి, పనుల పురోగతి ఏమిటి?

గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రి (శ్రీ కె. తారక రామారావు):– (అ) అవునండీ.

(ఆ) ఇంటి నల్లా కనెక్షన్లతో పాటు మిషన్ భగీరథతో 4125 గ్రామాలను వర్తింపజేయాలని లక్ష్యంగా నిర్ణయించడమయింది.

(ఇ) ఔటర్ రింగురోడ్డు లోపు గల 183 గ్రామాలకు నీటిని సరఫరా చేయడానికి HMWS&SB బాధ్యత వహిస్తుంది. 2017 ఆగస్టులో ప్రాజెక్టు పనులను ప్రారంభించడమయింది. సుమారు 80 రిజర్వాయర్ పనులను ప్రారంభించగా, మిగిలిన పనులు ప్రారంభదశలో ఉన్నాయి. దశలవారీగా ఈ 183 గ్రామాలకు నీటిని సరఫరా చేయడానికిగాను 2018 ఆగస్టు నాటికి ప్రాజెక్టు పనులను పూర్తి చేయడమవుతుంది.

**శ్రీ వి. భూపాల్ రెడ్డి (స్థానిక సంస్థలు – మెదక్):–** అధ్యక్షా, ఈ రింగు రోడ్డు లోపల వచ్చే గ్రామాలకు సంబంధించిన నీటి సమస్య గురించి నేను ఒక రెండు నిమిషాలు మాట్లాడతాను. ఈ గ్రామాలలో ఇప్పటివరకు ఎలాంటి పనులు మొదలుపెట్టలేదు. ఆగస్టులో మొదలుపెట్టినట్లు మంత్రిగారు చెప్పారు కాని, పైపులు వేయడంగాని, మరి ఎలాంటి పనులు జరగడం లేదు. చేస్తామంటున్నారు. సంతోషం. ఒక ఇబ్బంది ఏమిటంటే మిషన్ భగీరథ పథకం మాదిరిగా ఈ రింగురోడ్డు పరిధిలోని గ్రామాలకు కూడా చేస్తే బాగుంటుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. దానికి కారణం ఏమిటంటే మెట్రో వాటర్ శాఖనుండి చేస్తే వాటి చార్జీలు ఎక్కువగా ఉంటాయని ప్రజలు అనుకుంటున్నారు. దానికి అనుగుణంగా ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటున్నది, ఎప్పటిలోగా చేస్తారు, దీని ఛార్జీలు మిషన్ భగీరథకు అనుగుణంగానే చేస్తారా, డిపాజిట్ మొత్తం అదే విధంగా ఉంటుందా అనేది తెలియజేయవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కె. తారక రామారావు:–** అధ్యక్షా, హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఈ కార్యక్రమాలను చెయ్యాలనే ఉద్దేశ్యంతోనే ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో ఉన్న గ్రామాలన్నిటికి కూడా హైదరాబాద్ మెట్రో వాటర్ అండ్ సీవరేజ్ బోర్డుద్వారా తాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నది. ఇందులో ఇందాక నేను చెప్పినట్లు ఇప్పటికే 80 రిజర్వాయర్ల నిర్మాణం ఇప్పటికే ప్రారంభం అయింది. మిగతా 103 రిజర్వాయర్ల నిర్మాణం పూర్తిచేయవలసి ఉంది. మొత్తం 2007 కి.మీ పైపులైను వేయవలసి ఉంది. ఆ పనులు ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉన్నాయి. కాకపోతే ఇందాక నేను చెప్పినట్లు ఆగస్టు 2018నాటికి తప్పకుండా పూర్తి చేస్తాము.

దీనితోపాటు గౌరవ సభ్యులు భూపాల్‌రెడ్డిగారు ఎన్ని రూపాయలకు కనెక్షన్ ఇస్తారని అడిగినారు. మిషన్ భగీరథలో ఏ విధంగానైతే ఇస్తున్నామో అదే రకంగా కేవలం ఒక్క రూపాయికే కనెక్షన్ ఇస్తాము. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పరిధిలో ఒక్కో మనిషికి 150 లీటర్లు, గ్రామీణ ప్రాంతాలలో 100 లీటర్లు ఇస్తాము. కొత్తగా ఒకటిన్నర లక్షల కనెక్షన్లు రాబోతున్నాయి. దానితోపాటు ప్రతి మనిషికి 150లీటర్లు రాబోతున్నాయి. ప్రజలకు ఎటువంటి భారం కాబోదని గౌరవ సభ్యుడికి తమరిద్వారా తెలియజేస్తూ నిర్ణీత వ్యవధిలో పూర్తి చేస్తామని మరొకసారి మనవి చేస్తున్నాను.

**శ్రీ వి. భూపాల్ రెడ్డి:–** అధ్యక్షా, ప్రజల్లో ఉన్న ఆందోళనను నేను తెలియజేయడం జరిగింది. దానికి గౌరవ మంత్రిగారు ఇచ్చిన సమాధానంతో నేను తృప్తి చెందుతూ, నిజంగా ఇది జరిగే విధంగా చూడాలని కోరుతున్నాను.

**జిల్లా కేంద్రాలలో ఐటి పార్కుల స్థాపన**

ప్రశ్న నెం.2339(67)

శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్,ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన సమాచార సాంకేతిక, విజ్ఞాన శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) ప్రతి జిల్లా ప్రధాన కార్యస్థానంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్కులను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదైనా వుందా;

(ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

(ఇ) నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యస్థానంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్కు లేదా హబ్‌ను నెలకొల్పే ప్రతిపాదన ఏదైనా వుందా;

(ఈ) అయితే, ఈ విషయంలో తీసుకుంటున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన సమాచార సాంకేతిక, విజ్ఞాన శాఖ మంత్రి (శ్రీ కె. తారక రామారావు):- (అ) అవునండీ. రాష్ట్రంలోని టైర్-II పట్టణాలలో టెక్నాలజీ పార్కులు/ఐటి టవర్ ఏర్పాటు చేసే ప్రతిపాదన వుంది. ఈ పట్టణాలలో అనేక జిల్లా ప్రధాన కార్యస్థాన పట్టణాలు కలిసి వున్నాయి.

(ఆ) వరంగల్‌లో 15000 చదరపు అడుగుల ఐటి టవర్‌తోపాటు ఐటి పార్కును ఇప్పటికే అభివృద్ధి చేయడమయింది. 25000 చదరపు అడుగుల మరో ఐటి టవర్‌ను ఖమ్మం పట్టణంలో నిర్మాణంలో వుంది. నిజామాబాదు, కరీంనగర్ పట్టణాలలో ఒక్కొక్కటి 25000 చదరపు అడుగుల ఐటి టవర్ల అభివృద్ధి కోసం ఇప్పటికే అనుమతి మంజూరు చేయడమైంది.

(ఇ) అవునండీ. పైన తెలిపిన విధంగా నెలకొల్పే ప్రతిపాదన ఉన్నది.

(ఈ) నిజామాబాద్‌లో ఐటి టవర్లను నెలకొల్పే ప్రదేశం కోసం భూమిని గుర్తించడం, సాంకేతిక అంచనాల తయారీ పురోగతిలో ఉన్నాయి. రాబోయే 2-3 నెలల్లో నిర్మాణ పని ప్రారంభమవుతుందని ఆశించడమైంది.

**శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ (శాసనసభ నియోజకవర్గం):-** అధ్యక్షా, అరవై సంవత్సరాలలో కేవలం హైదరాబాద్‌కే పరిమితమైనటువంటి ఐటి అభివృద్ధిని తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్‌గారి ఆలోచనా విధానంతో, మరియు యువకులు, మంత్రివర్యులు శ్రీ కెటిఆర్‌గారి ఆలోచనా విధానంతో నాలుగు జిల్లా కేంద్రాలలో ఈ ఐటి హబ్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయం. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఐటి హబ్‌లు ఉంటే, జిల్లా కేంద్రాలలో ఉండే యువకులకు కూడా అవకాశాలు వస్తే, జిల్లా కేంద్రాలు కూడా అభివృద్ధి చెందుతాయి అనే అభిప్రాయం మాకు ఉండేది.

11.20 ఉ. మొన్ననే నిజామాబాదులో కూడా ఐటి హబ్ ఏర్పాటు చేయబోతున్నారని పేపర్లలో వస్తే మేమెంతో సంతోషపడ్డాం. ఈ ఐటి హబ్ వల్ల యువకుల్లో ఆనందం కనబడుతోంది. ఈ నాలుగు జిల్లాలలోనే గాకుండా తెలంగాణాలో ఇతర ప్రాంతాలలో కూడా ఐటి హబ్బులు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. నిజామాబాదులో ఐటి హబ్ ఏర్పాటు చేయబోతున్నారు కాబట్టి ఇంక్యుబేటర్‌ని కూడా నిజామాబాదులో ఏర్పాటు చేస్తున్నారా? 50, 60 విదేశీ సంస్థలతో ఒప్పందం కూడా చేసుకున్నట్లుగా పేపర్లలో వచ్చింది, ఆ విషయం కూడా మంత్రిగారు చెబితే బాగుంటుంది. నిజామాబాదులో ఐటి హబ్ ఏర్పాటుకు భూసేకరణ కూడా జరుపుతున్నారని వారు సమాచారం ఇచ్చారు కాబట్టి ఎప్పటిలోగా అక్కడ ఐటి హబ్, ఇంక్యుబేటర్‌ను ప్రారంభిస్తారో చెప్పాలని కోరుతున్నాను.

**శ్రీ కె. తారక రామారావు:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతున్నాను. నిజామాబాదుకు సంబంధించి ఆ పట్టణ శాసన సభ్యులు గణేష్ గుప్తా గారు, అక్కడి పార్లమెంటు సభ్యురాలు .. ఇద్దరూ కలిసి అమెరికాలో వాళ్లకుండే పరిచయాలతో ఐటి కంపెనీలకు స్వయంగా వెళ్లి పరిశీలించి, మొత్తానికి ఒక 50 పైచిలుకు ఐటి కంపెనీల నుంచి expression of interest తీసుకొచ్చి మాకు సమర్పించడం జరిగింది. దానికి అనుగుణంగా 25వేల చదరపు అడుగుల్లో ఏర్పాటు చేయడానికి పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని 18 నెలల్లోపు పూర్తి చేయాలని అనుకుంటున్నాం.

కేవలం నిజామాబాదు, కరీంనగర్, ఖమ్మం, వరంగల్‌లో మాత్రమే కాకుండా, ఈరోజు తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన రూరల్ టెక్నాలజీ పాలసీ ద్వారా జనగాం లాంటి పట్టణాలలో కూడా ఐటి కంపెనీలు ఏర్పాటు చేశాం. మొన్ననే వాళ్లు రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. హుజూరాబాదు పట్టణంలో కూడా ఒక ఐటి కంపెనీ ప్రారంభం అయింది. జడ్చర్ల లాంటి ప్రాంతాలలో కూడా ఐటి కంపెనీలు ఏర్పాటు చేయడానికి ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు. కేవలం దీన్ని ఒక టవర్ క్రింద కాకుండా గ్రామీణ ప్రాంతాలలో

కూడా ఆవిష్కరణలు ప్రోత్సహించడానికి అక్కడ ఐటి టవర్స్‌తోబాటు ఇంక్యుబేటర్స్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. గౌరవ ముఖ్యమంత్రి గారి ఆలోచన మేరకు ఐటిని ద్వితీయ శ్రేణి పట్టణాలకు కూడా తప్పకుండా తీసుకొని వెళతాం.

## రైతులపై తప్పుడు కేసులు

ప్రశ్న నెం.2193(68)

సర్వశ్రీ/శ్రీమతి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, ఆకుల లలిత, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎంఎల్‌సిలు:- గౌరవనీయులైన వ్యవసాయ శాఖామంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) రైతుల ఉత్పత్తికి కనీస మద్దతు ధరను డిమాండు చేస్తున్న వారిపై తప్పుడు కేసులు సృష్టించి వారిని జైళ్లలో ఉంచిన విషయం వాస్తవమేనా;

(ఆ) రాష్ట్రంలో కొంత మంది రైతులు వ్యవసాయ ఉత్పత్తిని తగులబెట్టిన విషయం కూడా వాస్తవమేనా;

(ఇ) అయితే, ఆ వివరాలేమిటి;

(ఈ) రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి కోసం కనీస మద్దతు ధర ఉండేలా చూడటానికి తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రి (శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి):- (అ) లేదండీ.

(ఆ) లేదండీ.

(ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

(ఈ) కనీస మద్దతు ధర కంటె తక్కువగా ధరలు పడిపోయినప్పుడు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగా వ్యవసాయ ఉత్పత్తులకు ఎం.ఎస్.పి.ని అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నది.

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి:-** అధ్యక్షా, మంత్రిగారు నాలుగు ప్రశ్నల్లో మూడింటికి లేదండీ, లేదండీ, ఇది ఉత్పన్నం కాదని సమాధానం చెప్పారు. నాలుగో ప్రశ్నకు మాత్రం చెప్పారు. ఇది అతి ముఖ్యమైన అంశం. ఖమ్మంలో ఏప్రిల్ 28, 2017 నాడు వ్యవసాయ మార్కెట్ దగ్గర జరిగిన సంఘటనలో బలహీన వర్గాలకు చెందిన ముగ్గురు రైతులు, షెడ్యూల్డ్ ట్రైబ్స్‌కి చెందిన ఏడుగురు, మొత్తం 10 మంది రైతుల మీద తప్పుడు కేసులు పెట్టారు. మిర్చీకి ధర రావడం లేదని పది రోజుల నుంచి మార్కెట్ దగ్గర పడిగాపులు కాస్తే, అక్కడ జరిగిన వ్యవహారంపై మూడు ఎఫ్.ఐ.ఆర్ లు నమోదయ్యాయి. ఎఫ్.ఐ.ఆర్ నెం.90, 91,92 లు నమోదయ్యాయి. ఇది రిమాండ్ రిపోర్టు(తన చేతిలో ఉన్న కాపీని చూపిస్తూ). ఇంకొక ఎఫ్.ఐ.ఆర్ కూడా ఉంది. అఫెన్స్ జరిగింది ఏప్రిల్‌లో. జరిగిన సమయం 11.00 గంటలు. ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసింది 8 గంటలకు. ఇందులో కుట్రపూరిత ఉద్దేశపూర్వక కేసులు కూడా పెట్టారు. ఐపిసి120(బి), 148, 436,448,506, 149 సెక్షన్ల క్రింద కేసులు పెట్టారు. ఇంత గంభీరమైన అంశంపై లేదండీ, ఉత్పనం కాదండీ, అసలు కేసే లేదని మంత్రిగారు మాట్లాడుతున్నారు. 2014లో రైతుల మీద రౌడీషీట్లు కూడా ఓపెన్ అయ్యాయి. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం, కృష్ణాజీవాడ గ్రామంలో మొక్కజొన్న అంశానికి సంబంధించి పోలీసు స్టేషన్లో రైతుల మీద రౌడీషీట్లున్నాయి. కోర్టు కేసులను కొట్టేసింది.

అధ్యక్షా, ఈరోజు వరల్డ్ అప్రిషియేషన్ డే. ఆన్ రికార్డు చెబుతున్నాను. మాజిల్లాకి చెందిన గౌరవ మంత్రిగారు కూడా సభలోనే ఉన్నారు. ఏడుగురు ఎస్టీ రైతులు, ముగ్గురు బిసి రైతుల మీద కేసులు పెట్టారు, వాళ్లు అమాయకులు. మా సొంత మండలం కల్లూరులో ఒక రైతుకి నేను కొంత ఆర్థిక సహాయం కూడా చేయడం జరిగింది. సూర్యాపేటలో దోమకాటుకు గురైన వరి పంటకు నిప్పు పెట్టారు రైతులు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. అలాంటి సందర్భంలో లేదండీ, ఉత్పన్నం కాదంటే మాకు బాధ కలుగుతోంది. ఆ రైతుల మీద పెట్టిన కేసులను విత్‌డ్రా చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాను.

**శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు సుధాకర్ రెడ్డిగారు పెద్దలు, అక్కడ ఏమి జరిగిందో వారికి అన్ని విషయాలు తెలుసు. అక్కడ కేసులు పెట్టింది కనీస మద్దతు ధర అడగడానికి వచ్చిన వాళ్ల మీద కాదు. మార్కెట్ ఆస్తులను ధ్వంసం చేసిన వాళ్లమీద కేసులు పెట్టారు. చట్ట ప్రకారం ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వాళ్లు ఎంత పెద్ద వారైనా కేసులు పెట్టక తప్పదు. కనీస మద్దతు ధర అడగడానికి వచ్చిన వాళ్ల మీద కేసులు పెట్టలేదు. ఐపిసి సెక్షన్స్ గురించి చెప్పారు. కేసులను విత్‌డ్రా చేసుకోవాలన్నారు. ఆ కేసులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి:-** రైతులు చేయలేదు. కమిషన్ ఏజంట్లు చేశారు. ఎంక్వైరీ చేయండి, వాస్తవాలు తెలుస్తాయి. మంత్రిగారు బుల్డోజ్ చేస్తున్నారు. ఇది చాలా సీరియస్ ఇష్యూ. ముగ్గురు బిసి రైతులు, ఏడుగురు ఎస్టీ

రైతుల మీద కేసులు పెట్టారు. వాళ్లంతా బలహీన వర్గాలకు చెందిన వాళ్లే. ఆ రైతుల మీద పెట్టిన కేసులను విత్‌డ్రా చేస్తామని మంత్రిగారు చెప్పడం లేదు.

**మిస్టర్ ఛైర్మన్:–** సుధాకర్ రెడ్డి గారూ, మీ ప్రశ్న ఎంత ముఖ్యమో మిగతా ప్రశ్నలు కూడా అంతే ముఖ్యం. మిగతా ప్రశ్నలు వచ్చే సమయంలో ఈవిధంగా అడ్డు పడడం భావ్యం కాదు. మిగతా ప్రశ్నలు రావద్దా? మీ పద్ధతేమీ బాగాలేదు.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:–** కనీసం మాకు ప్రొటెస్టు చేసే అవకాశమైనా ఇవ్వండి అధ్యక్షా!

(ఈ దశలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి వెల్‌లోకి వచ్చి... తమకు ప్రొటెస్టు చేసే అవకాశం ఇవ్వాలని కోరారు.)

**మిస్టర్ ఛైర్మన్:–** ప్రొటెస్టు చేస్తారా? ఓ.కె. వెళ్లండి, అవకాశం ఇస్తాను.

(గౌరవ ఛైర్మన్ సూచన మేరకు సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి వెల్‌లోంచి తిరిగి వచ్చి తన స్థానంలో ఆశీనులయ్యారు)

**శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి:–** అధ్యక్షా, వాళ్లు ప్రొటెస్ట్ చేసే ముందు ఒక విషయం చెప్పడానికి అవకాశం ఇవ్వండి. ఈ కేసులన్నీ కావాలని పెట్టిన కేసులు కాదు. రాజకీయ ఉద్దేశంతో, ఎవరి మీదో కోపం కాదు. వారి హయాంలో కూడా రైతుల మీద కేసులు పెట్టారు. ఒకటి – 18.11.2010, ఎఫ్ఐఆర్ నెం.316 ప్రకారంగా జమ్మికుంట యందు మాచర్ల రమేష్, మరొకముగ్గురు మీదకేసులు పెట్టారు. రెండు – ఎఫ్ఐఆర్ నెం. 98/2012, 24.9.2012 నాడు బాలస్వామి మరియు 16 మందిపై మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్రలో కేసు పెట్టారు. ఎవ్వరూ కూడా చట్టానికి అతీతులు కాదు. చట్టాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి మీదా ఉంది. ఇది రైతుల మీద కక్ష కాదు. రైతుల మీద మాకున్నంత ప్రేమ ఇంకెవ్వరికీ లేదు. ఇది కేవలం రాజకీయంగా డైవర్ట్ చేయడం తప్ప మరొకటి కాదు. వారు ఆనాడు ఆ రెండు కేసులు ఎందుకు పెట్టారు? ఆనాడు అధికారంలో ఎవరున్నారు? 2010, 2012లో ఎవరు అధికారంలో ఉన్నారు? కేసులుంటే ఉండవచ్చు, తప్పు చేసిన వాళ్ల పేరు మీద, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన వాళ్ల మీద, చట్టానికి వ్యతిరేకంగా పని చేసిన వాళ్ల మీద, అటువంటి వాళ్లు ఎవరైనా సరే యాక్షన్ తీసుకుంటాం. అది పరిపాలనలో భాగం. దయచేసి వాళ్లు ప్రొటెస్టు చేసే ముందు ఈ రెండు కేసులకు సమాధానం చెప్పాలి. ఈ రెండు కేసులు ఎవరి హయాములో పెట్టారు? ఎందుకు రైతుల మీద ఈ రెండు కేసులు పెట్టారు. దీనికి సమాధానం చెప్పిన తర్వాత వాళ్లు ప్రొటెస్టు చేయాలి.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:–** మంత్రివర్యులు 2010కి వెళ్లారు. ఏడు సంవత్సరాలు వెనక్కి వెళ్లి, ఏడు సంవత్సరాల నాటి సమాధానం ఇవ్వాలని అడుగుతున్నారు. మా సభ్యులు సుధాకర్ రెడ్డిగారు స్పెసిఫిక్‌గా అడిగారు. మీరు సమాధానం చెబుతూ కేసులు ఎక్కడా పెట్టలేదని అంటేనే మేము అడిగాము. ఖమ్మంలో ఏమి జరిగిందో భారతదేశమే కాదు యావత్ ప్రపంచమే చూసింది. రైతులకు బేడీలు వేసి జైలుకు తీసుకెళ్లిన సంఘటనను అంతర్జాతీయంగా అందరూ చూశారు. అలాగే కామారెడ్డి జిల్లా, తాడ్వాయి మండలం, కృష్ణాజీవాడ గ్రామంలో....

**మిస్టర్ ఛైర్మన్:–** క్వశ్చన్ అవర్ పూర్తి అయినట్లుగా భావించవలసిందిగా గౌరవ సభ్యులను కోరుతున్నాను. Question Hour is Completed. ఇక ఎవ్వరికీ మైకు ఇచ్చేది లేదు. బిఏసిలో నిర్ణయించిన బిజినెస్‌నే టేకప్ చేస్తున్నాం, ఇతర బిజినెస్‌ను టేకప్ చేయడం వీలు కాదు. సమయాభావం వల్ల మిగతా ప్రశ్నలను వాయిదా వేయడమైంది.

(ఈ దశలో .. మంత్రిగారి సమాధానం సంతృప్తికరంగా లేదంటూ నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వాకౌట్ చేశారు)

## II. సభా కార్యక్రమం

### 1. వాయిదా ప్రతిపాదన

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ మరియు ఇతరులు – యస్సీలను ఎ,బి,సి,డి లుగా వర్గీకరించే నిమిత్తం కేంద్ర ప్రభుత్వానికి పంపిన శాసన సభ ఏకగ్రీవ తీర్మానంపై, మరియు ముఖ్యమంత్రిగారి హామీపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిపెట్టి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ, సభను వాయిదా వేసి వెంటనే చర్చించాలని ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైంది.

### 2. ప్రత్యేక ప్రస్తావనలు

(a) **శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, మన తెలంగాణ ప్రాంతంలో ఉండే దేవాలయాలను సందర్శించడానికి గత ప్రభుత్వ హయాములో సరైన రవాణా సదుపాయాలు లేకుండె. మన రాష్ట్రం ఏర్పడిన తర్వాత యాత్రికుల సౌకర్యార్థం మనం ఎన్నో చర్యలు

తీసుకుంటున్నాం. ఇప్పుడు నేను ప్రస్తావిస్తున్న అంశం ఏమంటే – తెలంగాణ రాష్ట్రంలో అనేకదేవాలయాలున్నాయి. ఆ దేవాలయాలకు యాత్రికులను/భక్తులను చేరవేయడానికి జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నాను.

**శ్రీ పట్నం మహేందర్ రెడ్డి:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు సుధాకర్ రెడ్డి గారు ప్రస్తావించిన అంశాన్ని నోట్ చేసుకున్నాం. ఆయా దేవస్థానాలకు భక్తులను/యాత్రికులను చేరవేయడానికి జిల్లా కేంద్రాల నుంచి బస్సు సౌకర్యం తప్పకుండా కల్పిస్తామని హామీ ఇస్తున్నాం.

(ప్రత్యేక ప్రస్తావనను అందజేయడం జరిగింది.)

(ఈదశలో గౌరవ ఎల్ఓపి శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ సభలోకి వచ్చి తమ స్థానంలో ఆశీనులయ్యారు)

(b) **శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:–** అధ్యక్షా, ఇది వ్యవసాయ శాఖామంత్రి గారికి సంబంధించిన అంశం. మంత్రిగారు కూడా సభలోనే ఉన్నారు కాబట్టి, కేవలం నోట్ చేసుకున్నామని చెప్పకుండా జవాబు చెబితే బాగుంటుందని మనవి చేస్తున్నాను. తెలంగాణాలో వర్షాలు బాగా పడ్డాయని రైతులందరూ ఒకవైపు సంతోషంగా ఉన్న సమయంలో, గత నాలుగైదు దినాల నుంచి వరి పంట కోస్తే, దోమకాటు వల్ల 50శాతం దిగుబడి కూడా రాలేదని రైతులు వాపోతున్నారు. నేను దోమకొండ, రామాయంపేటలో ఆగి రైతులతో మాట్లాడినపుడు, వాళ్లందరూ ఏమంటున్నారంటే – మాకు ఎకరాకు 25 నుంచి 30 బస్తాల వరకు దిగుబడి వస్తుందని ఆశిస్తే అందులో సగం కూడా రాలేదన్నారు. ఈ దోమకాటు వల్ల తెలంగాణ మొత్తం పెద్ద ఎత్తున రైతాంగం నష్టపోయింది. వరి పంటతోబాటు పది లక్షల ఎకరాలలో పత్తికి కూడా పురుగు సోకడంతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మంచి వర్షాలు పడ్డాయి, మంచి పంటలు వస్తాయని అనుకుంటున్న సమయంలో ఈ దోమకాటు రావడం, పురుగు సోకడం వల్ల రైతులు నష్టపోయారు. ఆవిధంగా పంటలు నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఈ హౌస్‌లో జరిగిన దాని మీద గౌరవ ముఖ్యమంత్రి గారితో చర్చించి, ఒకమంచి నిర్ణయం తీసుకొని పంట నష్టపోయిన రైతులందరినీ కాపాడాలని కోరుతున్నాను.

నాకు సంబంధించి ఒక ఉదాహరణ చెబుతాను. రామాయంపేట నుంచి తూఫాన్ వరకు చిట్టి బాసుమతి పండుతుంది. హర్యానా నుంచి సీడు తెప్పించి రామాయంపేట పొలాల్లో వేశాను. క్రాప్ బాగా వచ్చిందనుకొని నేను పోతే

آپ کو ایک کنٹل کو تیں کنٹل آنے کا ایک ایکر میں، پندرہ ہی آرہا---

రెండు ఎకరాలలో వేసిన బాసుమతికి కూడా దోమకాటు తెగులు వచ్చి దిగుబడి రాలేదు. రామాయంపేట నుంచి చేగుంట వరకు 30, 40 కిలోమీటర్లలో ఈ బాసుమతి పంట పండుతుంది. ఇది మంచి వాసన వస్తుంది. అది వేరే చోట వేస్తే ఈవిధంగా రాదు. అది గమనించి ఎవరైనా వేసుకునే వాళ్లుంటే అందరికి ఒక ఐదు కేజీలు ఉచితంగా సీడ్ ఇవ్వాలనే ఆలోచనతో హర్యాన నుంచి సీడును తెప్పించాను. కానీ మా దగ్గర పని చేసే వ్యక్తి ఏమన్నారంటే

شبیر صاحب اپنا بھی آدھا آرہا اور آدھا نہیں آرہا۔ ساٹھ کنٹل آنے کا تیں کنٹل بھی نہیں آرہا ہے۔ میں آپ سے گزارش کر رہا ہوں۔

చాలా సంతోషంగా ఉండేవాళ్లు రైతులు. వరి కోసిన తర్వాత చూస్తే 50శాతం దిగుబడే వచ్చింది. పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారు. నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి:–** అధ్యక్షా, యల్ఓపి గారు చెప్పిన అంశాన్ని నోట్‌చేసుకోవడం జరిగింది. సందర్భం కాబట్టి, వారు కూడా వ్యవసాయదారులు కాబట్టి చెబుతున్నాను. కామారెడ్డిలో, రామాయంపేటలో వారికి భూమి ఉంది. భూమికి ఎంత నత్రజని అవసరం ఉంటుందో అంతే తీసుకుంటుంది. ఎంత పొటాషియం అవసరం ఉందో అంతే పొటాషియం తీసుకుంటుంది. అలాగే ఎంత భాస్వరం అవసరముందో అంతే తీసుకుంటుంది. కానీ మనం తెలిసో తెలియకో ఎక్కువ డోసులు ఇస్తున్నాం. అవసరానికి మించిన నత్రజనిని వాడుతున్నాం. ఒక మనిషికి రోగం వచ్చినపుడు డాక్టర్ 2.5యంజి ట్యాబ్లెట్ రాస్తే, దానికి బదులు 10యంజి వేసుకుంటే సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. ఇది కూడా అదే పరిస్థితి. గతంలో భూసార పరీక్షలు జరిగేవి కావు. కానీ మన ప్రభుత్వం వచ్చిన తర్వాత, గౌరవ ముఖ్యమంత్రి గారు పర్టిక్యులర్‌గా మాకు ఇచ్చిన ఆదేశాలేమంటే – ప్రతి రైతు యొక్క భూమి నమూనాలు తీసి భూసార పరీక్షలు చేయించమన్నారు, ఆమేరకు మేము చర్యలు తీసుకున్నాం. నేను మొన్న కూడా చెప్పాను. అత్యంత ముఖ్యమైన విషయం ఇది. దాని విషయంలో రైతులందరూ సహకరించారు. ఎఇఓలను నియమించాం. మన రాష్ట్రంలో మాదిరిగా దేశంలో ఎక్కడా

ఇన్ని భూసార పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇంతకు ముందు మార్కెట్ కమిటీల ద్వారా గానీ, అగ్రికల్చర్ డిపార్టుమెంటు ద్వారా కానీ రాష్ట్రం మొత్తం మీద 48 ఉండేవి, కానీ ఇప్పుడు 2050 మినీ సాయిల్ టెస్టింగ్ ల్యాబులను ఏర్పాటు చేశాం. దీని కోసమే వాటిని ఏర్పాటు చేశాం. టెస్టింగ్ చేసి భవిష్యత్తులో రైతాంగానికి ఇటువంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

(ప్రత్యేక ప్రస్తావనను అందజేయడం జరిగింది.)

(c) **శ్రీ కర్నె ప్రభాకర్:–** అధ్యక్షా, రాష్ట్రంలో అన్ని శాఖలలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నారు. టూరిజం శాఖలో కూడా దాదాపుగా 18 సంవత్సరాల నుంచీ కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారు. వాళ్లను కూడా రెగ్యులరైజ్ చేయవలసిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. సంబంధిత మంత్రిగారి దృష్టికి తీసుకెళతాం.

(ప్రత్యేక ప్రస్తావనను అందజేయడం జరిగింది.)

(d) **శ్రీ పూల రవీందర్:–** అధ్యక్షా, విద్యాశాఖలో ప్రభుత్వ పాఠశాలలున్నాయి, ఎయిడెడ్ పాఠశాలలు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. ఎయిడెడ్ పాఠశాలల్లో చాలా వరకు విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి వైండప్ అయిన స్కూల్స్ ప్రతి జిల్లాలో కనిపిస్తున్నాయి. వరంగల్ జిల్లా, నల్గొండ జిల్లాలలో కూడా ఈ విధంగా వైండప్ అయిన స్కూల్స్ ఎక్కువగా ఉన్నాయి. టీచర్స్‌ను టెంపరరీగా డెప్యుటేషన్ మీద తీసుకొస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 3700 మంది ఎయిడెడ్ టీచర్స్ ఉంటారు. మంత్రిగారికి విజ్ఞప్తి చేసేదేమంటే – వాళ్లను ప్రభుత్వరంగంలో విలీనం చేసినట్లయితే అవసరం ఉన్న చోట వారి సేవలను ఉపయోగించుకోవచ్చు. ఎక్కడైతే స్ట్రెంగ్త్ ఉంటుందో అక్కడికి తీసుకుపోయే ఏర్పాటు గతంలో చేశారు, ఆవిధంగా చేయాలని కోరుతున్నాను.

ఎయిడెడ్ కళాశాలల్లో పరిమిత సంఖ్యలో కొంత మంది కాంట్రాక్టు లెక్చరర్స్ పని చేస్తున్నారు. గౌరవ ముఖ్యమంత్రిగారు, గౌరవ మంత్రిగారు ఒక నిర్ణయం తీసుకొని కాంట్రాక్టు లెక్చరర్స్‌ని రెగ్యులరైజ్ చేయడానికి ప్రయత్నం చేసినప్పటికీ, కోర్టు అడ్డంకులు ఉన్నప్పటికీ వాళ్లకి మినిమమ్ పే రూ.37100 ఇచ్చి వాళ్లను ఆదుకొన్నారు. ఈ ఎయిడెడ్ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్ రాష్ట్ర వ్యాప్తంగా మూడు వందల మందికి మించి ఉండరు. వీళ్లకు కూడా కాంట్రాక్ట్ లెక్చరర్స్‌కి ఇచ్చినట్లుగా మినిమమ్ పే ఇచ్చినట్లయితే, ఆ కుటుంబాలను ఆదుకున్న వాళ్లం అవుతాం. దయచేసి ఆ దిశలో చర్యలు తీసుకోవాలని మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు లేవనెత్తిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది.

(ప్రత్యేక ప్రస్తావనను అందజేయడం జరిగింది.)

**మిస్టర్ ఛైర్మన్:–** ఇప్పుడు పిటిషన్స్. పాతూరి సుధాకర్ రెడ్డిగారు పిటిషన్ సమర్పించవలసిందిగా కోరుతున్నాను.

## 3. పిటిషన్

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:–** అధ్యక్షా, డ్రాపవుట్స్‌కి విద్యను గరపడానికి, అదే విధంగా వయోజనులైన వారికి అక్షరాస్యత కల్పించడానికి విద్యాశాఖలో రెండు విభాగాలు పని చేస్తాయి. అవి ఒకటి – వయోజన విద్య, రెండు – ఓపెన్ స్కూల్ సొసైటీ. మేము గతంలో ఈ విషయాన్ని ప్రస్తావించినపుడు, ఈ రెండింటినీ మెర్జ్ చేసి ఒక శాఖగా మారుస్తామనే మాట చెప్పారు. కాబట్టి సంబంధిత వయోజన విద్యావిభాగం ఉద్యోగుల సంఘం వాళ్లు ఒక పిటిషన్ ఇచ్చారు. దానిని పరిశీలించాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

(పిటిషన్‌ను గౌరవ ఛైర్మన్‌కి సమర్పించారు.)

**మిస్టర్ ఛైర్మన్:–** "టీ" విరామం కొరకు సభను పదిహేను నిమిషాల పాటు వాయిదా వేయడమైంది.

(పదిహేను నిమిషాల "టీ" విరామం కొరకు సభ ఉదయం 11.40 గంటలకు వాయిదా పడింది.)

12.00 మ. (తేనీటి విరామానంతరం సభ తిరిగి మధ్యాహ్నం గం.12.04ని.లకు సమావేశమైనది.)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్షస్థానంలో ఉన్నారు.)

**మిస్టర్ ఛైర్మన్:–** రాష్ట్రంలోని విద్యుత్ పరిస్థితిపై లఘు చర్చ.

## III. లఘు చర్చ

## "రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి" గురించి

**శ్రీ జి. జగదీష్ రెడ్డి :–** అధ్యక్షా, రాష్ట్రంలో విద్యుత్తు పరిస్థితిపై స్వల్ప వ్యవధి చర్చ గురించిన ప్రకటనకు అనుమతినిచ్చినందుకు తమకు, సభకు ధన్యవాదాలు.

అధ్యక్షా, నిరంతర విద్యుత్తు సరఫరా అందించి రాష్ట్రంలో అంధకారాన్ని తొలగించడంలో ప్రభుత్వం విజయం సాధించిందని సభకు తెలియజేసేందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను. ఇది సాకారం కావడానికి కృషిచేసిన విద్యుత్తు రంగ సంస్థల ఉద్యోగులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రత్యేకించి ఇంత పెద్ద విజయాన్ని కేవలం మూడు సంవత్సరాల కాలంలోనే సాధించడానికి మూలకారణం గౌరవ ముఖ్యమంత్రిగారి దార్శనికత, నిరంతర పర్యవేక్షణే పనిచేశాయని తెలియజేస్తున్నాను.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన రోజున 2,700 మెగావాట్ల విద్యుత్తు కొరత ఉండేది. ప్రతిరోజూ కూడా 4 గంటల నుండి 8 గంటల వరకు విద్యుత్తు కోత విధించిన విషయం మనకు తెలుసు. పరిశ్రమలకు వారానికి రెండు రోజులు అధికారికంగానే పవర్ హాలిడే ప్రకటించిన విషయం కూడా మనకు తెలుసు. ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణాను నిర్లక్ష్యం చేసి, డిమాండుని సరిగ్గా అంచనా వేయడంలో సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల, దాదాపు 1,559 మెగా వాట్ల విద్యుత్తును షెడ్యూలు చేయకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రం భారీ విద్యుత్తు లోటును వారసత్వంగా పొందింది. దాని వల్లనే రాష్ట్రం ఆనాడు తీవ్రమైన విద్యుత్తు కొరతను ఎదుర్కొంది.

రాష్ట్ర విభజన తరువాత మొదటి 6 నెలల కాలంలో విద్యుత్తు సంస్థలు సరఫరాను మెరుగుపరిచేందుకు, లోటును అధిగమించేందుకు కొన్ని చర్యలు తీసుకున్నాయి. దీనిలో ప్రధానంగా విద్యుత్తు పంపిణీ సరఫరా నష్టాలను 16.8 శాతం నుండి 15.89 శాతానికి తగ్గించడం జరిగింది. అలాగే, టి.ఎస్.జెన్‌కో ప్లాంటు ద్వారా విద్యుత్తు ఉత్పత్తిని పెంచడం జరిగింది. స్వల్పకాలిక విద్యుత్తు ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఎక్స్ఛేంజ్ నుండి కొనుగోలు చేయడం వంటి చర్యల ద్వారా విద్యుత్తు కొరతను అధిగమించే అవకాశాన్ని తీసుకోవడం జరిగింది. అదేవిధంగా, నవంబరు 20, 2014 నుండి రాష్ట్రంలోని గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులందరికీ కూడా ఎటువంటి కోతలు లేకుండా నిరంతర విద్యుత్తుని అందించగలుగుతున్నాం.

తెలంగాణ ఏర్పడిన రోజున, అంటే 02.06.2014 నాటికి తెలంగాణలో స్థాపిత విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం అన్నీ కలుపుకొని 6,574 మెగావాట్లు. గడిచిన మూడున్నర సంవత్సరాల కాలంలో సింగరేణి నుండి 1,200 మెగావాట్లు, కె.టి.పి.పి. నుండి 600 మెగావాట్లు, జూరాల నుండి 240 మెగావాట్లు, పులిచింతల నుండి 60 మెగావాట్లు, ఛత్తీస్‌ఘడ్ నుండి 1,000 మెగావాట్లు, సౌరవిద్యుత్ ద్వారా 2,570 మెగావాట్లు, పవన విద్యుత్తు ద్వారా 100 మెగావాట్లు, మొత్తంగా 7,759 మెగావాట్లను అప్పటికే ఉన్న స్థాపిత విద్యుత్తు ఉత్పత్తికి అదనంగా జతచేయడం జరిగింది. ఈ మూడు, నాలుగు రోజుల్లో మరో 200 మెగావాట్లు సౌర విద్యుత్తు ద్వారా జతకలిసింది. మొత్తం దాదాపుగా 14,500 మెగావాట్లకు చేరుకున్నాం.

తెలంగాణలో నెలకొల్పే కొత్త పరిశ్రమలు, నిర్మిస్తున్న భారీ ఎత్తిపోతల పథకాలకు దాదాపుగా 8,500 మెగావాట్లు అవసరమవుతుందని, దానికి సంబంధించిన ఇతర అంశాలు కూడా దృష్టిలో పెట్టుకొని, ఇంకొక 13,752 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కోసం కూడా క్రొత్త ప్లాంట్ల నిర్మాణం చేస్తామని తెలియజేస్తున్నాను.

వ్యవసాయ రంగాన్ని మినహాయిస్తే, అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్తుని ఈరోజు వరకు ఇస్తున్నాం. ఈరోజు రాత్రి నుండి గౌరవ ముఖ్యమంత్రిగారి సూచనల మేరకు విద్యుత్తు సంస్థలు, డిస్ట్రిబ్యూషన్ సంస్థలు 24 గంటల విద్యుత్తుని రైతులకు కూడా అందించాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా అన్ని చర్యలూ పూర్తి చేశారు. ప్రయోగాత్మకంగా, పైలట్ ప్రాజెక్టు క్రింద మూడు జిల్లాల్లో గత రెండు, మూడు నెలలుగా అమలు చేశాం.

ఈరోజు రాత్రి నుండి మొత్తం తెలంగాణ రాష్ట్రంలో రైతాంగానికి కూడా 24 గంటల విద్యుత్తుని అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం. ఈరోజు రాత్రి నుండి ఆ కార్యక్రమం కూడా ప్రారంభమవుతుంది. ఒక 5 రోజులపాటు రాష్ట్రంలో మొత్తం 24 లక్షలకు పైగా ఉన్న రైతుల కనెక్షన్లకు విద్యుత్తును 24 గంటలూ అందుబాటులో ఉంచే కార్యక్రమాన్ని తీసుకున్నామని తమరిద్వారా సభకు తెలియజేస్తున్నాను. ఈరోజు వరకు రైతులకు 9 గంటల పాటు 3 ఫేజ్ కరెంటును సరఫరా చేశామనే విషయాన్ని కూడా తమరి ద్వారా గౌరవ సభకు తెలియజేస్తున్నాను.

ఈ రైతులకు 24 గంటలపాటు నిరంతర విద్యుత్తు సరఫరా చేయడానికి ఎస్.పి.డి.సి.ఎల్. పరిధిలోని మెదక్ జిల్లాలో 16.07.2017 నుండి, పాత నల్గొండ జిల్లాలో 18.07.2017 నుండి, ఎన్.పి.డి.సి.ఎల్. పరిధిలోని కరీంనగర్ జిల్లాలో 18.07.2017 నుండి 24 గంటలపాటు రైతులకు నిరంతర విద్యుత్తును ప్రయోగాత్మకంగా అందించడం జరుగుతోంది. రాష్ట్రం మొత్తం మీద ప్రస్తుతం 22.60 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉంటే, పైన పేర్కొన మూడు జిల్లాల

పరిధిలో ఉన్న 9.70 లక్షల రైతులకు 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్తుని అందించడం జరుగుతోందని తెలియజేస్తున్నాను. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో వచ్చే రబీ సీజన్‌నుండి 24 గంటలపాటు ఉచిత విద్యుత్తును అందజేద్దామనుకున్నప్పటికీ, ఆ ప్రయత్నం చేసి, పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు ఈరోజు రాత్రి నుండే ప్రారంభించి 5 రోజుల పాటు విద్యుత్తు సరఫరాను నిరంతరాయంగా ఉంచడం జరుగుతుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

దీనికోసం, ట్రాన్స్‌కో ద్వారా రూ.124.66 కోట్ల వ్యయంతో 41 ఇ.హెచ్.టి. సబ్‌స్టేషన్లలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను అభివృద్ధి చేసి పనులు చేపట్టడం జరిగింది. 1018 ఎం.వి.ఎ.తో అదనంగా 301 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 747 సి.కె.ఎం.పొడవుతో 515 విద్యుత్తు లైన్లను రూ.362.64 కోట్ల వ్యయంతో డిస్కమ్‌ల నెట్‌వర్కును పటిష్టపరిచే పనులు చేపట్టడం జరిగింది.

సరఫరా, పంపిణీ విధానంలో 15 వేల మెగావాట్ల గరిష్ట డిమాండ్ మేరకు విద్యుత్తు అందించడానికి రూ.12,136 కోట్ల వ్యయంతో సరఫరా, పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయడం జరిగింది. అదేవిధంగా, ఉత్పత్తి, సరఫరా, పంపిణీ రంగాల్లో మొత్తం దాదాపుగా రూ.94,000/–కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో విద్యుత్తు వ్యవస్థను భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో 292 ఇ.హెచ్.టి. సబ్ స్టేషన్లు, 2,687 – 33/11 కె.వి. సబ్‌స్టేషన్లు, మొత్తం 6,25,612 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రస్తుతం ఉన్నాయి. షెడ్యూలు ప్రకారం అన్ని సబ్ స్టేషన్లు, లైన్లు, ట్రాన్స్ ఫార్మర్ల నిర్వహణ కొరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుగుతూ ఉంది. 188 ఎస్.పి.ఎం. షెడ్లలో 4 శాతం డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల రోలింగ్ స్టాక్ ఎప్పుడూ సిద్ధంగా ఉంచుతున్నాము.

గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు పాడైతే మరమ్మత్తులు చేయడానికి చాలా సమయం పట్టేది. రైతులు ఆందోళనకు దిగవలసిన పరిస్థితి వచ్చేది. పంట నష్టం కూడా జరిగేది. తెలంగాణ ఏర్పడిన తరువాత ట్రాన్స్‌ఫార్మర్లు పాడైతే పట్టణ ప్రాంతాల్లో 6 గంటలలోపు, గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటలలోపు మార్చడానికి అన్ని చర్యలూ తీసుకున్నాం. సరైన నిర్వహణ ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు కూడా 30 శాతం నుండి 10 శాతానికి తగ్గాయి.

రాష్ట్రంలోని రెండు డిస్కమ్‌లలో ప్రస్తుతం 1,36,15,731 మంది వినియోగదారులున్నారు. దీనిలో 22.60 లక్షల మంది రైతులు దాదాపు 25 శాతం విద్యుత్తుని వినియోగిస్తున్నారు. విద్యుత్ సరఫరా గణనీయంగా మెరుగుపడడం వల్ల రైతులతో పాటు ఇతర వినియోగదారులందరూ కూడా సంతోషంగా ఉన్నారు. గతంలోలాగా ఎటువంటి ఆందోళనలు లేవని కూడా తమరి ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

గౌరవ ముఖ్యమంత్రిగారు ఆదేశించిన ప్రకారం వీలైనంత తొందరగా విద్యుత్తు కనెక్షన్లను రైతులకు అప్లికేషన్లు పెట్టుకున్న వెంటనే ఇవ్వాలనే ఉద్దేశంతో వేగవంతంగా చేయడం వల్ల 2016–17 సంవత్సరంలో 1,17,277 వ్యవసాయ కనెక్షన్లు, 2017–18 వ సంవత్సరంలో 1,22,809 వ్యవసాయ కనెక్షన్లను ఇప్పటికే మంజూరు చేశామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేయడం జరుగుతోంది.

రాష్ట్రంలో పెరుగుతున్న డిమాండుని తీర్చడానికి ట్రాన్స్‌మిషన్ సామర్థ్యాన్ని 8,896.5 ఎం.వి.ఎ.ల మేర పెంచాము. 14,059 ఎం.వి.ఎ.ల సామర్థ్యం, అంటే, 12,653 మెగావాట్ల సామర్థ్యాన్ని, 22,955.5 ఎం.వి.ఎ.ల సామర్థ్యానికి, అంటే, 20,659.95 మెగావాట్లకు పెంచడం జరిగింది. రాష్ట్రం ఏర్పడిన తరువాత 59 ఇ.హెచ్.టి. సబ్ స్టేషన్లను, 515 –33/11 కె.వి. సబ్‌స్టేషన్లను, 1,63,864 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగింది. కొత్తగా 3,538 సర్క్యూట్ కిలోమీటర్ల ఇ.హెచ్.టి. లైన్లు, 51,031 సి.కె.ఎమ్.ల పంపిణీ లైన్లను వేశాము. ఈ చర్యల వల్ల నాణ్యమైన విద్యుత్తును ప్రజలకు అందించగలుగుతున్నాము.

రూ.37,600 కోట్ల పెట్టుబడితో మణుగూరు, కొత్తగూడెం, దామరచర్ల ప్రాంతాల్లో 5,880 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కోసం ప్లాంట్ల నిర్మాణం జరుగుతున్నది. వీటికోసం అవసరమైన ఆర్థిక వనరులను ఇప్పటికే సమీకరించుకోవడం జరిగింది. జాప్యాన్ని నివారించడానికి విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం కోసం ప్రభుత్వ రంగసంస్థ అయిన బి.హెచ్.ఇ.ఎల్.తో ఎం.ఓ.యు. చేసుకుని, పనులను వారికి అప్పగించడం జరిగింది.

ఎన్.టి.పి.సి. ఆధ్వర్యంలో 2X800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు పని ఇప్పటికే ప్రారంభమయింది. 2017 అక్టోబరు 31 నాటికి 2,570 మెగావాట్ల స్థాపిత సౌర విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో

ఉంది. 2017-18 నాటికి 3,570 మెగావాట్ల సౌర విద్యుత్తు అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నాం.

ప్రభుత్వం చేపడుతున్న ఎత్తిపోతల పథకాలకు విద్యుత్తు అందించడానికి 8,500 మెగావాట్ల అదనపు విద్యుత్తు సరఫరా చేయాల్సి ఉంది. ఇందుకోసం సరఫరా మరియు పంపిణీ వ్యవస్థలను మెరుగు పరుస్తున్నాము.

రాబోయే మూడు, నాలుగు సంవత్సరాలలో అదనపు భారాన్ని తీర్చడానికి రూ.42,000 కోట్ల పెట్టుబడితో 400 కె.వి. సబ్ స్టేషన్లు పద్దెనిమిది, 220 కె.వి. సబ్‌స్టేషన్లు ముప్పై నాలుగు, 132 కె.వి. సబ్‌స్టేషన్లు తొంభై, 33/11 కె.వి. సబ్‌స్టేషన్లు 937తో అవసరమైన సరఫరా, పంపిణీ వ్యవస్థను పటిష్టపరుస్తున్నాం.

ట్రాన్స్‌మిషన్, పంపిణీని పటిష్టపరచడం మరియు సానుకూల పారిశ్రామిక ప్రభుత్వ విధానాలతో గరిష్ట డిమాండ్‌లో భారీ పెరుగుదల నమోదైంది. 13.09.2017న 9,500 మెగావాట్ల గరిష్టడిమాండుకు, 197.94 మిలియన్ యూనిట్ల వినియోగానికి రాష్ట్ర గ్రిడ్ చేరుకుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. 15,000 మెగావాట్ల లోడ్‌ను తీర్చడానికి సంస్థలు సిద్ధంగా ఉన్నాయని గౌరవ సభకు తెలియజేస్తున్నాను.

ఆర్ఇసి, పిఎఫ్‌సి సంస్థలు మన యొక్క సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యుత్తు సంస్థలకు ఇచ్చే రుణాలపై వడ్డీ రేట్లను 12 శాతం నుండి 9.95 శాతానికి తగ్గించాయి. మన సంస్థల నిర్వహణను ప్రశంసిస్తూ వారు ఈ నిర్ణయం తీసుకోవడంవల్ల ఒక్కో ఏడాదికి రూ.200 కోట్ల లబ్ధి కలుగుతుందని తెలియజేస్తున్నాను.

వ్యవసాయం, ఇతర సబ్సిడీల కోసం ప్రభుత్వం రూ.4,777/- కోట్లను అందిస్తోంది. తెలంగాణ రాష్ట్రం "ఉదయ్" పథకాన్ని అమలు చేసి, రాష్ట్ర డిస్కమ్‌లకు చెందిన రూ.8,923 కోట్ల భారాన్ని ప్రభుత్వం స్వీకరించింది. విద్యుత్తు సంస్థలు కొత్తగా 987 మంది అసిస్టెంట్ ఇంజనీర్లను అత్యంత పారదర్శక విధానం ద్వారా నియమించిందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. 22,550 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు విద్యుత్తు సంస్థలే నేరుగా జీతాలు చెల్లిస్తున్నాయి. 13,357 కొత్త పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది.

గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం, జంట నగరాల్లో నిరంతర విద్యుత్తు సరఫరా అందించడానికి, సబ్‌స్టేషన్లను అంతర్గతంగా అనుసంధానం చేయడానికి 142 సి.కె.ఎం.ల 400 కె.వి. లైన్ల ఏర్పాటు జరిగింది. నగరం చుట్టూ 220 కె.వి. 6 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసింది. జిహెచ్ఎంసి ప్రాంతం చుట్టూ 400 కె.వి. రింగు వ్యవస్థను ఏర్పాటు చేయడమైంది. ఎప్పటికప్పుడు ఎదురయ్యే అవాంతరాలు పర్యవేక్షించడానికి పర్యవేక్షణ సమాచారకేంద్రాన్ని (ఎస్.సి.ఏ.డి.ఏ.) ప్రారంభించి, 121 సబ్‌స్టేషన్లను అనుసంధానం చేయడం జరిగింది.

మెరుగైన వినియోగ సేవల కోసం డిస్కమ్‌లు వివిధ సౌకర్యాలతో కూడిన మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేయడం జరిగింది. దీని ద్వారా వినియోగదారులు నేరుగా బిల్లు మొత్తాన్ని తెలుసుకోవడం, బిల్లింగు చరిత్రను తెలుసుకోవడం, బిల్లు చెల్లింపులు దాని ద్వారా చేసుకోవడం, ఏవైనా అంతరాయాలుంటే ఫిర్యాదులు చేయడం, ఔటేజ్‌లు, ఫిర్యాదులపై సమాచారం తెలుసుకోవడంతోపాటు, నూతన సేవల పరిస్థితి గురించి, ఇంధన పొదుపు గురించి కూడా దీనిద్వారా తెలుసుకునే అవకాశముంది.

ఈ రకంగా, ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వంటి అన్ని వ్యవస్థలను కూడా సరిచేసుకొని మొత్తం వినియోగదారులకందరికీ నాణ్యమైన అవసరమైనంత నమ్మదగిన విద్యుత్తును సమకూర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తమరి ద్వారా గౌరవ సభకు తెలియజేస్తున్నాను.

12.20 మ. **మిస్టర్ ఛైర్మన్:-** విద్యుత్‌పై చర్చను ప్రారంభించ వలసిందిగా, శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారిని కోరుతున్నాను.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:-** అధ్యక్షా, రాష్ట్ర విద్యుత్ పరిస్థితిపై మాట్లాడేందుకు అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు. అధ్యక్షా, ఇప్పుడే విద్యుత్ మంత్రివర్యులు స్టేట్‌మెంట్‌ని ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలోని 24లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు 24గంటలు ట్రయల్ బేసిస్‌లో విద్యుత్‌ను అందిస్తామని ప్రభుత్వం తెలియజేస్తున్నట్లుగా ఈరోజు అన్ని వార్తా పత్రికల్లో వచ్చింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి మా పార్టీ తరఫున ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. ఇది మంచి నిర్ణయం.

ఎందుకంటే, గతం, గతం అని చెబుతుంటారు. అందుకనే 2004 కంటే ముందు ఉన్నటువంటి పరిస్థితిని కొద్దిగా చెప్పాలని అనుకుంటున్నాను. 2004 కంటే ముందు గిట్టుబాటు ధర రాకపోవడంతో చాలా పెద్ద ఎత్తున రైతులు ఆత్మహత్యలు చేసుకునే వారు. 2004వ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే మొట్టమొదటగా రైతులకు

7గంటలు ఉచిత విద్యుత్‌ను అందిస్తామనే ఫైలు మీద ఆనాటి గౌరవ ముఖ్యమంత్రి గారు సంతకం చేయడం జరిగింది. ఇప్పటివరకు కూడా ఆ పథకం కంటిన్యూ అవుతుంది. ఆ నిర్ణయాన్ని తీసుకున్న, అప్పుడు ఉన్నటువంటి శ్రీ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారిని మరియు కాంగ్రెస్ పార్టీని అభినందిస్తున్నాను. దాని తరువాత రూ.1200కోట్లు బకాయిలు ఉంటే, బకాయిలు పడ్డటువంటి రైతులను అంతకుముందున్న ప్రభుత్వాలు జైళ్లకు పంపిస్తే, ఆ బకాయిలుగా ఉన్నటువంటి రూ.1200కోట్లు మాఫీ చేస్తున్నట్లుగా రెండవ సంతకం కూడా చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కింది.

7 గంటల ఉచిత విద్యుత్‌ను కంటిన్యూ చేస్తూ ఈరోజు 24గంటలు విద్యుత్‌ను అందించేందుకు ఇప్పుడున్న ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. చాలా మంచి నిర్ణయమే. కానీ, నాకు కొన్ని అనుమానాలున్నాయి. ఎందుకంటే, మాకున్న అనుభవాలను మీతో పంచుకుంటే వాటిని ప్రభుత్వం పరిశీలించి ఇంకా మెరుగుపరుస్తుందని ఆశిస్తూ, నేను ఇచ్చే ఈ సూచనలను పాజిటివ్‌గా తీసుకోవాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఈరోజు విద్యుత్‌పై చర్చ ఉందని అర్జంట్‌గా ఐదు రోజులు ట్రయల్ రన్ మీద 24గంటలు ఉచిత విద్యుత్ అందిస్తామని చెబుతున్నారు. ఇవ్వండి మంచిదే. ట్రయల్ రన్‌లో భాగంగా సాంకేతికంగా ఏమేమి ఇబ్బందులు ఉంటాయో చూద్దామని అధికారులు ప్రభుత్వానికి చెప్పి ఉండవచ్చు. నేను మంత్రిగా పని చేసినప్పుడు కూడా శ్రీ డి. ప్రభాకర్ రావు లాంటి సమర్థులైన అధికారులు ఉండేవారు. ఇప్పుడు కూడా వారే ఉన్నారు. గతంలో కూడా నేను వారిని ఇదే సభనుండి అభినందించడం జరిగింది. అలాగే ఇప్పుడు కూడా ఆయనను మరియు వారి క్రిందపని చేస్తున్న సిబ్బందిని కూడా మరొక్కసారి అభినందిస్తున్నాను.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో మనకు 1,559మెగావాట్ల విద్యుత్ కొరత ఉండింది. అంటే జూన్ 2, 2014 వరకు దాదాపు 1600మెగావాట్ల విద్యుత్ కొరత ఉండింది. నేను విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు భూపాల్‌పల్లిలో 2005లో 600మెగావాట్ల విద్యుత్‌కి పునాది వేయడం జరిగింది. తరువాత కొత్తగూడెంలో 500మెగావాట్ల విద్యుత్ కొరకు 2008లో థర్మల్ పవర్ స్టేషన్‌కి పునాది వేయడం జరిగింది, అది 2015లో అందుబాటులోకి వచ్చింది.

అలాగే 2010లో అప్పుడున్నటువంటి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.రోశయ్య గారు 600x2 =1200MW కొరకు మంచిర్యాల దగ్గరలోని జైపూర్ వద్ద జెన్‌కో ద్వారా కాకుండా సింగరేణి ద్వారా పునాది వేయడం జరిగింది. అది కూడా 2016-17లో 1200మెగావాట్లు అందుబాటులోకి రావడం జరిగింది. ఆనాడు మేము వేసిన పునాదికి దాదాపు 90 నుండి 95శాతం పనులు పూర్తయినాయి. ఇది మీగొప్ప, మాగొప్ప అని కాదు. మొత్తంగా చూసుకుంటే 600మెగావాట్లు భూపాలపల్లిలో, 1200మెగావాట్లు మంచిర్యాల దగ్గరలోని జైపూర్‌లో, అలాగే కొత్తగూడెంలో 500మెగావాట్లు అందుబాటులోకి రావడం జరిగింది. కొత్తగూడెంలో 500మెగావాట్ల కొరకు పునాది వేసినప్పుడు జెన్‌కో అధికారులు మాకు కోల్ లింకేజీ లేదు, ఇది మాకు సాధ్యం కాదని అన్నారు. మళ్లీ ఆ విషయంలో గౌరవ సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, శ్రీమతి రేణుకా చౌదరి అలాగే అధికారులు శ్రీ డి. ప్రభాకర్ రావు వీరందరితో న్యూఢిల్లీలో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఆ సమావేశం అనంతరం కొత్తగూడెంలో 500మెగావాట్ల విద్యుత్ కొరకు పునాది వేయడానికి అధికారులు ఒప్పుకోవడం జరిగింది. అలాగే జూరాల నుండి 200మెగావాట్లు రావడం జరిగింది.

అంటే మొత్తంగా భూపాలపల్లిలోని 500+600= 1100MW, మంచిర్యాల దగ్గర జైపూర్‌లోని 1200MW, కొత్తగూడెంలోని 500MW మరియు జూరాల నుండి 200MW అన్నీ కలిపి చూసుకుంటే 1100+1200+500+200=3000MW. అంటే మొత్తంగా దాదాపు 3000మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొరకు ప్రణాళికలు రచించగా, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 1800MW+200MW=2,000MW విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే సమయానికి 1600మెగావాట్లు కొరత ఉండేది. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే గౌరవ ముఖ్యమంత్రి గారు ధైర్యం చేసి రైతులను, పరిశ్రమలను కాపాడుకునేందుకు విద్యుత్‌కి ఎంత ఖర్చయినా ఫరవాలేదని విద్యుత్‌ని కొనుగోలు చేసి రైతులను, పరిశ్రమలను కాపాడుకోవడం జరిగింది.

అధ్యక్షా, మా ప్రభుత్వంలో 2006-07లో విద్యుత్‌ను కొనుగోలు చేయాలనుకున్నా మాకు అప్పుడు విద్యుత్ ఎక్కడా దొరకలేదు. అప్పుడు ఒక్కో యూనిట్‌కి రూ.14/- పెట్టి కొందామని అనుకున్నా విద్యుత్ అందుబాటులో లేదు,

అప్పుడు దేశ వ్యాప్తంగా విద్యుత్ కొరత ఉన్నది. అప్పుడు మన రాష్ట్రానికి 600, 700 మెగావాట్ల అవసరం ఉండేది. కానీ, పక్క రాష్ట్రాల్లో ఒకటైన మహారాష్ట్రలో 4000 మెగావాట్ల కొరత ఉండేది. అప్పుడు కేంద్రంలో ఉన్న యుపిఏ-1 మరియు ప్లానింగ్ కమీషన్ వారు కూర్చొని దేశ వ్యాప్తంగా ఈ విద్యుత్ కొరత ఉండకుండా ఒక హైపవర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఆ కమిటీలో నేను కూడా ఒక సభ్యుడిగా ఉండే వాడిని. అందులో దేశ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ కొరత గురించి చర్చించి 1,55,000 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ని గానీ, హైడ్రో విద్యుత్‌ని గానీ ఉత్పత్తి చేసి, దేశంలో నాలుగు దిక్కుల, నాలుగు గ్రిడ్స్ ఏర్పాటు చేసి ఆ నాలుగు గ్రిడ్‌లకి ఆ విద్యుత్‌ని అనుసంధానం చేయాలని ఒక గొప్ప నిర్ణయం తీసుకోవడం జరిగింది.

దానివల్ల యుపిఏ-1 అండ్ యుపిఏ-2 వరకు 1,10,000మెగావాట్ల విద్యుత్ వచ్చింది. కానీ, పెరుగుతుందనుకున్న వ్యవసాయ మరియు పరిశ్రమల విద్యుత్ డిమాండ్ కాస్త తగ్గిపోయింది. దానివలన ఇప్పుడు దాదాపు 40,000మెగావాట్ల విద్యుత్ జనరేషన్‌ని షట్‌డౌన్ చేసుకున్నారు. విద్యుత్ జనరేట్ చేసే చోట్లలో రెండు యూనిట్లు ఉంటే, ఒకటి బంద్ చేసుకున్నారు. ఒకటి నడిపించుకుంటున్నారు. దాంతో గౌరవ ముఖ్యమంత్రి గారు ధైర్యం చేసి కొనుగోలు చేద్దామని అనుకున్న సమయానికి మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో ఉంది. ఇప్పుడు విద్యుత్ రేట్లు షేర్ మార్కెట్ల లాగా గంటకు ఒకరేటు వస్తుంది. ప్రొద్దున ఒక రేటు, సాయంత్రానికి ఒక రేటు, రాత్రికి ఒక రేటు వస్తుంది. ఒక్కొక్కప్పుడు ఒక్కో యూనిట్ రెండు రూపాయలకు కూడా అందుబాటులో ఉంది. ఈ విధంగా భారతదేశం మొత్తంలో విద్యుత్‌పై ఈ పరిస్థితి ఉంది.

అలాగే ఛత్తీస్‌ఘడ్ నుండి కొనుగోలు చేసే విద్యుత్ విషయంలో ఎంఓయు ప్రకారం ఛత్తీస్‌ఘడ్ వారు మనకు విద్యుత్‌ని సరఫరా చేయడం లేదని అనుమానం ఉంది. మామూలుగా మనం ఏ రాష్ట్రం నుండైనా విద్యుత్ కొనుగోలు చేసినప్పుడు ఆ రాష్ట్రం వారు వారి రాష్ట్ర బార్డర్ వరకు మనకు విద్యుత్‌ను సరఫరా చేయాలి. మన రాష్ట్ర బార్డర్ నుండి మన గ్రిడ్‌కు వచ్చేవరకు ఆ ఖర్చు మనం చెల్లించుకోవాలి. కానీ, ఇక్కడ జరుగుతుంది ఏమంటే, వాళ్ల పవర్ జనరేషన్ స్టేషన్ ఎక్కడుందో అక్కడినుండి మన గ్రిడ్‌వరకు వైర్ లైన్స్‌కి అయ్యే ఖర్చు పూర్తిగా మనమే భరిస్తున్నట్లుగా నాకున్న సమాచారం. అది ఎంతవరకు నిజమనే విషయం తెలియజేయాలని మీద్వారా గౌరవ మంత్రి వర్యులను కోరుతున్నాను. వారి ప్రాంతంలో ఏదైనా ఖర్చు అయితే కేంద్ర ప్రభుత్వమైనా భరించాలి లేదంటే గ్రిడ్‌వారైనా భరించాలి. కానీ, మన రాష్ట్ర ప్రభుత్వంపై ఆ భారం పడకూడదు. మన రాష్ట్ర బార్డర్ నుండి మన గ్రిడ్ వరకు మన రాష్ట్రమే భరించాలి. అది ఏ రాష్ట్రమైనా భరించాల్సిందే. కానీ, వాళ్ల రాష్ట్రంలోని పవర్ ప్లాంట్ నుండి మన రాష్ట్రానికి తీసుకురావడం మంచి పద్ధతి కాదు.

ఉదాహరణకు మనం 2000మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ఒకసారి ఒప్పందం చేసుకున్న తరువాత మన రాష్ట్రంలోని పవర్ స్టేషన్లు మనకు అందుబాటులోకి వచ్చి, మన దగ్గర విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం అయి, వారి విద్యుత్‌ని కొనుగోలు చేయకున్ననూ మనం వారితో ఎన్ని సంవత్సరాలకి ఒప్పందం చేసుకున్నామో అన్ని సంవత్సరాలకి వారితో ఒప్పందం చేసుకున్న ప్రకారం అంత అమౌంట్ మనం వారికి చెల్లించాల్సిందే. ఎపిఈఆర్‌సి నియమాల ప్రకారంగా గానీ, 2003 కొత్త ఎలక్ట్రిసిటీ చట్టం ప్రకారంగా గానీ మన రాష్ట్రం వారికి డబ్బులు చెల్లించాల్సిందే. ఆ నియమాలు భారతదేశం మొత్తంగా వర్తిస్తాయి. మనం చెల్లించాల్సిందే, తప్పదు. మనం 2000మెగావాట్లకి ఒప్పందం చేసుకొని 200మెగావాట్లు తీసుకున్నప్పటికీ, మనమీద 200 మరియు మిగతా 1800 కలిపి మొత్తంగా 2000మెగావాట్లకి బిల్లు వేస్తారు. అందుగురించి ఛత్తీస్‌ఘడ్‌తో మాట్లాడి అందులో కొంత రిలాగ్జేషన్ తీసుకొని మన రాష్ట్రంమీద భారం పడకుండా చూడాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఏపిఈఆర్‌సి వారు విద్యుత్ చార్జీల టారిఫ్ పెంచుతామని అంటున్నారు. కానీ, టారిఫ్ పెంచకుండానే మనకు బిల్లు పెరుగుతూనే ఉన్నది. అది ఎట్లా పెరుగుతుందో ఎవరికీ అర్థం కాకుండా ఉన్నది. మూడు సంవత్సరాల క్రితం నా ఇంటి విద్యుత్ బిల్లు నెలకి రూ.15,000/- నుండి రూ.18,000/- వస్తుండేది. ఇప్పుడది రూ.26,000/- వస్తుంది. కావాలంటే నా మూడు సంవత్సరాల బిల్స్ ఇస్తాను. విద్యుత్ బిల్లులు పెంచడం జరగదని అంటున్నారు. కానీ ఎందుకు బిల్లు ఎక్కువ వస్తుందో అర్థం కావడం లేదు. బిల్లు మాత్రం సీక్రెట్‌గా పెరుగుతూనే ఉంది. ఈ విషయాన్ని కూడా తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

13,000మెగావాట్ల విద్యుత్‌ని పెంచేందుకు ప్రయత్నం చేస్తుందని ప్రభుత్వం చెబుతుంది. కానీ, తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉందనే ఉద్దేశ్యంతో రాష్ట్ర విభజన చట్టంలో విద్యుత్ షేర్ 56:44శాతంగా (తెలంగాణకి 56, ఆంధ్రప్రదేశ్‌కి 44 శాతంగా) క్లిస్టర్ క్లియర్‌గా చెప్పడం జరిగింది. మన జనాభా తక్కువ ఉన్ననూ విద్యుత్ విషయంలో మాత్రం మనకి ఎక్కువ షేర్ కేటాయించడం జరిగింది. అట్లాగే వారికి పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేసినట్లుగా, మనకు ఎన్‌టిపిసి ద్వారా 800x5=4000MW విద్యుత్ ప్లాంట్‌ని ఏర్పాటు చేసేందుకు కేంద్రం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోనే చెప్పడం జరిగింది. కానీ, నాకు తెలిసి కేవలం ఒక్క 800మెగావాట్ల యూనిట్ మాత్రమే ప్రారంభించబడింది. ప్రభుత్వమేమో వారి స్టేట్‌మెంట్‌లో 800మెగావాట్ల రెండు యూనిట్లు ప్రారంభించబడ్డాయని అంటున్నారు. కాబట్టి, మిగతా యూనిట్లు కూడా ప్రారంభించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. దానికి కోల్ మరియు నీరు కూడా చాలా అందుబాటులో ఉన్నాయి. కాబట్టి, మనకు ఆ విద్యుత్ అందుబాటులోకి వస్తే చాలా తక్కువ ధరలో విద్యుత్ వస్తుంది. అక్కడ భద్రాద్రి, యాదాద్రి కంటే తక్కువ ఖర్చులో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఆ 4000మెగావాట్ల విద్యుత్ పూర్తిగా మన రాష్ట్రానికే ఉంది. అందులో ఎవరికీ భాగం లేదు. కాబట్టి, ఆ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఏవైనా సహాయ సహకారాలు అందించేందుకు మేము ముందుకు వస్తామని తెలియజేస్తున్నాము.

అలాగే ఇప్పుడున్న ప్రభుత్వం మణుగూరులో 270x4=1080MW విద్యుత్ ప్లాంట్‌ని ప్రారంభించారు. దానిని 18 నెలల్లో పూర్తి చేస్తామని గౌరవ ముఖ్యమంత్రి గారు ఇదే హౌజ్‌ద్వారా తెలియజేయడం జరిగింది. అప్పుడు థర్మల్ పవర్ స్టేషన్ రావాలంటే కనీసం 4, 5 సంవత్సరాలు పడుతుంది, 18 మాసాల్లో మాత్రం అసలే కాదని నేను మాట్లాడడం జరిగింది. అప్పుడు దానికి మనస్సు ఉంటే, మార్గం ఉంటుందని గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పడం జరిగింది. కానీ, మేము చెప్పినట్లుగా ఇప్పటికీ 40 మాసాలు గడిచింది, ఇప్పటికీ ప్రారంభించబడలేదు. ఈమధ్యనే పర్యావరణ అనుమతులు వచ్చినట్లుగా ఉంది. దానిని ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియదు.

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినాకా రెండే, రెండింటికి పునాది రాళ్లు వేయడం జరిగింది. ఒకటేమో భద్రాచలం దగ్గర మణుగూరులో, మరొకటి యాదాద్రి వద్ద. యాదాద్రి పవర్ ప్లాంటేషన్ 800x5=4000MW చాలా మంచిది. కానీ, ఆలోచన చేసి చేయండి, ఇంపోర్టెడ్ కోల్‌తో అంటున్నారని అన్నాము. మన దగ్గర సింగరేణి అంత కోల్ సరఫరా చేసే పరిస్థితిలో లేదని చెప్పడం జరిగింది. మన దగ్గరున్న కోల్ మరియు ఇంపోర్టెడ్ కోల్‌తో విద్యుత్ తయారు చేస్తే మనకు ఒక్కో యూనిట్‌కి రూ.5.20పైసలు ఖర్చు అవుతుందని చెప్పాము. ఇంత కాస్ట్‌తో మనం విద్యుత్‌ను తయారు చేసి రైతులకు ఇస్తే మన జెన్‌కో, ట్రాన్స్‌కో నష్టాల్లో పడుతుందని చెప్పడం జరిగింది. కానీ, ఆ విషయంలో కూడా ప్రభుత్వం వారిచ్చిన స్టేట్‌మెంట్‌లో ఏమీ తెలియజేయలేదు.

నేను చెప్పిన విషయాల్లో ఏదైనా తప్పుంటే దయచేసి ప్రభుత్వం కరెక్ట్ చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కాళేశ్వరం లిఫ్టులకి దాదాపు 8000మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని అంటున్నారు. ఈ లిఫ్టులన్నీ ప్రారంభిస్తే మూడు సంవత్సరాల్లో ఇప్పుడున్న విద్యుత్‌కి అదనంగా 24,000మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందని అంటున్నారు. ప్రభుత్వం ప్రారంభించింది కేవలం రెండు ప్రాజెక్టులు మాత్రమే. ఈ 24,000మెగావాట్లకి ఎలా రీచ్ అవుతుంది ప్రభుత్వం. ప్రభుత్వం ప్రారంభించింది ఒకటేమో, 1080మెగావాట్లు, మరొకటేమో 4,000మెగావాట్లు. వాటిలో ఏదీ ప్రారంభించబడలేదు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఎన్‌టిపిసి విద్యుత్ ప్లాంట్‌లో కేవలం ఒక 800 విద్యుత్ ప్లాంట్ మాత్రమే ప్రారంభించబడింది. ఈ టార్గెట్ రీచ్ అయ్యేందుకు ప్రభుత్వ రోడ్ మ్యాప్ ఏమిటో తెలియజేయాలని మీద్వారా కోరుతున్నాను. ఇప్పుడైతే బయట అందుబాటులో ఉంది కాబట్టి కొనుగోలు చేసుకోగలుగుతున్నాం. రేపు బయట అందుబాటులో లేకపోతే మనం ఇబ్బంది పడే పరిస్థితి వస్తుంది. కాబట్టి, మన కాళ్లమీద మనం నిలబడేందుకు ప్రయత్నం చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మన రాష్ట్రంలో జెన్‌కో ద్వారా జరుగుతున్న ఉత్పత్తి ఎంత? హైడ్రో ద్వారా ఉత్పత్తి చేసేందుకు మనకు అంత స్కోప్ లేదు. ఎంతైనా థర్మల్ ద్వారానే ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. సోలార్ మీద ఎంతవరకు చేయగలుగుతాము. ఈ విషయాలన్నింటినీ ఆలోచించాలని కోరుతున్నాను. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఎంత వేగంగా పోతున్నారో, విద్యుత్ ఉత్పత్తి విషయంలో అంత వేగం లేదని తెలియజేస్తున్నాను.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి మూడున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ, ఏ థర్మల్ విద్యుత్ ప్లాంట్ నుండి కూడా ఒక్క మెగావాట్ విద్యుత్ కూడా రాలేదు. నా అనుభవం ప్రకారం అవి ప్రొడక్షన్‌లోకి రావాలంటే కనీసం ఇంకా మూడు సంవత్సరాలు పడుతుంది. ఇంకా తొందరగా చేస్తే కనీసం 30 నెలలు పడుతుంది. లిఫ్టులకి కావాల్సిన 24,000మెగావాట్ల విద్యుత్‌ని ఎలా రీచ్ కాగలుగుతున్నారనే విషయాన్ని ప్రభుత్వం చెప్పలేదు. ఏ, ఏ ప్రాంతాల్లో ఎంతెంత మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లను ప్రారంభిస్తున్నారనే విషయాన్ని ప్రభుత్వం తెలియజేస్తుందని ఆశిస్తున్నాను.

మంచి పనికి, మంచి చేశారని చెప్పే అలవాటు మాకు ఉంది. ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. కాబట్టి, ప్రభుత్వం క్లారిఫికేషన్స్ క్లియర్‌గా ఇస్తుందని ఆశిస్తూ, ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు.

12.40 మ. **శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ :-** అధ్యక్షా, విద్యుత్ సమస్యపై మాట్లాడే అవకాశం కల్పించినందుకు తమరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు తెలంగాణ వస్తే ఏముంది, కరెంటు కరవు ఏర్పడుతుంది, తెలంగాణ అంధకారం అవుతుందని సమైక్య పాలకులు శాపాలు పెట్టారు. అటువంటి పిల్లి శాపాలన్నీ ఛేదిస్తూ, విద్యుత్ కోతలతో కమ్ముకున్నటువంటి కారు చీకట్లను కూడా చీలుస్తూ, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు తెలంగాణ సమాజం గర్వంగా తల ఎత్తుకునే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకురావడం జరిగింది.

కేవలం మూడు సంవత్సరాలలోనే మిగులు విద్యుత్ రాష్ట్రంగా దేశంలోనే తెలంగాణను నిలిపి, 60 సంవత్సరాల సమైక్య పాలనలో ఏనాడు చూడనటువంటి 24 గంటల విద్యుత్‌ను ఇవ్వడం ఈరోజు మనం చూస్తున్నాం. ఇంతకుముందు గౌరవ ఎల్‌ఓపి గారు మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రిగారు చూపించిన శ్రద్ధకు ఆరు నెలల్లోనే కోతలు లేనటువంటి విద్యుత్‌ను అందించడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చే నాటికి పట్టణాలలో 2 గంటలు, జిల్లా కేంద్రాలలో 4 గంటలు, మండల కేంద్రాలలో 6 గంటలు, గ్రామాలలో 8 గంటల వరకు విద్యుత్ కోతలు ఉండేవి. గౌరవ ముఖ్యమంత్రిగారు మరియు గౌరవ విద్యుత్‌శాఖ మాత్యులు వివిధ మార్గాల ద్వారా విద్యుత్‌ను కొనుగోలు చేసి అన్ని వర్గాలకు 24 గంటల విద్యుత్‌ను అందిస్తున్న రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్రం.

ఇంతకుముందు గౌరవ ఎల్‌ఓపి గారు మాట్లాడుతూ, విద్యుత్ సంస్థలో అపార అనుభవం ఉన్నటువంటి గౌరవనీయులు శ్రీ డి. ప్రభాకర్ రావు లాంటి అధికారుల ఆలోచనలతో వివిధ మార్గాల ద్వారా, టిఎస్ జెన్‌కో ప్లాంట్ల ద్వారా ఉత్పత్తిని పెంచడం. అదేవిధంగా స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా, అలాగే విద్యుత్ పంపిణీ మరియు సరఫరాలలోఉన్నటువంటి నష్టాలను తగ్గించడం ద్వారా 15000 మెగావాట్ల గరిష్ట డిమాండు మేరకు విద్యుత్‌ను అందించడానికి సుమారు రూ.12,136 కోట్లతో ప్రణాళిక చేసింది మన టిఆర్ఎస్ ప్రభుత్వం అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదేవిధంగా మన రాష్ట్రంలో 24 లక్షల పైగా పంపుసెట్లు ఉన్నాయి. గతంలో విద్యుత్ 6 గంటలు ఇస్తామని 3 గంటలు, 5 గంటలు ఇస్తామని 2 గంటలు ఇవ్వడం జరిగింది. అసలు ఎప్పుడు కరెంటు వస్తుందో, ఎప్పుడు పోతుందో అని రైతులు కాలువల దగ్గర, మోటార్ల దగ్గర ఎదురు చూసే పరిస్థితులు ఉండేవి. ఈరోజు ప్రభుత్వం ఏప్రిల్ 2016 సంవత్సరం నుండి 22 లక్షల కరెంటు కనెక్షన్లకు పట్ట పగలే 9 గంటల విద్యుత్‌ను ఇస్తున్నటువంటి ఘనత మన తెలంగాణ ప్రభుత్వానిదే అని ఈ సందర్భంగా తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ప్రయోగాత్మకంగా 24 గంటల విద్యుత్‌ను అందించడం జరుగుతుందని ప్రభుత్వం ఇంతకుముందే ప్రకటన చేసింది. దేశంలోనే మొట్టమొదటి సారిగా ఈరోజు నుండి ఐదు రోజుల వరకు 24 గంటల విద్యుత్‌ను అన్ని వర్గాలకు ప్రయోగాత్మకంగా అందించడం జరుగుతుంది. అందువల్ల రైతులు, పరిశ్రమలు ఉన్నటువంటి వారు మరియు ఇతర వర్గాల వారందరూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని ఈ సందర్భంగా తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అలాగే రాష్ట్రవ్యాప్తంగా వచ్చే 2018వ సంవత్సరం నుంచి రబీకాలంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనేది ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత 60 సంవత్సరాలు ఎన్నో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా, రాష్ట్రానికి సరిపడ విద్యుత్‌ను ఇవ్వలేక పోయాయి. ఈరోజు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం రాబోయే తరాలకి సరిపోను విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనే సంకల్పంతో,

రాష్ట్రంలో 24,000 మెగావాట్లపైన విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి రూ.94,000 కోట్లపైన నిధులను గౌరవ ముఖ్యమంత్రిగారు మంజూరు చేయడం జరిగింది.

(గౌరవ డెప్యూటీ ఛైర్మన్ అధ్యక్షస్థానం వహించారు.)

గతంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ట్రాన్స్‌ఫార్మర్‌కేంద్రాల దగ్గర రైతులు వారం, పది రోజుల వరకు పడిగాపులు కాసే పరిస్థితి ఉండేది. కనీసం ఆ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తు చేసే దాఖలాలు లేవు. అందువల్ల రైతుల పంటలు ఎండిపోయేవి. ఈరోజు సరైన చర్యలు తీసుకోవడం వల్ల కేవలం 24 గంటల లోపే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తు చేయించి ఇవ్వడం జరుగుతుందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

గత ప్రభుత్వంలో వివిధ ప్రాజెక్టులకు శిలా ఫలకాలు వేసినప్పటికీ, వాటిని పూర్తి చేసినటువంటి దాఖలాలు లేవు. అసలు తెలంగాణ వచ్చిందే మన నిధులు మనం ఖర్చు పెట్టుకోవడానికి, మన రాష్ట్రంలో ఉన్నటువంటి కార్యక్రమాలను విజయవంతం చేసుకోవడానికి. ఈనాడు ఒక మంచి సంకల్పంతో రూ.37,600 కోట్ల పెట్టుబడితో మణుగూరు, కొత్తగూడెం, దామరచర్లవంటి ప్రాంతాలలో 5,880 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తికోసం బిహెచ్ఇఎల్ సంస్థ ఆధ్వర్యంలో ప్లాంట్ల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ప్రారంభమైంది.

అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం 2015 సంవత్సరం అక్టోబరు నాటికే 2,570 మెగావాట్లు స్థానిక సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగి దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉంది. తెలంగాణ రాష్ట్రం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉదయ్ పథకం' లో చేరడం ద్వారా డిస్కంల యొక్క అప్పులన్నీ కూడా రాష్ట్రప్రభుత్వం యొక్క ఖాతాలోకి మార్చుకొని ఈరోజు అందరికి బదిలీ చేయడం జరిగింది.

అంతకుముందు నాయి బ్రాహ్మణులు హెయిర్ కటింగ్ సెలూన్‌లలో వచ్చే విద్యుత్ బిల్లులను కమర్షియల్ ప్రాతిపదికన చెల్లించవలసి వచ్చేది. ఈరోజు 200 యూనిట్లలోపు వాడితే డొమెస్టిక్ టారిఫ్ గ్రేడ్ ప్రకారం ఛార్జీలు వసూలు చేయాలని నిర్ణయం తీసుకొని, దానివలన ఏర్పడే దాదాపు రూ.144 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరిస్తోంది. అలాగే విద్యుత్ శాఖలో పనిచేస్తున్న దాదాపు 22,550 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు విద్యుత్ సంస్థనే నేరుగా జీతాలు కూడా చెల్లిస్తోంది. దీనితోపాటు ఉద్యోగాల కల్పనలో 1.10 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో విద్యుత్ సంస్థలో 13,357 కొత్త పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి, భర్తీ చేసే కార్యక్రమం కూడా జరుగుతోంది. ఇప్పటికే 987 మంది అసిస్టెంట్ ఇంజనీర్లను కూడా భర్తీ చేసుకోవడం జరిగిందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

గతంలో తెలంగాణ రాష్ట్రంలోని చాలా పరిశ్రమలు అలాగే హైదరాబాద్ చుట్టుప్రక్కల ఉన్నటువంటి పరిశ్రమలు విద్యుత్ లేక ఆరు గంటలో, ఏడు గంటలో పరిశ్రమలు నడపడం వల్ల, ఎంతోమంది కార్మికులు నిరుద్యోగులుగా రోడ్ల మీదకు వచ్చిన సందర్భాలున్నాయి. విద్యుత్‌ను 24 గంటలు సరఫరా చేయడం వల్ల పరిశ్రమల్లో ఉత్పత్తి పెరగడమే కాకుండా ఉద్యోగులకు భద్రత కల్పించిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం.

అలాగే రాష్ట్రంలో నిర్మిస్తున్నటువంటి సాగునీటి ఎత్తిపోతల పథకాలకు, మంచినీటి కొరకు నిర్మిస్తున్నటువంటి మిషన్ భగీరథ పథకానికి అవసరమైన విద్యుత్ ఉత్పత్తిని పెంచడంతోపాటు అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. ఇంతకు ముందు గౌరవ ఎల్ఓపిగారు మాట్లాడుతూ, చాలా అనుమానాలున్నాయని అన్నారు. వారు విద్యుత్‌శాఖలో మంచి అనుభవం ఉన్న మంత్రిగా పని చేశారు. కానీ అనుమానం ఉన్న వ్యక్తులకు ఎప్పుడూ అనుమానాలు వస్తుంటాయి.

అంతకుముందు మన రాష్ట్రానికి 1000 మెగావాట్లు విద్యుత్ సరఫరా లోటు ఉండేది. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుండి మన రాష్ట్రానికి విద్యుత్ సరఫరా చేసుకోడానికి మా సొంత గ్రామమైన మిట్టపల్లి గ్రామంలో 750 మెగావాట్ల సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగింది. దానిద్వారా ఈరోజు మెరుగైన విద్యుత్‌ను పొందడం జరుగుతోంది. కాబట్టి ప్రతిపక్షనాయకులు దీనిని అభినందించాలిగాని విమర్శలు చేయొద్దని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మొన్న రబీకాలంలో కరెంటు మోటార్లు ఏవిధంగా నడుస్తున్నాయని లేకపోతే కరెంటు మోటార్ల ద్వారా రైతులకు పంటలు ఏవిధంగా పండుతున్నాయని ప్రతిపక్ష పార్టీ నాయకులు అడిగారు. కానీ, గౌరవ ముఖ్యమంత్రిగారు ముందుచూపుతో విద్యుత్ ఇవ్వడం వల్ల, దేశంలోనే నెంబర్‌వన్‌గా రబీ మరియు ఖరీఫ్ పంటలలో 55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతాంగం పండించడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. కాబట్టి మన ప్రభుత్వం ఇటువంటి మంచి కార్యక్రమాలు చేసి 24 గంటల విద్యుత్‌ను

ఇవ్వడం వల్ల రైతాంగం, వ్యాపారస్తులు, పరిశ్రమలు పెట్టేవారు చాలా సంతోషంగా ఉన్నారు. కాబట్టి, గౌరవ మంత్రిగారు ప్రవేశపెట్టిన స్టేట్‌మెంట్ ఏకగ్రీవంగా ఆమోదించాలని తమరి ద్వారా కోరుతున్నాను. జై తెలంగాణ.

**శ్రీ ఎన్. రామచంద్ర రావు:-** అధ్యక్షా, గౌరవ మంత్రిగారు ప్రవేశపెట్టిన నోటులో 24 గంటల విద్యుత్‌ను ఇస్తామని చెప్పారు. ఇంతవరకు గృహావసరాల కొరకు 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేయడం జరిగింది. వీటినుండి ప్రభుత్వం రైతులకు అదే విధంగా 24 గంటల విద్యుత్‌ను ఇవ్వడం కొరకు ప్రయోగాత్మకంగా ఒక ప్రయత్నం చేస్తున్నది. అందుకు మా పార్టీ తరపున నేను అభినందిస్తున్నాను. రైతులను ఆదుకునే ప్రయత్నంలో దీనిని మొదటి మెట్టుగా నేను భావిస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత విద్యుత్ విషయంలో అనేకమైన అనుమానాలు ఉండేవి. డి. ప్రభాకర్ రావు లాంటి సమర్థులైన అధికారుల అనుభవంతో తెలంగాణలో మనం విద్యుత్ కొరతను అధిగమించగలిగాం. విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం ఒక మిగులు రాష్ట్రంగా ఉండాలనే కోరిక ఉంది. ఇప్పటివరకు ఛత్తీస్‌ఘడ్ నుండి 1000 మెగావాట్లు, అదేవిధంగా ఇతర కంపెనీల నుండి కూడా విద్యుత్ కొనుగోలు చేయడం జరుగుతోంది.

నేను సూటిగా ప్రజల తరపున వారిలో ఉన్నటువంటి అనుమానాలను తమరి ద్వారా అడగదలచుకున్నాను. ఈరోజు మన రాష్ట్రంలో ఉన్న అనేక పరిశ్రమలు విద్యుత్ మీద ఆధారపడి ఉన్నాయి. అందులో చిన్న, మధ్యతరహా మరియు భారీ పరిశ్రమలు ఉన్నాయి. వాటికి అవసరమైన నాణ్యమైన మరియు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసే ప్రయత్నం జరుగుతున్నదా? దానిద్వారా వారికి cost effective power ప్రభుత్వం ఇస్తోందా? ఎందుకంటే కొన్ని సమాచారాలను బట్టి రాష్ట్రంలో డిస్కంలకు సంబంధించి కొన్ని finance losses చూపెడుతున్నారు.

2014-15 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని ఒక డిస్కం దాదాపు రూ.13,767 కోట్లు నష్టంలో ఉన్నట్లుగా అంచనా వేశారు. 2018-19 సంవత్సరానికి దాదాపు రూ.30.00 కోట్లకు టారిఫ్ పెంచకుండా ఉన్నట్లయితే, ఇన్ని కోట్లు నష్టం వచ్చే అవకాశాలు ఉన్నాయని cash losses లో కొన్ని రిపోర్టులు తెలుపుతున్నాయి. ఈ నష్టాలను అధిగమించాలంటే టారిఫ్ ఇంక్రీజ్ చేయక తప్పదేమో అనే అనుమానం ఆ రిపోర్టులు వ్యక్తం చేస్తున్నాయి.

ఇప్పుడున్నటువంటి అంచనా ప్రకారం 13 శాతం టారిఫ్ యావరేజ్ బేస్‌లైన్ మీద ఇంక్రీజ్ చేసే అవకాశాలుంటాయి. ఈ భారమంతా ప్రజల మీద పడుతుంది. కాబట్టి దీనిపైన కూడా ప్రభుత్వం టారిఫ్‌ను పెంచి ఈ యొక్క 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను సప్లై చేయడానికి రీజనబుల్ ఇంక్రీజ్‌కు ఎవరైనా సహకరిస్తారు. కానీ, 13 శాతం ఇంక్రీజ్‌తో గాని లేకుంటే ప్రజలపైన భారం పడే విధంగా అవకాశాలున్నాయనే అనుమానాలు ఈరోజు అందరిలో ఉన్నాయి. దానిని ఏ విధంగా అధిగమిస్తుందో ప్రభుత్వం ఆలోచించాల్సిందిగా మీద్వారా కోరుతున్నాను.

ఈరోజు వివిధ మార్గాల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నాం. ఈ మధ్యనే నేను పరిగి కోర్టులో ఒక కార్యక్రమానికి వెళ్తుంటే దారిలో వందకు పైగా గాలిమరలు కనిపించాయి. వాటిని తాత్కాలిక ప్రాతిపదికనా, లేదా ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారా ప్రభుత్వం తెలియజేయాలి. ఆ గాలిమరలను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తే, ఎంత విద్యుత్ ఉత్పత్తి వస్తుందనేది ఆలోచించవలసిన అవసరముంది. గతంలో మనం కేవలం థర్మల్ మరియు హైడల్ పవర్ మీదనే ఆధారపడేవాళ్లం. కానీ ఇప్పుడు మనకు రకరకాల విద్యుత్ ఉత్పత్తి మార్గాలు ఉన్నాయి.

ముఖ్యంగా renewable energy sources ఉన్నాయి. దాంట్లో బయో గ్యాస్‌గాని లేదా సంబంధించిన ఇతర గ్యాస్‌ల ద్వారా ప్రభుత్వం ఎంతవరకు విద్యుత్‌ను పొందగలుగుతుంది. ఎందుకంటే రాబోయే రోజులలో విద్యుత్‌ను కొనుగోలు చేయకుండా మనమే ఉత్పత్తి చేసే విధంగా ఒక సర్‌ప్లస్ స్టేట్ కావాలనే లక్ష్యంతో పోతున్నాం. కాబట్టి, ఈ renewable energy sources ద్వారా రాబోయే రోజులలో ఎన్ని మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు అనే ఆలోచన ప్రభుత్వం దగ్గర ఉన్నదా? ఈ సందర్భంగా చర్చ కొంత డీవియేట్ అయినప్పటికీ కూడా నేను చెప్పేదేమంటే, మన హైదరాబాద్‌లో గార్బేజ్ చాలా పెద్ద సమస్యగా ఉన్నది.

కొన్ని రోజుల క్రితం కొంతమంది ఎంఎల్‌ఏల వెంట నేను కూడా న్యూఢిల్లీకి వెళ్లడం జరిగింది. అక్కడ ఓక్లా గార్బేజ్ ప్లాంట్‌లో పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగింది. అందులో వ్యర్థ పదార్థాలతో విద్యుత్ ఉత్పత్తి చేయడం జరుగుతోంది. వ్యర్థ పదార్థాలతో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రయత్నాలు మన రాష్ట్రంలో కూడా ఏమైనా జరుగుతున్నాయా? ఒకవేళ జరుగుతున్నట్లయితే దాని

నుంచి ఎన్ని మెగావాట్ల విద్యుత్ వచ్చే అవకాశం ఉందో తెలియజేయాలి. హైదరాబాద్ పట్టణంలో ఉన్నటువంటి గార్బేజ్ డిస్పోజ్ చేయడం కొరకు ఇలాంటి పవర్ ప్లాంటు చేయకపోతే, ఆ చెత్త పేరుకుపోయి రకరకాల రోగాలకు దారి తీసే అవకాశముంది.

1.00 మ. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి సోలార్ పవర్ సామర్థ్యాన్ని 2000 మెగావాట్ల నుండి 3800 మెగావాట్ల వరకు పెంచడానికి అవకాశాలున్నాయి. ఈ సోలార్ ప్లాంట్లలో పిపిపి ద్వారా మన రాష్ట్రానికి ఎన్ని ప్రాజెక్టులు వచ్చాయి? వాటి ద్వారా ఎన్ని మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది? ఆ ఉత్పత్తి కారణంగా విద్యుత్‌ను బయటి నుండి కొనడం తగ్గించామా? ఎన్ని జిల్లాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు వచ్చే అవకాశాలున్నాయి? మొదలగు విషయాలను ప్రభుత్వం తెలియజేయాలని కోరుతున్నాను. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు కొన్ని జిల్లాల్లో కొంత మంది ప్రైవేటు వ్యక్తులు ముందుకు వచ్చినప్పటికీ, భూమి మరియు ఇతర కొన్ని కారణాల వల్ల వెనక్కిపోవడం జరుగుతోందని నాకు తెలిసింది.

సోలార్ పవర్ ప్లాంట్లను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను నేను అభినందిస్తున్నాను. హైడల్ పవర్‌తో పాటు, థర్మల్‌పవర్ కూడా అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు పవర్‌కు సంబంధించిన క్రెడిట్‌ని తీసుకోవడంలో అభ్యంతరం లేదుగానీ, అందులో కేంద్రప్రభుత్వం యొక్క క్రెడిట్ కూడా ఉన్నదని మనవి చేస్తున్నాను. ఎందుకంటే కేంద్రంలో మా ప్రభుత్వమే ఉంది. దేశ వ్యాప్తంగా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండాలని కోరుకుంటూ, రైతులుగానీ, ప్రజలు గానీ నష్టపోకూడదని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటోంది. కాబట్టి, తెలంగాణ రాష్ట్రంలో 24 గంటలపాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించే విషయంలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వ సహకారం కూడా ఉంది. విద్యుత్తుకు సంబంధించిన వివిధ కార్యక్రమాల కోసం దాదాపు రూ.30 వేల కోట్ల రుణాన్ని కేంద్ర ప్రభుత్వం అందించినట్లు మనకు కొన్ని ఆధారాలున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి సోలార్ ఎనర్జీ, ఉదయ్ స్కీమ్, దామరచర్ల ప్రాజెక్టు, ఛత్తీస్‌ఘడ్ నుండి విద్యుత్ లైన్ల కోసం టెర్మినల్‌ను పూర్తి చేయడం వంటి కార్యక్రమాలు కేంద్రప్రభుత్వ చొరవ వల్లే జరిగాయని తెలియజేస్తున్నాను.

హై టెన్షన్ వైర్ల వలన వ్యక్తులు, పశువులు చనిపోవడం మనం చూస్తున్నాం. ఈ విషయమై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. ఈనాడు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న దేశం మనది. పెద్ద పెద్ద నగరాలలో, విదేశాలలో వైరింగ్ ఎలక్ట్రిక్ పోల్స్ మీద ఆధార పడి ఉండదు. ఆవిధంగా అర్బన్ ప్రాంతాలలో అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిఫికేషన్ ఉండే విధంగా ప్రభుత్వం ఏ చర్యలను తీసుకుంటోంది? విద్యుత్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన విద్యుత్, 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్‌ను అందిస్తున్న విషయాన్ని నేను అభినందిస్తున్నాను. రాష్ట్రప్రభుత్వం తీసుకున్న చర్యలలో కేంద్ర ప్రభుత్వం యొక్క పాత్ర కూడా ఉందని గుర్తించాలని కోరుతూ నాకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి:-** అధ్యక్షా, విద్యుత్‌కు సంబంధించిన చర్చలో పాల్గొనడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గౌరవ మంత్రిగారు వారి స్టేట్‌మెంట్‌లో అనేక అంశాలను ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో పెట్టుకున్న లక్ష్యాలు, ప్రజల అవసరాలు, రాష్ట్ర అవసరాలు తీర్చే దిశలో మా గౌరవ సభ్యులు శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు చెప్పిన విషయాలను నేను స్వాగతిస్తున్నాను.

తమరి ద్వారా రెండు, మూడు అంశాలను ప్రస్తావించదలుచుకున్నాను. I am complimenting and congratulating the Telangana State Electricity department officials. మంచి టీమ్ ఉంది. మంచి విజన్ ఉన్న వ్యక్తులున్నారు. ముఖ్యంగా గౌరవ సభ్యులు శ్రీ ఎన్. రామచంద్రరావుగారు చెప్పారు. ఎవరు చెప్పినా ఎటువంటి నిర్ణయం తీసుకున్నా ప్రజల మీద ఎక్కువగా భారం పడకుండా చూడాలని కోరుతున్నాను. కాంగ్రెస్ హయాంలో విద్యుత్ ఛార్జీలు పెంచారు అనేది అతి స్వల్పం. దేశవ్యాప్తంగా మిగులు విద్యుత్ ఉన్న నేపథ్యంలో సామాన్య మానవుడిపై భారం పడకుండా, అనేక అంశాలను పొందుపరచుకొని యూనిట్ రేట్లను నిర్ణయించాలి. ఎలక్ట్రిసిటీ యాక్ట్ ఏం చెబుతుందో నేను పూర్తిగా పరిశీలించలేదు కానీ, ఒక సాధారణ వ్యక్తిగా బయట ఉన్నటువంటి అభిప్రాయాన్ని ఈ సభలో మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

విద్యుత్‌ను కొనుగోలు చేసేటప్పుడు అనేక కండిషన్స్‌తో అగ్రిమెంటును చేసుకోవడం జరుగుతుంది. గౌరవ సభ్యులు శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు చెప్పినట్లుగా అర్ధరాత్రి ఒక రేటు, వాడకమును బట్టి మరొక రేటు ఉంటుంది. అప్పటి విద్యుత్ శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ గారు ఇచ్చిన

స్టేట్‌మెంట్ ప్రకారం ఒక యూనిట్ ధర రూ.2.25 పైసలుగా ఉండేది. ఆ విషయమై గౌరవ మంత్రిగారు గతంలో కొంత వివరణ ఇచ్చినట్లు తెలుసు. భవిష్యత్తులో 3,540 మెగావాట్లు అవసరముంటుందని ముఖ్యమంత్రిగారు వారి రెవ్యూలో పేర్కొన్నట్లుగా చదివాను. వారు చెప్పినట్లు భద్రాద్రి విద్యుత్ కేంద్రం ఏర్పాటు విషయంలో మేము (కాంగ్రెస్ పార్టీవారు) కోర్టు కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశామని నింద వేశారు. నేను వ్యక్తిగతంగా ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రభాకర్ రావు గారిని కలిసి తెలుసుకున్నదేమంటే, ఆ కేసు వేసింది విశాఖపట్టణానికి చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ. ఆసంస్థతో మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదు. అతను విశాఖపట్టణంలో ఉండి భద్రాద్రి పవర్ ప్లాంటు మీద యన్‌జీటి, చెన్నైలో పిటిషన్‌వేయడం జరిగింది. అసలు జరిగిన విషయం అది. చివరికి అన్ని అరిష్టాలు తొలగిపోయాయి. అక్కడ ల్యాండ్ అక్విజిషన్ జరిగింది. ఉద్యోగాలు రావలసిన వారు అభద్రత భావంతో ఉన్నారు. 332 మంది భూమి కోల్పోయిన వారి గురించి కూడా గౌరవ ముఖ్యమంత్రిగారికి చెప్పడం జరిగింది. నేను వ్యక్తిగతంగా కూడా భద్రాద్రి ప్లాంటును సందర్శించడం జరిగింది. వారందరికీ భద్రత కల్పించాలి. వారందరికీ కూడా త్వరగా ఉద్యోగాలు రావాలి. వారు అన్నట్లు విద్యుత్ ఉత్పత్తి కూడా మార్చి నెలలో ప్రారంభిస్తే, చాలా సంతోషం. తప్పని సరిగా ఆ యూనిట్‌ను అభినందించడం జరుగుతుంది.

వారు అన్నట్లు, ఈరోజు నుండి 24 గంటల నిరంతర విద్యుత్తు అనే ప్రతిపాదనకు కూడా బాలారిష్టాలు లేకుండా నడవాలనీ, తప్పకుండా వంంచి జరగాలని కోరుకుంటున్నాము. కాకపోతే కొన్ని ప్రాంతాలలో రైతులు 24 గంటల కరెంట్ సరఫరా వలన మా మోటర్లు కాలిపోతాయి, మేము ఇంత భరించలేము అని అంటున్నారు. ఆ కోణం నుండి కూడా మనం ఆలోచించాలి. ఎక్కడైతే అవసరం ఉందో, కొత్త టెక్నాలజీతో అవసరం ఉన్నంత వరకు ఉపయోగించుకొని, అంత వరకే బిల్లు వచ్చేటట్లు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఒక పద్ధతి ప్రకారం కొనసాగించాలని తమరి ద్వారా మంత్రిగారికి, వారి యొక్క అధికార బృందానికి తెలియజేసుకుంటున్నాను. 24 గంటలు విద్యుత్ ఇవ్వడం అనేది ఒక సంకల్పం. దాని వల్ల అనేక ఉపయోగాలున్నా కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు 'మాకొద్దు బాబోయ్ 24 గంటలు, మాకు 9 గంటలు నిరంతరాయంగా ఇస్తే చాలు' అని కొన్ని ప్రాంతాలలో రైతులు అంటున్నారు. ఆ అంశాన్ని కూడా పరిగణన లోనికి తీసుకొని రెవ్యూ చేయవలసిందిగా కోరుతున్నాను.

సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ గురించి గతంలో చాలా మందికి ఆసక్తి ఉండేది. ఇప్పుడు సడన్‌గా సోలార్‌లో కొంత డౌన్ ఫాల్ ఉంది. మన పథకంలో లోపం ఉందా? ఎందుకు ఆ దిశగా ప్రజలను ఆకర్షించలేకపోతున్నాం? కర్ణాటక రాష్ట్రంలో సోలార్ విద్యుత్‌ను తక్కువ ఖర్చుతో పెద్ద ఎత్తున ఉపయోగిస్తున్నారు. వారు 2000 మెగావాట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా చెప్పారు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా దాని గురించి ఆలోచించాలి. సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటులో ఉన్న ఇబ్బందులు ఏమిటి? ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఎందుకు ముందుకు రావడం లేదు? గతంలో అగ్రిమెంటు చేసుకునే వారికి ప్రోత్సాహకరంగా ఉన్నప్పటికీ, ఇప్పుడెందుకు ప్రోత్సాహకరంగా లేదు? ఎక్కడ లోపముంది? మొదలగు విషయాల గురించి రిప్లై ఇవ్వవలసిందిగా తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'సౌభాగ్య' అనే పథకాన్ని తీసుకొచ్చింది. గతంలో ఉన్న యూపీఏ ప్రభుత్వ పాలసీ 'రాజీవ్ గాంధీ గ్రామీణ విద్యుదీకరణ' అనే పథకానికి ప్రస్తుత ప్రభుత్వం పేరు మార్చి, రూ.16,320 కోట్లతో వివిధ రాష్ట్రాలకు ఒక బడ్జెట్‌ను కేటాయించడం ద్వారా, దీనికి 'సౌభాగ్య' (సహజ్ బిజిలీ హర్ ఘర్ యోజన) అనే పేరు పెట్టారు. 'సౌభాగ్య' పథకం గురించి నాకున్న సమాచారం ప్రకారం, దీనిని 'పెయిడ్ విద్యుత్ సౌభాగ్య' అని అంటారు. అంటే, ఉచిత విద్యుత్ కనెక్షన్స్‌తోపాటు, ప్రీ-పెయిడ్ విద్యుత్ మీటర్లను కూడా అమరుస్తారు. 2019 మార్చి నెలలోగా అన్ని ఇళ్ళకు ఈ పథకం క్రింద కనెక్షన్స్ ఇవ్వాలని ఒక పథకం పెట్టారు. ఈ పథకం గైడ్‌లైన్స్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం 60 శాతం గ్రాంటుగా ఇస్తే, 10 శాతం డిస్కాం వారు భరించవలసి ఉంటుంది. మిగిలిన 30 శాతం రుణం రూపంలో సమీకరణ చేయడం జరుగుతుంది. రూ.500 రుసుముతో కనెక్షన్ ఇవ్వవచ్చు. అదే రుసుమును వాయిదాలలో నెల బిల్లులతో కలిపి వసూలు చేయవచ్చు, సౌర విద్యుత్ నిల్వ కోసం 200 నుండి 300 వాట్సు బ్యాటరీలు, ఎల్ఇడీ బల్బులు, పవర్ ప్లగ్‌లు వంటి అనేక అంశాలు ఈ సౌభాగ్య పథకం గైడ్‌లైన్స్‌లో ఉన్నాయి. ఈ సౌభాగ్య పథకాన్ని మన రాష్ట్రానికి అన్వయించుకుంటే మన ప్రభుత్వానికి ఎంత మేలు చేకూరుతుంది? ఈ పథకాన్ని అమలు పరిచే దిశగా ప్రభుత్వం తీసుకున్న, తీసుకోబోయే చర్యలను తెలపాల్సిందిగా

ప్రభుత్వాన్ని కోరుతూ, ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని కోరుతున్నాను.

ముఖ్యంగా కొత్తగా వచ్చిన జైపూర్ ప్లాంటుకు పి.ఎల్.ఎఫ్.లో నెం.1 ర్యాంకు వచ్చింది. భూపాలపల్లికి ఎందుకు రాలేదు? పాల్వంచ, కేటీపియస్‌లకు ఎందుకు రాలేదు? సబ్ క్రిటికల్ కేటగిరిలో కేటీపీఎస్ ఉండడం వల్ల రాలేదా? అందుకు పరిష్కార దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యలేమిటి?

విద్యుత్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లుగా గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పారు. ఆ రెగ్యులరైజేషన్ రాష్ట్రపతి ఉత్తర్వుల వల్ల గానీ, జోనల్ అంశాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా? ప్రమోషన్స్ విషయంలో ఏమైనా ఇబ్బందులున్నాయా? 12,000 మందికి పైగా రెగ్యులరైజ్ అయ్యే పరిస్థితి ఉంది. విద్యుత్ శాఖ వారి దగ్గర ఉన్న జాబితా ఏమిటి? దానికి సంబంధించిన చర్యలేమిటి? అని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. గౌరవ సభ్యులు ఎం.ఎస్.ప్రభాకర్ రావుగారు కూడా విద్యుత్ ఉద్యోగుల దగ్గిరికి వెళ్లడం జరిగింది. కొంత మందికే ప్రమోషన్స్ వస్తున్నాయి? తెలంగాణ ఉద్యోగులకు చాలా అన్యాయం జరుగుతోందంటూ ఆ మధ్య ఆందోళనలు జరుగుతుంటే, దానిమీద ఇటీవల వారు హామీ ఇచ్చారు. అదేవిధమైన పెండెన్సీలో ఉన్న అంశాలేమిటి? ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం క్రింద ఇరు రాష్ట్రాలూ పంచుకోవాల్సిన ఆస్తుల్లో మనకు ఆంధ్రప్రదేశ్‌నుండి ఎంత రావాలి? ఎంత వచ్చింది? దానికి సంబంధించి కూడా మంత్రిగారు సమాధానం ఇవ్వాలని కోరుతున్నాను. మనమే వారికి బాకీ ఉన్నట్లు వాళ్ళు ఉత్తరాలు రాయడం, కాదు, వారే బాకీ ఉన్నారంటూ మనం లెటర్లు రాయడం వంటి సంఘటనలు కొద్ది కాలం క్రితం జరిగాయి. ఇటువంటి లెటర్ల యుద్ధం కాకుండా వాస్తవంగా తెలంగాణాకు రావలసినది ఎంత? అని స్పష్టంగా తేల్చాల్సిన అవసరముంది. ఎందుకంటే, దిగువ సీలేరును కోల్పోయాం, పవర్ విషయంలో వి.టి.పి.ఎస్., కడప, రాయలసీమ థర్మల్ ప్లాంటుల నుండి కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్న మాట వాస్తవం. ఆ సమస్యలు పరిష్కరించబడ్డాయా? ఇంకా ఉన్నాయా? గౌరవ మంత్రిగారు సభలో హామి ఇచ్చారు. మంత్రుల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి తప్పనిసరిగా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. మనకు రావాల్సిన బకాయిలు ఎంతున్నాయి? అనేది లెక్కగట్టి వసూలు చేయాల్సిన బాధ్యత మన ప్రభుత్వానికుంది. అది మన హక్కు.. సబ్ క్రిటికల్ 2017 మార్చి నెలకల్లా పూర్తి చేయాలి. ఆ కార్యక్రమం ఎంత వరకు వచ్చింది? ఈ థర్మల్ ప్లాంటు అంశంలో మీ యాక్షన్ ప్లాన్ ఏమిటి? అని ప్రశ్నిస్తూ, నేను అడిగిన ప్రశ్నలకు స్పష్టంగా సమాధానాలు వస్తాయని ఆశిస్తూ , మాట్లాడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**శ్రీ జి. జగదీష్ రెడ్డి:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు మాట్లాడుతూ, భూపాలపల్లిలో 600 మెగావాట్లు, జైపూర్‌లో 1200 మెగావాట్లు వారే తెచ్చారని చెప్పారు. సంతోషం. ప్రారంభం వారే చేశారు.అందులో అనుమానమేమీ లేదు. కె.టి.పి.పి. ప్రారంభించిన రోజే అక్కడ ఆర్.టి.పి.పి.ని కూడా ప్రారంభించడం జరిగింది. అయితే అది ఇప్పటికీ కూడా పూర్తి కాలేదు. కె.టి.పి.పి.ని మనం పూర్తి చేసి రెండు సంవత్సరాలు అయినది. ఆ విధంగా ఇరిగేషన్ ప్రాజెక్టులను చూసుకుంటూ పోతే దాదాపు 30 ఏండ్ల క్రింద కూడా ప్రారంభించడం జరిగింది. వారిలో ఒకరు ప్రారంభం చేశారు, ఒకరు శంకుస్థాపన చేస్తే, మరొకరు ఏడాది మాసికాలు చేశారు. అట్లా చాలా ఉన్నాయి. వాటి జోలికి మేము వెళ్లడం లేదు. నేను కూడా స్టేట్‌మెంట్ ఇచ్చేటప్పుడు వారి మీద ఎటువంటి విమర్శలను చేయలేదు. వారే క్లారిఫికేషన్స్ అడిగారు కాబట్టి చెబుతున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారు అక్కడ పనిచేసే ఇంజనీరు కంటే ఎక్కువ పగలు, రాత్రి పనిచేస్తూ, ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి సమీక్ష చేసి దాని వెంటబడి పూర్తి చేయించబట్టి దానిని తొందరగా పూర్తి చేసుకోగలిగాం. ఆ పద్ధతుల్లో విద్యుత్‌ను కూడా అందుబాటులోకి తెచ్చుకోగలిగాము.

1.20 మ. రెండవ విషయం- ఆనాడు తాము యూనిట్‌కు రూ.14చొప్పున చెల్లించి, కొనుగోలు చేయాలనుకున్నప్పటికీ, విద్యుత్తు అందుబాటులో లేదని వారు చెప్పారు. కాని అప్పటికే దేశంలో కావలసినంత విద్యుత్తు అందుబాటులో ఉంది. అయితే వాళ్లు కారిడార్ బుక్ చేసుకోకపోవడం వల్ల వచ్చిన లోపం వలన తెలంగాణకు విద్యుత్తు అందలేదు. ఎందుకని అంటే ఆనాటి పాలకులు ఉద్దేశ్యపూర్వకంగా, తెలంగాణకు ఎందుకని విద్యుత్తును ఇవ్వాలి అనే పద్ధతిలో పరిపాలన చేశారు కాబట్టి అలా జరిగింది. మన శాసన సభ్యులు ఆ రోజున్న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డిగారి దగ్గరకు వెళ్లి, అడిగితే కూడా పట్టించుకోలేదు. పక్క రాష్ట్రాలలో కూడా విద్యుత్తు అందుబాటులో ఉంది, సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల ఆనాడు అలా జరిగిందని నేను చెప్తాను తప్పు, వారి ప్రభుత్వం

మీద విమర్శలు చెయ్యాలని కాదు. వారు అందుబాటులో విద్యుత్తు లేదని చెప్పడం వలన, నేను విద్యుత్తు ఆ నాడు పూర్తిగా అందుబాటులో ఉన్నదనే విషయాన్ని సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

విభజన చట్టం ప్రకారం 42:58 నిష్పత్తి ప్రకారం కాకుండా, విద్యుత్తు విషయంలో తెలంగాణకు ఎక్కువ వచ్చిందని ఇందాకవారు చెప్పారు. అప్పటికి మన వినియోగం ఎక్కువ ఉంది. మనకు consumption ratio ప్రకారం కేటాయింపు జరిపారే తప్ప, ప్రత్యేకంగా తెలంగాణ మీద ప్రేమ ఎక్కువై కాదు. విభజన చట్టంలో మిగిలిన విషయాల్లో మనకు జరిగిన అన్యాయం స్పష్టమవుతుంది. దానిని కూడా విమర్శ కొరకు కాకుండా, సమాచారం నిమిత్తం చెబుతున్నాను.

రామగుండంకి సంబంధించి వారు ఒకటే యూనిట్ అన్నారు. కాని, రెండు యూనిట్ల పనులు ప్రారంభమైనాయి. ఒక్కొక్కటి 800మెగావాట్ల చొప్పున, 2020 వ సంవత్సరంలో పూర్తిచేసే విధంగా ఒప్పందం కుదిరింది. భద్రాద్రి ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రిగారు రెండు సంవత్సరాల వ్యవధిలో పూర్తిచేస్తామని చెప్పారని అన్నారు. అది వందశాతం జరుగుతుంది. ముఖ్యమంత్రిగారు చెప్పింది అక్షర సత్యం అవుతుంది. అందులో సందేహమేమీ లేదు. అయితే ఈ విషయంలో NGT స్టే ఇవ్వడం, దాని వెనక ఎవరు ఉన్నారో అందరికీ తెలుసు. ఎవరైతేనేమి, తెలంగాణకు కరెంటు రావడం ఇష్టం లేనివాళ్లు, మిగతా ప్రాజెక్టులను ఆపడానికి ఏ విధంగానైతే ప్రయత్నం చేస్తున్నారో, అదే విధంగా తెలంగాణకు వెలుగులు రావడం ఇష్టం లేని వాళ్లు, తెలంగాణ చీకటిలోనే ఉంటుందని చెప్పిన వాళ్లు, వాళ్లవారసులు చేసిన కుట్ర తప్ప, మరొకటి కాదు. ఎవరనేది ప్రజలు అర్థం చేసుకుంటారు.

కొత్తగూడెంలో మరొక 800మెగావాట్ల ప్రాజెక్టు 2015 జనవరిలో మొదలుపెట్టడం జరిగింది. దానిని ఈ డిసెంబర్‌కి పూర్తిచేయబోతున్నాము. రికార్డు సమయంలో అంటే 36 నెలల్లో 800మెగావాట్ల ప్రాజెక్టు పూర్తిచెయ్యబోతున్నామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. (అధికారపార్టీ సభ్యుల హర్షధ్వానాలు) మనం వీలైనంత త్వరగా పవర్ షార్టేజ్‌నుండి బయటపడాలన్నది గౌరవ ముఖ్యమంత్రిగారి సంకల్పం. బిహెచ్ఇఎల్ దగ్గర యంత్ర సామాగ్రి సిద్ధంగా ఉంది. రాత్రింబవళ్లు కష్టపడి పనిచెయ్యాలి, ఆ రకంగా మనం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ముఖ్యమంత్రిగారు మాకు మణుగూరు ప్రాజెక్టు విషయంలో ఆదేశాలు ఇచ్చి, రెండు సంవత్సరాల కాలంలో పూర్తిచేయాలని ఆదేశించడం జరిగింది.

అదే విధంగా యాదాద్రికి సంబంధించి కూడా ఎల్ఓపిగారు కొంత అనుమానం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే మన దగ్గర టారిఫ్ చాలా తక్కువగానే ఉంది. ఒక మెగావాట్‌కి రూ.5.17కోట్లకి మనం బిహెచ్ఇఎల్‌కి ఇవ్వడం జరిగింది. దాని వలన మనకు రూ.4.57కి ఒక యూనిట్ లభించే అవకాశం ఉంది. కాబట్టి ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే, అది తక్కువ టారిఫ్‌గానే మనం భావించవలసి ఉంటుంది. మన ప్రజలకు లాభం చేకూరే విధంగానే ప్రభుత్వ విధానం ఉంటుందని చెప్పి, మనవి చేసుకుంటున్నాను.

అలాగే ఛత్తీస్‌ఘడ్ గురించి కూడా వారు ప్రస్తావించారు. అక్కడ ఇంకా టారిఫ్ నిర్ణయం కాలేదు. వారు చెప్పినట్లు రెండువేలు కాదు, కేవలం వెయ్యి మెగావాట్లకే మనం ఎంఓయు కుదుర్చుకున్నాము. ట్రాన్స్‌మిషన్ కాస్ట్ గురించి మాట్లాడుతూ చివరివరకు వారు చెల్లించాలి, కానీ మనం చెల్లిస్తున్నామన్నారు. అది కరెక్టు కాదు. వారి బార్డర్ వరకు వారే చెల్లిస్తున్నారు. తరువాత నుంచి మనం భరిస్తున్నాము.

అలాగే గౌరవ ఎల్ఓపిగారు రాబోయే అవసరాలకు ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉందని మనవి చేస్తున్నాను. గతంలో ఉన్న 6,700 మెగావాట్లు, ఇప్పుడు కొత్తగా మరొక 7,790 మెగావాట్లు కలిపి మొత్తం 14,000 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో ఉన్నామని సభకు తెలియజేస్తున్నాను. దీనికితోడు రాబోయే కాలంలో కొత్తగూడెంలో మరొక 800 మెగావాట్లు, భద్రాద్రి ప్రాజెక్టు ద్వారా 1,080 మెగావాట్లు, యాదాద్రి ద్వారా 4,000 మెగావాట్లు, మొత్తం 5,880 మెగావాట్లు అదనంగా పొందబోతున్నాము. ఇప్పటికే మనం 13,980 మెగావాట్లను కలిగి ఉన్నాము. అదనంగా జెన్‌కోకు 5,880 మెగావాట్లను యాడ్ చెయ్యబోతున్నాము. NTPC ద్వారా 4,000 మెగావాట్లు, సింగరేణి ద్వారా ఇంకొక 800 మెగావాట్లు, ఏర్పాటు చేసుకోవడానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. మొత్తం కలిపి 24658 మెగావాట్ల స్థాపిత సామర్థ్యానికి తెలంగాణ రాష్ట్రం చేరుకోబోతున్నదనే విషయాన్ని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

(అధికార పార్టీ సభ్యుల హర్ష ధ్వానాలు)

దీనికి అదనంగా మరొక 2500మెగావాట్ల సోలార్ విద్యుత్తు కూడా మనం పొందబోతున్నాము. 2024నాటికి

27158మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో తెలంగాణ రాష్ట్రం పూర్తి స్థాయిలో స్వావలంబన దిశగా ఉంటుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

గౌరవ సభ్యులు శ్రీ ఎన్. రామచంద్రరావుగారు మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా మరియు భారీ పరిశ్రమలకు విద్యుత్తు అందుబాటులో ఉంటుందా అని అడగడం జరిగింది. ఆ విషయంలో ఎటువంటి సందేహం అక్కరలేదు. పూర్తి స్థాయిలో 24గంటల విద్యుత్తును అందిస్తున్నాము. అదే విధంగా టారిఫ్ పెంచితే, ప్రజలపై భారం పడుతుందని చెప్పారు. ARR ప్రకారం టారిఫ్ పెంచుతారా అనే విషయం అడిగారు. వాస్తవానికి 2014-15 టారిఫ్ పెంచలేదు. 2015-16, 2016-17లో కేవలం 6శాతం, 7శాతం మాత్రమే పెంచడం జరిగింది. 2017-18లో టారిఫ్ పెంచలేదు. ఇతర మార్గాల ద్వారా నష్టాలను పూడ్చుకునే ప్రయత్నం చేస్తున్నాము. మనకు ఉన్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకుంటూ, వీలైనంత వరకు టారిఫ్ పెంచకుండానే విద్యుత్తు సంస్థల లోటును సరిచేసుకునే ప్రయత్నం చేస్తామని మనవి చేస్తున్నాను.

సోలార్ ప్లాంట్లు ఎన్ని జిల్లాలలో ఉన్నాయనే విషయం గురించి గౌరవ సభ్యులు అడిగినారు. ఒక్క హైదరాబాద్‌లో తప్ప, పాత తెలంగాణ 9 జిల్లాలలో ఈ సోలార్ ప్లాంట్స్ ఉన్నాయి. మొత్తం భారతదేశానికి కూడా మనమే ఆదర్శంగా నిలిచామనే విషయం నేను గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. వాస్తవానికి తెలంగాణ ఏర్పడేనాటికి మనకు సోలార్ విద్యుత్తు కేవలం ఒక్క మెగావాట్ మాత్రమే. కాని ఈ రోజు 2,700 మెగావాట్లకు చేరుకున్న విషయం సభ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. మరొక విషయం ఏమిటంటే సోలార్ పార్క్ విధానం అంతకుముందు ఉండేది. కాని దాని వలన line losses ఎక్కువగా ఉండే అవకాశం ఉండేది. ఆ ప్రాంతంలో మబ్బులు ఏర్పడితే ఉత్పత్తి మొత్తం ఆగిపోయే అవకాశం ఉంది కాబట్టి, surface విధానం ద్వారా వెళ్లాలని నిర్ణయం తీసుకుని, open bidding ద్వారా సోలార్ డెవలపర్స్‌ని పిలవడం జరిగింది. దాని వలన మంచి ఫలితాలు ఉంటాయి. ప్రతి సంవత్సరం కొన్ని వందల కోట్ల రూపాయల సేవింగ్ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం వారు కూడా దీనిని ఆమోదించి, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ పద్ధతిలో పోవాలని చెప్పడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ప్రారంభించిన పద్ధతినే కేంద్రం కూడా ఆదర్శంగా తీసుకోవడం జరిగిందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

గౌరవసభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్‌రెడ్డిగారు మాట్లాడుతూ, సోలార్ పవర్ విషయంలో ప్రోత్సాహకాలు తక్కువగా ఉన్నాయనీ, కొన్ని ఇబ్బందులు వస్తున్నట్లు తెలిపారు. కాని ఎక్కడా, ఎలాంటి ఇబ్బందులు లేవు. ప్రోత్సాహకాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టే మూడేళ్లకాలంలో తెలంగాణ ప్రభుత్వం 2,700 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టి, భారతదేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా పేరు తెచ్చుకుంది. మన తరువాత రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాలు ఉన్నాయి. ప్రోత్సాహకాలు కల్పించడంలో తెలంగాణ రాష్ట్రం ముందున్నది. ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు లేవు. డెవలపర్స్‌కి స్థానికంగా భూములు కొనుక్కోవడంలో ఏమైనా ఇబ్బందులు వస్తే వచ్చి ఉండవచ్చుగాని, ప్రభుత్వ పక్షం నుండి, డిస్కాంల వైపునుండిగాని లేదా ట్రాన్స్‌కో వైపు నుండి కాని ఎక్కడా కూడా ఎలాంటి చిన్న సమస్య కూడా లేదు. దేశం మొత్తం మీద మన పాలసీయే మంచిగా ఉందని చెప్పి డెవలపర్స్ అంతా చాలా సంతోషంగా ఉన్నారు. దీనినే మిగతా చోట్ల కూడా అమలు చేయాలని చెప్పి వారు కోరుతున్నారు.

గౌరవ సభ్యులు శ్రీ ఎన్. రామచంద్రరావు గారు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న క్రెడిట్ సౌకర్యం గురించి మాట్లాడారు. చెప్పాలంటే కేంద్రప్రభుత్వం నుండి మనకు వస్తున్న అదనపు సబ్సిడీ ఏమీ లేదు. మనం DDUGJY(Deen Dayal Upadhyaya Gram Jyoti Yojana) క్రింద రూ.10వేల కోట్లు అడిగితే, రూ.800కోట్లు ఇచ్చినారు. Power to all అనే కార్యక్రమం క్రింద ఈ సబ్సిడీ మనకు అందింది. ఉదయ్ స్కీంలో చేరడం వలన మనకు రూ.10వేల కోట్లు అప్పు ఉంటే, రూ.8వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. దాని వలన మనకు ప్రతి సంవత్సరం రూ.200కోట్ల వడ్డీ సేవ్ అవుతుంది. ఇది కేంద్ర ప్రభుత్వం నుండి మనకు వచ్చిన అదనపు లాభం. రాష్ట్రప్రభుత్వమే విద్యుత్ సంస్థలకు నష్టం రాకుండా ఉండడానికి రూ.5వేల కోట్ల క్రాస్ సబ్సిడీ ఇస్తున్నదనే విషయాన్ని గౌరవ సభ్యులకు ఈ సభ ద్వారా తెలియజేస్తున్నాను.

ఈ రోజున కేంద్ర ప్రభుత్వం రుణాలను విరివిగా మంజూరు చేసే పరిస్థితి ఉంది. వాస్తవానికి ప్రభుత్వేతర ఆర్థిక సంస్థలు రుణం ఇవ్వడానికి ముందుకు వచ్చినప్పటికీ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలనే ఎంకరేజ్ చెయ్యాలని ముఖ్యమంత్రిగారి పాలసీలో భాగంగా RECవంటి సంస్థల నుండే ఋణం తీసుకుంటున్నాము. అదే విధంగా జెన్‌కో

ద్వారా చేపట్టే అన్ని ప్రాజెక్టులని కూడా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన BHELకే ఇస్తున్నామనే సంగతి కూడా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను. మన విద్యుత్ సంస్థలు చాలా పారదర్శకంగా, భారతదేశంలోనే ఇతరులకు ఆదర్శంగా ఉండే పద్ధతులలో పనిచేస్తున్నాయని తెలియజేస్తున్నాను. అలాగే సౌభాగ్య అనే పథకం ద్వారా రూ.500చెల్లిస్తే కనెక్షన్ ఇచ్చే పథకం ఉంది. చెప్పాలంటే మన దగ్గర చాలా తక్కువగా ఉపయోగపడుతుంది. ఇతర రాష్ట్రాలవారికి ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఎందుకంటే దేశంలో దాదాపు 40శాతం వరకు electrification కాని గ్రామాలు ఉన్నాయి. వారికి ఈ పథకం ప్రయోజనకరంగా ఉంటుంది. మన దగ్గర అన్ని గ్రామాలకి electrification పూర్తయింది. ఇంతకాలం కనెక్షన్ తీసుకోని వారిని, అక్రమంగా విద్యుత్తుని వాడుకునే వారిని చట్టబద్ధంగా కనెక్షన్ పొందే విధంగా ప్రోత్సహిస్తున్నాము. డిస్కాంలు వారికి తక్కువలో విద్యుత్తుని అందిస్తూ, బాగా ప్రోత్సహిస్తున్నాయి. కేంద్రం ద్వారా వచ్చే అన్ని పథకాలను కూడా మనం వాడుకుంటున్నాము.

గౌరవ ఎల్ఓపిగారు మాట్లాడుతూ ఈ రోజు సభలో చర్చ జరుగుతున్నది కాబట్టి రాష్ట్రంలో రైతులకు 24గంటల విద్యుత్తుని అందిస్తున్నారని చెప్పారు. కాదు అధ్యక్షా. గత రెండు మాసాల నుండి మూడు జిల్లాలలో 24గంటల విద్యుత్తుని రైతులకు ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చిన విషయం గౌరవ సభ్యులందరికి కూడా తెలుసు. మొన్న ఈ విషయం గురించి ముఖ్యమంత్రిగారితో చర్చించినప్పుడు రాష్ట్రం మొత్తం ఈ విధానాన్ని అమలుచేయడానికి మీరు సిద్ధంగా ఉన్నారా అని వారు మమ్మల్ని అడిగినప్పుడు, అన్ని చోట్ల పంపిణీకి, సరఫరాకు లైన్లు పూర్తికావచ్చాయని, ప్రయోగం చేయవచ్చని చెప్పగా, ముఖ్యమంత్రిగారు వెంటనే రైతాంగానికి 24 గంటల విద్యుత్తును ఇచ్చే విషయంలో మొదటగా ఒక మూడు జిల్లాలకు ఇచ్చి, సమస్యలు ఏమైనా ఉంటాయేమో చూసి, తరువాత దానిని రాష్ట్రమంతటా అమలుచేద్దామని చెప్పడం జరిగింది.

ఈ సందర్భంలో సభ్యులు శ్రీ సుధాకర్ రెడ్డిగారు మాట్లాడుతూ రైతులేమో 24గంటల విద్యుత్తుని వద్దంటున్నారు, ఆ విషయాన్ని కూడా పరిశీలన చెయ్యండని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం వెనుకకు పోవడానికి సిద్ధంగా లేదు. భారతదేశంలో మొదటి రాష్ట్రంగా అన్ని వర్గాల ప్రజలకు 24గంటల నాణ్యమైన విద్యుత్తుని అందించడంలో తెలంగాణ రాష్ట్రం రికార్డు సృష్టించింది. కొత్త రాష్ట్రం అయినప్పటికీ, అధికారంలోకి వచ్చే నాటికి విద్యుత్ రంగంలో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ, ప్రజలందరిలో ఒక అనుమానం ఉన్నప్పటికీ, ఇబ్బందులను అన్నిటినీ అధిగమించి, అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలిగిన నాయకుడు శ్రీ కెసిఆర్‌గారు మాత్రమే. ఈ దేశంలో అన్ని విషయాల పట్ల, అన్ని రంగాల గురించి పూర్తి అవగాహన కలిగిఉన్న నాయకుడు మన ముఖ్యమంత్రిగారు కాబట్టే ఈ రోజు మనం ఇంత గొప్ప విజయాన్ని సాధించుకోగలిగాము. తప్పకుండా 24గంటలు నాణ్యమైన విద్యుత్తుని అన్ని రకాల వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తాము. రైతులకు 24గంటలు అందుబాటులో పెట్టినంత మాత్రాన, 24గంటలు మోటర్లు నడుపుకోమని కాదు. ఈ రోజు మనం ఈ సమావేశ మందిరంలో ఎంతసేపు అవసరముంటే అంత సేపు మాత్రమే లైట్లు వాడుకుంటాము, ఫ్యాన్లు వాడుకుంటాము, ఎ.సి.లు వాడుకుంటాము. అలాగే విద్యుత్ వినియోగదారులు కూడా ఎప్పుడు అవసరముంటే అప్పుడు, 24 గంటల్లో వారికి ఎప్పుడు సమయం లభిస్తే అప్పుడు వెళ్లి ఆ విద్యుత్తుని వినియోగించుకోవాలి. వారి పంపుసెట్లను వాడుకోవాలి. ఆ రకంగా వారికి వెసులుబాటుని ఇవ్వాలనే ఉద్దేశ్యంతోటి గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ కార్యక్రమాన్ని తీసుకున్నారు. ఇప్పటికే విద్యుత్ రంగం 90శాతం విజయం సాధించింది. మిగిలిన 10శాతం కూడా రైతాంగానికి నాణ్యమైన విద్యుత్తుని అందుబాటులోకి తీసుకువచ్చి, తెలంగాణ ప్రజలు మా ప్రభుత్వంపైన, గౌరవ ముఖ్యమంత్రిగారి పైన పెట్టుకున్న ఆశల్ని నిలబెట్టుకోవడంలో పూర్తి విజయం సాధిస్తామని తెలియజేస్తూ, చర్చలో పాల్గొన్న గౌరవ సభ్యులందరికి అన్ని అనుమానాలు కూడా నివృత్తి అయినాయని భావిస్తూ, సెలవు అధ్యక్షా.

1.40 మ. **శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి:-** అధ్యక్షా, పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ల ప్రకారం మనం ప్రైవేటు వాళ్ల దగ్గర నుంచి కరెంటును కొనకపోతే యూనిట్‌కి 90 పైసల లాస్ మాత్రమే ఉంటుంది. జెన్కోలో 11వేల మిలియన్ యూనిట్ల ప్రొడక్షన్ స్టాప్ అయితే, ఒక రఫ్ ఎస్టిమేషన్ ప్రకారం ఒక యూనిట్ రూ.5.90పైసల నుంచి రూ.6.10పైసల వరకు ప్రైవేటు వాళ్లకు డిస్కమ్స్ చెల్లించాలి, అది సుమారుగా రూ.500కోట్లు అవుతుంది. దాని గురించి ఏమైనా ఆలోచిస్తున్నారా? ఒకవేళ అగ్రిమెంటు ప్రకారం వాళ్ల దగ్గర కొనకపోతే మనకు వచ్చే నష్టం యూనిట్‌కి 90 పైసలు మాత్రమే. ఏ రకంగా చూసినా మనకు బెనిఫిట్ ఉంటుంది. 12వేల మంది ఉద్యోగులు, వారి ప్రమోషన్స్, ఎక్కడైనా

ఇబ్బందులున్నాయా అని అడిగాము, దానికి సమాధానం రాలేదు.

రాష్ట్రంలో 24గంటలు కరెంటు ఇవ్వడాన్ని మేము స్వాగతించాం, మా యల్ఓపి గారు, అందరమూ స్వాగతించాం. లోకల్గా టెక్నికల్గా ఇబ్బందులు లేకుండా అవేర్నెస్ ప్రోగ్రాము టేకప్ చేయమని మాత్రమే చెప్పాం. ఇగ్నోరెన్స్తో ఆన్ చేసుకుంటే మీటర్లు కాలిపోకుండా స్థానికంగా డిపార్టుమెంటులో అవేర్నెస్ ప్రోగ్రాము టేకప్ చేయడం ముఖ్యమని చెబుతున్నాం.

**శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్:–** నేను కూడా కాదనడం లేదు. నేను ఒకే ఒక ప్రశ్న అడుగుతున్నాను. దాదాపు 24వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది రాబోయే రోజుల్లో అని వీరొక రోడ్డు మ్యాపు ఇచ్చారు. భద్రాద్రి - 1030 మెగావాట్లు, యాదాద్రి–4000 మెగావాట్లు, రామగుండం–800 మెగావాట్లు, మంచిర్యాల–800 మెగవాట్లు, ఎన్టిపిసి–రెండు యూనిట్లలో 1600 మెగావాట్లు, మొత్తం కలిపితే 8480 మెగావాట్లు అవుతుంది. వీరు 24000 మెగావాట్లకు రోడ్లు మ్యాపు ఇచ్చారు. కానీ ఇప్పుడు వీరు ప్రారంభించింది మాత్రం 8480 మెగావాట్లకి. ఇంకా 16000 మెగావాట్లను అదనంగా ఎలా తీసుకురాబోతున్నారో దయచేసి మంత్రిగారి దగ్గర వివరాలుంటే ఇవ్వాలని కోరుతున్నాను.

**శ్రీ జి. జగదీష్ రెడ్డి:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన విషయాల గురించి చెబుతున్నాను. 02.06.2014 నాటికి టియస్ జెన్కో స్థాపిత సామర్థ్యం : థర్మల్ - 2282.50 మెగావాట్లు, హైడల్–2081.76 మెగావాట్లు, సోలార్–1 మెగావాట్, మొత్తం కలిపి 4365.26 మెగావాట్లు. టియస్ జెన్కోకి సంబంధించి 4365.26 మెగావాట్లయితే, యన్టిపిసి రామగుండం ద్వారా 340 మెగావాట్లు, సింహాద్రి టిపియస్ -1 ద్వారా 560 మెగావాట్లు, సింహాద్రి టిపియస్–2 ద్వారా 250 మెగావాట్లు, తాల్చేరు–650 మెగావాట్లు, గ్యాస్ అండ్ అదర్స్–69 మెగావాట్లు, థర్మల్ పవర్టెక్–270 మెగావాట్లు, మొత్తం 6574.26 మెగావాట్లు మనకు ఈరోజున్న స్థాపిత సామర్థ్యం. ఆ తర్వాత థర్మల్లో కెటిపిపి–2 ద్వారా 600 మెగావాట్లు, టియస్ జెన్కో–960 మెగావాట్లు, హైడల్ లోయర్ జూరాల 240 మెగావాట్లు, పులిచింతల–120 మెగావాట్లు ఎస్సిసియల్–1200 మెగావాట్లు, సోలార్–2792 మెగావాట్లు, విండ్–100 మెగావాట్లు, నేచురల్ గ్యాస్ జనరేటింగ్ స్టేషన్స్–262 మెగావాట్లు, థర్మల్ పవర్టెక్–670 మెగావాట్లు, ఐపిపి గ్యాస్–925.87 మెగావాట్లు, ఛత్తీస్ఘడ్ నుంచి 1000 మెగావాట్లు, మొత్తం కలిపి 7790.67 మెగావాట్ల స్థాపిత సామర్థ్యాన్ని మనం యాడ్ చేశాం. ఇంతకు ముందున్న 6574 మెగావాట్లకు ఇప్పటికి మనం 7790 మెగావాట్లు యాడ్ చేశాం. 30.9.2017 నాటికి తెలంగాణ రాష్ట్రం మొత్తం 14364.93 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో ఉన్నది. దీని తర్వాత కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ నుంచి ఇంకొక 800 మెగావాట్లు, భద్రాద్రి థర్మల్ స్టేషన్ నుంచి 1080 మెగావాట్లు, యాదాద్రి నుంచి 4000 మెగావాట్లు మళ్లీ అడిషనల్గా చేపడుతున్నాం. ఇది మొత్తం 5880 మెగావాట్లు. మేము ఇంతకు ముందు చెప్పింది 2024కి రోడ్డు మ్యాప్. దాని తర్వాత ఎన్టిపిసి ద్వారా 4000 మెగావాట్లు, ఎస్సిసియల్– 8000 మెగావాట్లు కలిపి 24658 మెగావాట్లు అవుతుంది. సోలార్లో 2500 మెగావాట్లు పెంచాలనే ఆలోచన ఉంది. ఇదంతా మొత్తం కలిపి 27158 మెగావాట్లు. ఇది 2024 సంవత్సరం నాటికి విద్యుత్ ఉత్పాదనకి సంబంధించిన మా రోడ్డు మ్యాపు అని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఉద్యోగులకు సంబంధించి అడిగారు. తెలంగాణ ఉద్యోగులకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో చేస్తున్న ప్రయత్నాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి సహకారం లభించడం లేదు. వాళ్లు కొన్ని సమస్యలు సృష్టిస్తున్నారు. వాళ్ల ఉద్యోగులను వాళ్లు న్యాయంగా తీసుకోకుండా కోర్టు పేచీలు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు. దాంట్లో కొంత ప్రయత్నం చేస్తున్నాం. ఎంత వీలైతే అంత చట్టాలలోని అవకాశాలను ఉపయోగించుకొని ముందుకు పోయే ప్రయత్నం చేస్తున్నాం. కొన్ని సందర్భాలలో మనకు ఎదురవుతున్న అనుభవాలు గౌరవ సభ్యులకు తెలుసు. రాష్ట్ర ప్రయోజనాల రీత్యా అంతకంటె ఎక్కువ మాట్లాడడానికి వీలు లేదు.

ప్రైవేటు పర్చేజ్ అగ్రిమెంట్ల ద్వారా మనకు జరగబోయే నష్టం ఎక్కువ, వాళ్ల దగ్గర నుంచి కొనుగోలు తగ్గించుకుంటే తక్కువ లాస్ ఉంటుందని చెప్పారు. ఒక్క రూపాయి కాదు, ఒక్క పైసా మనకు లాభమయ్యే అవకాశం ఉంటే ఆ పని మాత్రమే చేస్తున్నాం, వీలైనంత వరకు వాళ్ల నుంచి కొనుగోలు తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నాం. పియల్యఫ్ కి సంబంధించి కొత్త ప్లాంటు ఎస్సిసియల ను ఎంకరేజ్ చేయాలని జెన్కోనైనా సరే కొంత బ్యాక్ డౌన్ చేసుకుంటున్నాం.

మొన్న అనుకోకుండా శ్రీశైలం పవర్ స్టేషన్ నుంచి జల విద్యుత్ వచ్చింది. ఒక్క క్షణం కూడా పవర్ పోకుండా సిద్ధంగా ఉండాలి కాబట్టి, మనం ఆ రకంగా సప్లై చేస్తున్నాం. ఇది అనుకోకుండా వచ్చిన విద్యుత్. ఆవిధంగా వచ్చిన సందర్భంలో, జెన్కో ఆధ్వర్యంలో ఉండే ప్లాంట్లకు సంబంధించి కొంత బ్యాక్ డౌన్ చేసుకున్నాం. ప్రైవేటుకి సంబంధించి ఎంతవరకు చేయాలో అంతవరకు చేస్తూ, జెన్కోకి సంబంధించి కొంత బ్యాక్ డౌన్ చేశాం. ఎస్‌సిసియల్ కొత్త ప్లాంటు కాబట్టి దాన్ని ఎంకరేజ్ చేశాం. వీలైనంత వరకు పైసలు ఎలా మిగుల్చుకోవాలి, ఈ రాష్ట్ర ప్రజలకు ఎలా ఉపయోగపడాలి, ఎలా నష్టాలు తగ్గించుకోవాలో ఆలోచిస్తున్నాం. ప్రైవేటు వాళ్లను మాత్రం కట్ చేస్తున్నాం. చివరి పైసా వరకు ఎలా తగ్గించుకోవాలి, ఏమి చేయాలో, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎలా ఉపయోగపడాలో, తెలంగాణ డిస్కమ్స్‌లో ఉన్న వినియోగదారులు ఎలా ఉపయోగించుకోవాలో అదే ప్రయత్నంలో మా తెలంగాణ ప్రభుత్వం ఉంటుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్:-** మంగళవారం, 07.11.2017 ఉదయం 10.00 గంటలకు తిరిగి సమావేశమయ్యేందుకు సభను వాయిదా వేయడమైంది.

(Then the House adjourned at 1.45 P.M. to meet again at 10.00 A.M. on 7th November, 2017.)

☺☺☺

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana  Legislative Council and Printed at  the Assembly Press, Public Gardens, Hyderabad.”**